

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 316

సోమవారం 29-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫైనల్లో 'కప్' వదిలేశారు

ఆసియా కప్ టి20 టోర్నీలో భారత మహిళలపై శ్రీలంక విజయం - 14లో



ఆదాయ పన్ను.. ఆదా ఎలా?

పాత, కొత్త ఆదాయ పన్ను విధానాలపై సమగ్ర కథనం - 13లో



ఛీర్ ఫర్ భారత్

ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు మద్దతుగా నిలవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



అండర్ డాగ్‌నే..

'అండర్ డాగ్‌గానే అమెరికా అధ్యక్ష బరిలోకి దిగా. ప్రజల అండతో గెలుస్తా' అని డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ చెప్పారు.

వివరాలు 6లో ▸



'బెయిల్'పై సేఫ్ గేమ్ వద్దు

బెయిల్ అర్జీల విషయంలో ట్రయల్ కోర్టుల జడ్జీలు 'సేఫ్ గేమ్' ఆడుతున్నారని సుప్రీంకోర్టు సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.

వివరాలు 6లో ▸



హెజ్బొల్లా దాడి.. 12 మంది మృతి

ఇజ్రాయెల్ ఆక్రమిత గోలాన్ హైట్స్‌పై హెజ్బొల్లా దాడిలో 12 మంది మరణించారు. దీనిపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸




ఉపాధికి హాని!

నిరుపేదల పొట్టగొడుతూ పనులపై రాజకీయ గునపం

టీడీపీ నేతల ఒత్తిళ్లతో రాష్ట్రంలో ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

- తమవాళ్లనే నియమించాలంటూ అధికారులకు బెదిరింపులు
- డబ్బులు వసూలు చేసుకుంటూ అధికార పార్టీ నేతల దందా
- అటు పొలం పనులు సాగక.. ఇటు ఉపాధికి దూరమై పేదల అవస్థలు
- ఉపాధి హామీ యాక్టివ్ జాబ్ కార్డుదారుల సంఖ్య 56.15 లక్షలు
- రాష్ట్రంలో సగానికి పైగా పంచాయతీల్లో వారం పాటు ఉపాధి పనులే లేవు
- గతేడాది జూలైలో 2.23 కోట్ల పనిదినాలు
- ఈ ఏడాది జూలైలో 67 లక్షలే
- కరోనాలోనూ పనులు కల్పించి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2లో



2 నెలల క్రితం రోజూ 20 లక్షల మందికి పైగా ఉపాధి పనులు పొందగా.. గత శుక్రవారం 1,93,190 మందికి మాత్రమే ఉపాధి దక్కింది.



మను మురిపించె

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ

- కాంస్య పతకం గెలిచిన షూటర్ మను భాకర్
- ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు
- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో మూడో స్థానం

12లో

'మను'సంతా పతకమే



బ్రెజిల్ డ్రగ్స్ కంటైనర్ కేసు ఏమైంది?

- దీనిని దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా మెరైన్ కంపెనీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు బంధువులదే
- రూ.25 వేల కోట్లు అంటే చిన్న విషయం కాదు.. రాష్ట్ర సర్కార్ విచారణ జరిపించాలి
- ఉత్తరాంధ్ర ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్నించాలి
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్

3లో



పోలవరం కాలువ గట్టు మట్టి బొక్కేస్తున్నారు

- అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న టీడీపీ నేతలు
- టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టి తరలింపు
- భారీగా జేబులు నింపు కొంటున్న తెలుగు తమ్ముళ్లు
- తవ్వకాలతో బలహీనపడుతున్న గట్టు.. ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

10లో

Caption: ఢిల్లీలో ఘటన జరిగిన రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్





తానియా సోని

ఆశలు జలసమాధి

ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో తీవ్ర విషాదం

నీట మునిగి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతి

భవనం బేస్‌మెంట్‌లోని లైబ్రరీని ముంచెత్తిన వరద

తెలంగాణకు చెందిన తానియా సోనీ, యూపీవాసి శ్రేయ యాదవ్, కేరళవాసి నెవిన్ డెల్విన్ దుర్మరణం

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దుర్ఘటన జరిగిందని ప్రతిపక్షాల ఆగ్రహం

కోచింగ్ సెంటర్ యజమాని, కో-ఆర్డినేటర్ అరెస్టు

10లో



టై'ఘర్'

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

పెద్దపులులకు పుట్టినిల్లు భారతదేశం

ప్రపంచంలోని పులుల్లో 75% మనదేశంలోనే..

2లో

టీడీపీ ఎంపీలతో చంద్రబాబు భేటీ

ముగిసిన 2 రోజుల ఢిల్లీ పర్యటన



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం టీడీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. అధికారిక నివాసంలో అందుబాటులో ఉన్న ఎంపీలతో సమావేశమై తాజా పరిస్థితులు.. పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించారు. అనంతరం పర్యటన ముగించుకొని విజయవాడకు బయల్దేరారు.

పచ్చ మీడియా డైరెక్షన్..

పోలీసుల ఓవరాక్షన్!

మదనపల్లె అగ్ని ప్రమాదం ఘటనలో ఏకపక్షంగా విచారణ

- ఆగమేఘాలపై సోదాలు.. రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యం
- రహస్యంగా విచారణ జరిగితే ఎల్లో మీడియాకు లీకులిచ్చిందెవరు?
- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాలిపోతే డిజిటల్ రికార్డులు ఉంటాయి కదా?



ఎల్లోమీడియాలో ప్రచురించిన వార్త



ఇటీవల డీజీపీ విచారణ జరుపుతున్న సమయంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లి వస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటన అనంతరం జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తే ఓ పథకం ప్రకారం జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఫైళ్లు కాలిపోతే రెవెన్యూ కార్యాలయాల్లో డిజిటల్ రికార్డులు ఉంటాయి కదా? ఆర్డీవో, సీసీఎల్‌ఏ కార్యాలయాల్లో సంబంధిత రికార్డులు భద్రంగానే ఉంటాయి. కనీసం ఫైళ్ల వెరిఫికేషన్ చేయకపోవడం..

మిగతా 5వ పేజీలో ▶

ప్రాభవం కోల్పోతున్న గ్రానైట్ పరిశ్రమ



బతుకుపై గుదిబండ

- టైల్స్ దెబ్బతో కుదేలు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- పొట్ట చేతబట్టుకుని స్వస్థలాలకు పయనం

గతం ఘనం.. ప్రస్తుతం అధ్వానం అన్న చందాన గ్రానైట్ రంగం పరిస్థితి తయారైంది. ఒకప్పుడు వెలుగు వెలిగిన ఈ పరిశ్రమ క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. టైల్స్ అందుబాటులోకి రావడం గ్రానైట్ రంగానికి శరాఘాతంగా మారింది. ఈ క్రమంలో ఉపాధి కరువై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఇక్కడ నెలకొల్పిన గ్రానైట్ బండల తయారీ యూనిట్లు వేల సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పించేవి. రాయలసీమలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాదికి చెందిన పలు రాష్ట్రాల కార్మికులు వీటిలో పనిచేసేవారు. వ్యవసాయ పనుల్లో వచ్చే ఆదాయంతో పోల్చుకుంటే కూలి ఎక్కువగా ఉండటంతో కుటుంబాలతో సహా వచ్చి ఉపాధి పొందేవారు. గ్రానైట్ యూనిట్ల నిర్వాహకులు రూ. వేలకు వేలు అడ్వాన్సులు చెల్లించి కార్మికులను తీసుకొచ్చేవారు. వారితోపాటు కుటుంబ సభ్యుల కోసం షెల్టర్లు ఏర్పాటు చేసి అన్ని వసతులు సమకూర్చేవారు.

పరిస్థితి తలకిందులు..

ఒకప్పుడు ఎంతో మందికి ఉపాధి కల్పించిన గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి నేడు తలకిందులుగా మారింది. గతంలో తాడిపత్రి ప్రాంతంలో 650 వరకు గ్రానైట్‌పాలిషింగ్ యూనిట్లు ఉండగా నేడు వాటిలో సగం కూడా పనిచేయడం లేదు. ఇతర రాష్ట్రాల కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఉన్న కొద్దిమంది కార్మికులకు యూనిట్ల నిర్వాహకులు జీతాలు తగ్గించేశారు. అయినా, వేరే దారి లేక ఇక్కడే నెట్టుకొస్తున్నారు.

గుజరాత్ టైల్స్ దెబ్బ..

గ్రానైట్ యూనిట్లకు గుజరాత్ టైల్స్ దెబ్బపడింది. గ్రానైట్‌తో పోలిస్తే తక్కువ ధరకు దొరుకుతుండడంతో ప్రజలు టైల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. టైల్స్‌లో వందల రకాలు అందుబాటులో ఉండడంతో అటువైపు మొగ్గు చూపుతున్నారు. గ్రానైట్ బండల రవాణా ఖర్చు కూడా అధికంగా ఉంటోంది. అడుగు గ్రానైట్ తరలింపునకు రవాణా ఖర్చు రూ. 15 అయితే, గుజరాత్ టైల్స్ రవాణాలో అడుగుకు కేవలం రూ.5 వరకూ ఖర్చవుతోంది. గ్రానైట్ బరువు కూడా ఎక్కువే. గుజరాత్ టైల్స్ అడుగు బరువు కిలో వరకు ఉండగా గ్రానైట్ బరువు అడుగు రెండు నుంచి మూడు కిలోలు ఉంటుంది. అన్ని రకాలుగా సౌలభ్యంగా ఉండడంతో వ్యాపారులు కూడా గ్రానైట్ బండలు కొనడం మానేసి, టైల్స్ విక్రయాలు చేయడం ప్రారంభించారు. ఇక.. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో నాణ్యత కలిగిన గ్రానైట్ గనులు లేవు. 300 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న కనిగిరి తదితర ప్రాంతాల్లో ఉన్న గనుల నుంచి ముడిసరుకు రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో సరుకు రవాణా వ్యయం పెరగడం, యూనిట్లలో వాటిని కట్ చేసి పాలిష్ చేయడానికి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇలా గ్రానైట్ యూనిట్లు కుదేలవుతున్నాయి. వాటినే నమ్ముకున్న కార్మికులకు ఆవేదన మిగులుస్తున్నాయి.



చింతూరులో వరదనీటిలో ఆందోళన చేస్తున్న బాధితులు

మరింత పెరిగిన గోదావరి

14లో

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 15.90 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక.. భద్రాచలం వద్ద ప్రమాదకరంగా ప్రవాహం

పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల నుంచి 13.35 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల

ఎగువన వర్షాలు తెరిపి ఇవ్వడంతో క్రమంగా తగ్గుముఖం

రేపు శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 3.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో 18 వేల క్యూసెక్కులు విడుదల
- కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల తరలింపు
- నేడు శ్రీశైలంలోకి మరింత వరద

14లో

ఇదండీ సంగతి



క్లుప్తంగా...

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరిగింది
కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని




గుంటూరు మెడికల్‌: కేంద్ర బడ్జెట్లో ఏపీకి జరిగిన న్యాయం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రి డాక్టర్‌ పెమ్మసాని చంద్రశేఖర్‌ చెప్పారు. ఆయన ఆదివారం గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా కేంద్రం నిధులు ఎలా ఉంటాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే అమరావతికి రూ.15 వేలకోట్లు, రైల్వేలకు నిధులు కేటాయించారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కావలసిన నిధులు, రూ.15 వేలకోట్లతో ఔటర్‌ రింగ్‌రోడ్డు నిర్మాణం, దాదాపుగా రూ.80 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని బడ్జెట్‌లో నిర్ణయించినట్లు చెప్పారు. అమరావతి రాజధాని అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఏపీలో 50 కోట్లతో పోస్టల్‌ డిపార్ట్‌మెంట్‌ కమ్యూనికేషన్‌ బిల్డింగ్‌ నిర్మిస్తామని చెప్పారు.

క్యుయెట్‌-యూజీ ఫలితాల విడుదల



న్యూఢిల్లీ: కామన్‌ యూనివర్సిటీ ఎంట్రెన్స్‌ టెస్ట్‌(క్యుయెట్‌)-యూజీ ఫలితాలను నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ఆదివారం విడుదల చేసింది. వాస్తవానికి ఫలితాలను జూన్‌ 30వ తేదీన విడుదల చేయాల్సి ఉంది. నీట్‌-యూజీ, యూజీసీ-నెట్‌ తదితర పోటీ పరీక్షల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఈసారి క్యుయెట్‌-యూజీ ఫలితాల విడుదల ఆలస్యమైంది. జూలై 7న తేదీనే ఫలితాలను విడుదల చేసినప్పటికీ వెయ్యి మందికి పైగా అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు వీలుగా వాయిదా వేశారు. ఎన్‌టీఏ వీరికోసం జూలై 19వ తేదీన మరోసారి పరీక్ష నిర్వహించి తాజాగా ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 261 ప్రభుత్వ, ప్రైవేట్‌, డీమ్డ్‌, ప్రైవేట్‌ యూనివర్సిటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌ విధానాల్లో జరిగిన ఈ పరీక్ష కోసం 13.4 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారు.

కశ్మీర్‌లో మండుతున్న ఎండలు



శ్రీనగర్‌: కశ్మీర్‌ లోయలో ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం శ్రీనగర్‌లో 36.2 డిగ్రీల సెల్సియస్‌ ఉష్ణోగ్రత నమోదైంది. జులైలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కావడం 25 ఏళ్లలో ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు. 1999 జూలై 9వ తేదీన 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని గుర్తు చేశారు. అయితే, 1946 జూలై 10వ తేదీన శ్రీనగర్‌లో అత్యధికంగా 38.3 డిగ్రీల నమోదైనట్లు వివరించారు. ఆదివారం దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగుండ్‌లో 35.6 డిగ్రీలు, కోకెర్‌నాగ్‌ పట్టణంలో 34.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. వచ్చే 24 గంటల్లో ఎండల తీవ్రత తగ్గి, అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

జలతారు వెన్నెల..



సారంగాపూర్‌(జగిత్యాల): జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌ మండలంలోని అడవుల్లో కొండలపై నుంచి పాల నురగలా దూకుతున్న జలపాతం కట్టిపడేస్తోంది. పదిరోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో ఆదివారం ఈ సుందర దృశ్యం సాక్షాత్కరించింది. ప్రతీ వర్షాకాలంలో నెలరోజుల పాటు బీర్‌పూర్‌ శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ సమీపంలోని పెద్దగుట్ట ప్రాంతంలో కొండలపై నుంచి ఈ జలపాతం కనువిందు చేస్తుంది. జలపాతాన్ని తిలకించేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలవారు తరలి వస్తుండటంతో సందడి నెలకొంది.

టైగర్‌ 'ఘర్‌'

పెద్దపులులకు పుట్టినిల్లు భారతదేశం
ప్రపంచంలోని పులుల్లో 75శాతం మనదేశంలోనే...
నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



అడవిలో పెద్దపులి... ఉంటే ఆ ప్రాంతమంతా వృక్ష సంపద, పచ్చదనం, వన్యప్రాణులతో పరిఢవిల్లుతుంది. వాతావరణం సమతుల్యంగా ఉంటుంది. అందువల్ల అంతరించిపోతున్న పెద్దపులులను సంరక్షించేందుకు పర్యావరణవేత్తలు, ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. క్రమంగా దేశంలో పులుల సంఖ్య పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 2006లో 1,411 పులులు ఉండగా, 2023లో ఆ సంఖ్య 3,682కు చేరినట్లు 'ప్రాజెక్ట్‌ టైగర్‌' ప్రారంభించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించారు. ప్రపంచంలోని పులుల్లో 75శాతం మన దేశంలోనే ఉన్నట్లు అంచనా. రాష్ట్రంలోనూ పులుల సంతతి సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతోంది. కొత్త ప్రాంతాల్లోనూ పులులు సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

సాక్షి నెట్‌వర్క్‌: ఒకప్పుడు పులులకు భారతదేశం పుట్టినిల్లు. అటువంటిది వివిధ కారణాల వల్ల పులుల సంఖ్య అనూహ్యంగా తగ్గిపోయింది. దానివల్ల వాతావరణ సమతుల్యం దెబ్బతింటోంది. ఈ క్రమంలో పులులను కాపాడుకోవడంతోపాటు వాటి సంతతిని పెంచాల్సిన ఆవశ్యకతను పర్యావరణవేత్తలు, పాలకులు గుర్తించారు. ఇందులో భాగంగా మన దేశంలో 1972లోనే వైల్డ్‌ లైఫ్‌ యాక్ట్‌ చేశారు. అప్పటి నుంచి పులుల వేటను నిషేధించారు. దానికి కొనసాగింపుగా అంతరించిపోతున్న పులులను కాపాడుకునేందుకు 1973లో 'ఆపరేషన్‌ టైగర్‌' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా పులులను పరిరక్షించాలనే లక్ష్యంతో రష్యాలోని సెయింట్‌ పీటర్స్‌బర్గ్‌లో 2010 సంవత్సరంలో జరిగిన అంతర్జాతీయ టైగర్‌ సమ్మిట్‌లో జూలై 29వ తేదీని 'ప్రపంచ పులుల దినోత్సవం'గా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా జూలై 29వ తేదీన ప్రపంచ పులుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. పులుల సంరక్షణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పులులు ఎక్కువగా ఉన్న మూడు రాష్ట్రాలు	మధ్యప్రదేశ్‌	కర్ణాటక	ఉత్తరాఖండ్‌
	785	563	560

ఆంధ్రాలో 75 పెద్దపులులు

రాష్ట్రంలో కూడా పెద్ద పులుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలోని నాగార్జునసాగర్‌-శ్రీశైలం టైగర్‌ రిజర్వ్‌ ప్రాజెక్ట్‌ కింద పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రభుత్వం 2007లో ప్రకటించిన ప్రకారం ఆంధ్రాలోని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల అటవీ ప్రాంతాలు టైగర్‌ రిజర్వ్‌ జోన్‌లో ఉన్నాయి. కడప, నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలోని శేషాచలం రిజర్వు, గోదావరి జిల్లాల్లోని పాపికొండలు ప్రాంతంలోనూ పులుల జాడ కనిపించింది. మన రాష్ట్రంలో 2014లో 40 పులులు ఉండగా, 2023 నాటికి 75కు పెరిగాయి.

ఆంధ్రాలో పులులు ఎక్కడ ఉన్నాయంటే...

నాగార్జునసాగర్‌, శ్రీశైలం టైగర్‌ రిజర్వ్‌	64
శేషాచలం అటవీప్రాంతం	9
పాపికొండలు	2

ఇంధనరంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు
బీఈఈ సెక్రటరీ మిలింద్‌ దేవర



సాక్షి, అమరావతి: ఇంధన సామర్థ్య రంగంలో పెట్టుబడులకు దేశంలోనే కీలక రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ అత్యంత అనుకూల రాష్ట్రమని బ్యూరో ఆఫ్‌ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సెక్రటరీ మిలింద్‌ దేవర చెప్పారు. ఇంధన సామర్థ్యంలో పెట్టుబడులను ఆహ్వానిస్తే భవిష్యత్తులో రాష్ట్రానికి అత్యుత్తమ ఆర్థిక వనరులుగా మారతాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన స్టేట్‌ డెజిగ్నేటెడ్‌ ఏజెన్సీ లతో ఆదివారం టెలికాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంతో పాటు పట్టణాభివృద్ధి వంటి కీలక రంగాల్లో ప్రధాన పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు రాష్ట్రం అంతర్జాతీయంగా గుర్తింపు పొందే అవకాశాలున్నాయన్నారు. ఎల్‌ఈడీ స్ట్రీట్‌ లైటింగ్‌ ప్రాజెక్టు, ఉజాలా పథకం ఉమల తదితరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఏపీ కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ఇంధన సామర్థ్య నిర్వహణలో రాష్ట్రానికి అవార్డులు సాధించడం కూడా మంచి పరిణామమని చెప్పారు.

ఉపాధికి 'హాని'!

నిరుపేదల పొట్టగొడుతూ పనులపై రాజకీయ గునపం
టీడీపీ నేతల ఒత్తిళ్లతో రాష్ట్రంలో ఫీల్డ్‌ అసిస్టెంట్ల తొలగింపు
తమవాళ్లనే నియమించాలంటూ అధికారులకు బెదిరింపులు

ఆగిపోయిన పనులు..

- శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో ఫీల్డ్‌ అసిస్టెంట్లను తప్పించగా ఇప్పటివరకు కొత్తవారిని నియమించకపోవడంతో ఉపాధి పనులు నిలిచిపోయాయి. జిల్లాలోని బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి, అమరాపురం తదితర మండలాల్లోనూ చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.
- పల్నాడు జిల్లా రొంపిచెర్ల మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలు ఉండగా టీడీపీ నేతలు 27 చోట్ల ఫీల్డ్‌ అసిస్టెంట్లను మార్చేసి కొత్త జాబితాను అధికారులకు అందించారు.


సాక్షి, అమరావతి: కరోనా విపత్తు వేళ 2020-21లో గ్రామాల్లో కొత్తగా ఉపాధి హామీ జాబ్‌ కార్డులు జారీతో పాటు పనుల కల్పనలోనూ మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో నిలిచింది. మహమ్మారి విరుచుకుపడ్డ వేళ దిక్కు తోచక పట్టణాలకు పట్టణాల నుంచి గ్రామాలకు తరలి వచ్చినా నిశ్చింతగా జీవనోపాధి లభించింది! విపత్తులోనూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మందగించకుండా పనులు కల్పిస్తూ, పథకాన్ని సమర్థవంతంగా చేపట్టింది గత ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంది. ఇక వ్యవసాయ పనులు ఉండని వేసవి సీజన్‌లో పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవడం లో గత ఐదేళ్లు ఆంధ్రప్రదేశ్‌ మొదటి స్థానంలోనే కొనసాగింది. ఏటా ఉపాధి పొందిన కుటుంబాలు, లబ్ధి చేకూర్చిన మొత్తం పెరగడమే ఇందుకు నిదర్శనం. నిరుపేదల కడుపు నింపిన ఉపాధిహామీలో ఇప్పుడు రాజకీయాలు చొరబడ్డాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో పెత్తనం కోసం టీడీపీ నేతలు రాజకీయ రంగు పులుముతుండటంతో పేదల 'ఉపాధి'కి గండి పడింది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డ మర్నాడే అత్యధిక గ్రామాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్లను తప్పించాలని అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. దీంతో మండల అధికారులు వారితో పనులు చేయించలేక గ్రామాల్లో మొత్తం ఉపాధి పనులనే నిలిపివేశారు. అధికారిక గణాంకాలే దీనికి సాక్ష్యం. టీడీపీ నేతల నిర్వాకాలతో రాష్ట్రంలో సగానికి పైగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు నిలిచిపోయాయి. మరోవైపు డబ్బులు వసూలు చేసుకుంటూ తమకు నచ్చిన వారిని ఫీల్డ్‌ అసిస్టెంట్లుగా నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉపాధి హామీ పనుల తాజా వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెబ్‌ పోర్టల్‌లో నమోదవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,387 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారిక గణాంకాల ప్రకారం 6,788 పంచాయతీల్లో ఈనెల 26వతేదీకి ముందు వారం రోజుల పాటు కనీసం ఒక్కరికి కూడా పనులు కల్పించకపోవడం గమనార్హం. ఈనెల 26వ తేదీన మాత్రం కేవలం 4,565 గ్రామ పంచాయతీల్లో మాత్రమే ఉపాధి హామీ పథకం పనులు కొనసాగినట్లు అధికారిక వివరాలు వెల్లడిస్తున్నాయి. అంటే రాష్ట్రంలో మూడింట రెండొంతుల గ్రామాల్లో పేదలకు ఉపాధి పనులే లేకుండా పోయాయి.


సహాయకులు.. నిస్సహాయంగా

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కోరే వారి వివరాలు నమోదు చేసుకోవడం, ఆయా చోట్ల ముందుగా అనుమతించిన పనులను కూలీలకు కేటాయించడం, పనులు చేసిన వారి వివరాలను మండల కంప్యూటర్‌ సెంటర్‌లో అందజేయడం ఫీల్డ్‌ అసిస్టెంట్ల విధి. సాధారణంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒకరు చొప్పున ఫీల్డ్‌ అసిస్టెంట్లు ఉంటారు. ఫిక్స్‌డ్‌ టెన్యూర్‌ ఎంప్లాయి (ఎఫ్‌టీఈ) విధానంలో ఫీల్డ్‌ అసిస్టెంట్లకు రూ.10 వేలకు పైబడి, మిగిలిన వారికి రూ.7,500 నుంచి రూ.10 వేల మధ్య నెల వారీ వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తుంది. వీరంతా ప్రస్తుతం గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల అధిపత్య ఆరాటంతో నిస్సహాయంగా మారారు.

పొలం పనులు లేక.. ఉపాధి దొరకక

ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో పేదలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించి ఆదుకోవడం. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఇంకా జోరందుకోలేదు. వర్షాలు కురుస్తున్నప్పటికీ జలాశయాల్లో నీటి నిల్వలు అతి తక్కువగా ఉన్న నేపథ్యంలో పొలం పనులు అత్యధిక ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. ప్రత్యేకించి ఉపాధి హామీ పనులకు ఎక్కువ డిమాండ్‌ ఉండే రాయలసీమతో పాటు ప్రకాశం, పల్నాడు తదితర జిల్లాల్లో వ్యవసాయ పనులు మందకొడిగా జరుగుతుండటంతో నిరుపేదలు ఉపాధి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు.





నోట్‌: కరోనా సమయంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో కొత్త ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుల జారీతో పాటు పనుల కల్పనలో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉంది.

- గత ఐదు సంవత్సరాలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులే ఉండని వేసవి కాలంలో పేదలకు పనులు కల్పనలో ఏపీ ఏటా దేశంలో మొదటి స్థానంలోనే కొనసాగింది.

వలస వెళ్లాల్సి వస్తుందేమో..



గ్రామంలో నేను, నా భార్య, ఇద్దరు కుమారులు ఉపాధి పనులు చేసుకునేవాళ్లం. కొద్ది రోజులుగా ఉపాధి పనులు బంద్‌ చేశారు. వర్షాలు సరిగా పడక పోవడంతో గ్రామంలో వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. గ్రామంలో పనులు కల్పిస్తే చేసుకుంటాం. లేకపోతే గ్రామం వదిలి ఇతర పట్టణాలకు పనుల కోసం వలస వెళ్లాల్సి వస్తుంది.
– దావీద్‌, చిర్తనకల్లు, కోసిగి మండలం, కర్నూలు జిల్లా

పేదల కడుపు కొట్టొద్దు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మా గ్రామంలో ఉపాధి హామీ పథకానికి రాజకీయ గ్రహణం పట్టింది. టీడీపీ నాయకులు ప్రస్తుతం ఉన్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌ను తొలగించాలనే ఉద్దేశంతో గ్రామంలో పనులు ఆపేశారు. పనులు కల్పించాలని అధికారులను, అధికారులు పట్టించుకోవడం లేదు. రాజకీయ ప్రయోజనాలు, ధన ప్రయోజనాల కోసం మాలాంటి పేదల కడుపులు కొట్టడం మంచి కాదు.
– నల్లపనేని ప్రసాద్‌, ఏపినాని, కలిగిరి మండలం, నెల్లూరు జిల్లా

పనుల్లేక ఇబ్బందులు



కొద్ది రోజులుగా ఉపాధి పనులు నిలిపేశారు. నేను ప్రతి ఏడాది ఉపాధి పనులకు వెళ్లేవాడిని. ఈ ఏడాది కూడా మొదట్లో పనికి వెళ్లాను. ఇప్పుడు పనులు నిలిపి వేయడం వల్ల అందరికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉపాధి పనులు వల్ల వచ్చే డబ్బు ద్వారానే జీవనం సాగిస్తున్న మాలాంటోళ్లకు ఇప్పుడు ఏ చేయాలో అర్థం కావడం లేదు.
– సిహెచ్‌.శ్రీరాం, పెదమేడి గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా

నాలుగు వారాల కూలి రావాలి



నేను, నా భార్య ఇద్దరం ఉపాధి పనికి వెళ్లేవాళ్లం. జూన్‌ నెల నుంచి పనులు జరగడం లేదు. నాలుగు వారాలకు సంబంధించిన ఉపాధి కూలి డబ్బులు రావాల్సి ఉంది. ఆ డబ్బులు రాకపోవడంతో కష్టంగా ఉంది. అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పిస్తే మా కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– షేక్‌.ఇమామ్‌, కంభం, ప్రకాశం జిల్లా

ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత

- మందుల సరఫరాపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం
- ప్రతి బోధనాస్పత్రిలో వందకంటే ఎక్కువ రకాల మందుల కొరత
- కనీసం కాటన్‌, గ్లౌజులు, కాన్యులాలు కూడా లేక ఇబ్బందులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. మందుల సరఫరాను పూర్తిగా వదిలేసింది. కనీసం దూది, గ్లౌజులు, కాన్యులాలు కూడా లేక ఆస్పత్రులు విలవిల్లాడుతున్నాయి. ప్రాథమిక వైద్య సేవలందించే పీహెచ్‌సీల నుంచి సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌ నెలల కోసం క్వార్టర్‌ మందుల సరఫరా విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి నెలకొంది. వాస్తవానికి కిందటి క్వార్టర్‌లో మందులు, సర్జికల్స్‌ ఈపాటికే ఆస్పత్రులకు అందాలి. అయినా ప్రభుత్వం మందుల సరఫరాపై దృష్టి పెట్టలేదు. దీంతో మందులు సరఫరా చేయాల్సిన ఏపీఎంఎస్‌ఐడీసీ కూడా నిస్సహాయంగా మారిపోయింది. పైకి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం అంటూ చెబుతున్నా, ఆస్పత్రుల్లో పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. అన్ని ఆస్పత్రుల్లో నిబంధనల ప్రకారం ఉండాల్సిన మందులకంటే అతి తక్కువగా అందుబాటులో ఉన్నాయి.

గ్లౌజులు.. కాటన్‌కూ కొరత..

ఆస్పత్రులకు వచ్చే రోగులకు, వారికి అందించే చికిత్సల ఆధారంగా జిల్లా, బోధనాస్పత్రుల్లో 608 రకాల మందులు, 372 సర్జికల్స్‌ వాడ్తి నిర్వాణ కిటల్లు ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని జిల్లా, బోధనాస్పత్రుల్లో వందకు పైగా రకాల మందులు లేవు. చాలా ఆస్పత్రుల్లో కనీసం గ్లౌజులు, కాటన్‌, ఐవీ కాన్యులా, అనస్థీషియా కోసం వాడే స్పైనల్‌ నీడిల్స్‌ వంటివీ లేవు. శస్త్రచికిత్సలు, క్షతగాత్రులకు కుట్లు వేయడానికి మెటీరియల్‌ కూడా అందుబాటులో లేదు. రాష్ట్రవ్యాప్తంగా 13 సెంట్రల్‌ డ్రగ్‌ స్టోర్స్‌ (సీడీఎస్‌)లు ఉన్నాయి. వీటిల్లోనే డ్రగ్స్‌, సర్జికల్స్‌ లేవని, ఇండెంట్‌ పెడదామంటే నిల్వలు అవసరమైన కొన్ని రకాల మందులు కూడా చూపించడం లేదని ఆస్పత్రుల్లోని ఫార్మాసిస్టులు వాపోతున్నారు. లివర్‌, కిడ్నీ, గుండె, మెదడు సంబంధిత రోగులకు వాడే ఖరీదైన యాంటీబయోటిక్స్‌, అల్బుమిన్‌, ఇమ్యూనోగ్లోబ్యులిన్స్‌కు గుంటూరు, కర్నూలు, విశాఖ కేజీహెచ్‌ వంటి పెద్ద ఆస్పత్రుల్లో కొరత ఉంది. నెల్లూరు జీజీహెచ్‌లో గ్యాస్‌ సమస్యకు వచ్చే పాంటప్రజోల్‌ వంటి మాత్రలకు సైతం కొరత ఉంది. డెంటల్‌ విభాగంలో పంటి నొప్పితో వచ్చిన రోగులకు సిమెంట్‌ మెటీరియల్‌ కూడా లేదు. అదే విధంగా సర్జరీలలో వాడే డివాక్స్‌ ఇయర్‌ డ్రాప్స్‌ సైతం బయటకు రాస్తున్నారు. థైరాయిడ్‌ పరీక్షల వంటివి చేయడం లేదు. తెనాలి జిల్లా ఆస్పత్రిలో కాన్యులా, గ్లౌజుల కొరత వేధిస్తోంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పీహెచ్‌సీల్లో నాన్‌ కమ్యూనికబుల్‌ డిసీజ్‌ (ఎన్‌సీడీ) మందులు, పెయిన్‌ కిల్లర్‌ మాత్రలు అందుబాటులో లేవు. దీంతో బీపీ, షుగర్‌ రోగులకు 30 మాత్రలకు బదులు 10 లేదా 15 మాత్రలే వైద్యులు ప్రిస్కైబ్‌ చేస్తున్నారు.


ఔరా.. భారీ సొర!

కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం గిలకలదిండి సముద్రతీరాన వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఆదివారం అరుదైన వేల్‌ సొర చేప చిక్కింది. సుమారు 1500 కిలోల బరువు ఉన్న ఈ వేల్‌ షార్క్‌ను క్యాంబెలిపేట నివాసి పెడశింగు నాగస్వామికి చెందిన బోటులో మత్స్యకారులు అతికష్టంపై ఫిషింగ్‌ హార్బర్‌కు తీసుకురాగా, క్రేన్‌ సాయంతో ఒడ్డుకు చేర్చారు.
– మచిలీపట్నం టౌన్‌



'సాగరమాల' కింద ఏపీలో 13 ప్రాజెక్టులు

కేంద్ర షిప్పింగ్‌ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ వెల్లడి



సాక్షి, అమరావతి: సాగరమాల పథకం కింద ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో రూ.2,483 కోట్ల విలువైన 13 ప్రాజెక్టులను చేపట్టినట్లు కేంద్ర నౌకాయాన, ఓడరేవుల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ లోక్‌సభలో వెల్లడించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ మొత్తం ఏడు ప్రాజెక్టుల్లో ఇప్పటికే రూ.1,114 కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టుల పనులు పూర్తయినట్లు తెలిపారు. పూర్తయిన పనుల్లో రూ.85.83 కోట్లతో కాకినాడ యాంకరేజ్‌ పోర్టు ఆధునికీకరణ, విశాఖ పోర్టులో రూ.43 కోట్లతో కోస్టల్‌ బెర్త్‌ నిర్మాణం, రూ.46.34 కోట్లతో విశాఖ పోర్టును అనుసంధానం చేసే రహదారి నిర్మాణం, రెండో దశలో రూ.77 కోట్లతో రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరణ, రూ.574 కోట్లతో మారిటైమ్‌ షిప్‌ బిల్డింగ్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌ ఏర్పాటు, రూ.288 కోట్లతో నెల్లూరు వద్ద జువ్వలదిన్నె ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం వంటి ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. మరో ఆరు ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇందులో ముఖ్యమైనవి రూ.386 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్‌ హార్బర్‌, రూ.364 కోట్లతో కొత్తపట్నం ఫిషింగ్‌ హార్బర్‌, రూ.387 కోట్లతో పూడిమడక ఫిషింగ్‌ హార్బర్‌, రూ.152 కోట్లతో విశాఖ ఫిషింగ్‌ హార్బర్‌ ఆధునికీకరణ, రూ.73 కోట్లతో బియ్యపు తిప్ప వద్ద కోస్టల్‌ బెర్త్‌ నిర్మాణం తదితర ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. మూడేళ్లలో రాష్ట్రంలోని నాన్‌ మేజర్‌ పోర్టులు(విశాఖ పోర్టు కాకుండా మిగిలిన పోర్టులు) ద్వారా వాణిజ్య ఎగుమతులు 88 మిలియన్‌ టన్నుల నుంచి 118 మిలియన్‌ టన్నులకు పెరిగాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న నాన్‌ మేజర్‌ పోర్టులు గంగవరం, కాకినాడ గేట్‌వే పోర్టు, కాకినాడ యాంకరేజ్‌ పోర్టు, కృష్ణపట్నం పోర్టుల నుంచి 2021-22లో 88 మిలియన్‌ టన్నుల సరుకులు ఎగుమతి కాగా, అది 2023-24 ఆర్థిక సంవత్సరానికి 118 మిలియన్‌ టన్నులకు పెరిగింది. ఇదే సమయంలో మేజర్‌ పోర్టు విశాఖ నుంచి ఎగుమతులు 69 మిలియన్‌ టన్నుల నుంచి 81 మిలియన్‌ టన్నులకు పెరిగినట్లు ఆయన వివరించారు.

క్లుప్తంగా...

అర్చకుని కుటుంబంపై టీడీపీ నేత దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరులోని చెంగల్రాయ కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ అర్చకులు శివాచార్యులపై టీడీపీ నేత లోకేశ్ ఆదివారం దాడి చేశాడు. ఆలయ వాచ్‌మన్, అర్చకులు, ఆయన కుమార్తె మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది చిలికిచిలికి గొడవగా మారింది. ఇంతలో వాచ్‌మన్ కుమారుడు లోకేశ్ (టీడీపీ నేత) ఆలయానికి చేరుకున్నాడు. అసభ్యపద జాలంతో అర్చకులు, ఆయన కుమార్తెను దూషించాడు. ఆపై అర్చకుని కుమార్తెను గుడిలోని మూలస్థానం నుంచి జుట్టుపట్టుకుని లాక్కొచ్చాడు. దీనిపై ప్రశ్నించిన అర్చకుని పైనా దాడి చేశాడు. స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ దాడిని వీడియో తీశారు. ఆపై పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని టీడీపీ నేతను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

వైఎస్సార్ విగ్రహం దిమ్మె ధ్వంసం



ధ్వంసమైన నిర్మాణంలో ఉన్న స్థూపం దిమ్మె

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మెయిన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం కోసం నిర్మిస్తున్న దిమ్మెను శనివారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. దీంతో ఆదివారం వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఇక్కడ 15 సంవత్సరాలుగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని రోడ్డు విస్తరణ సమయంలో పక్కకు తొలగించారు. ఆ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు దిమ్మె నిర్మిస్తున్నాయి. విగ్రహం ఏర్పాటు చేస్తున్న స్థలంపై స్థానిక వ్యాపారికి, పార్టీ శ్రేణులకు మధ్య శుక్రవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగడుగులు నిర్మించిన దిమ్మెను ధ్వంసం చేశారు. తన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వైఎస్సార్ విగ్రహం అడ్డుగా ఉంటుందనే ఉద్దేశంతోనే దిమ్మెను అడ్డుకున్న వ్యాపారి ధ్వంసం చేశాడని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ జి.జె.విష్ణువర్ధన్ తెలిపారు.

క్రెడిట్ కొట్టేయడంలో తండ్రిని మించిపోయావ్ లోకేశ్

- కువైట్‌లో శివను కాపాడానంటూ ఇటీవల మంత్రి లోకేశ్ ట్వీట్
- అది అబద్ధమంటూ.. సాక్ష్యాలతో వీడియో పోస్టు చేసిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: 'కష్టం ఎవరిదైనా.. క్రెడిట్ కొట్టేయడంలో మీ తండ్రి చంద్రబాబును మించిపోయావ్ లోకేశ్' అంటూ వైఎస్సార్‌సీపీ ఆదివారం సామాజిక మాధ్యమం(ఎక్స్)లో పోస్టు చేసింది. 'ఎట్టెట్టా.. కువైట్‌లో శివను మీరు కాపాడారా? మీ సాయం ఇసుమంత కూడా లేకపోయినా గత కొన్ని రోజులుగా ఎల్లో మీడియాతో కలిసి మీరు వేసిన పీఆర్ స్టంట్‌లు అన్నీ ఇన్నీ కావుగదా? నిజం నిలకడ మీద తెలుస్తుందంటే ఇదే. బయటికి రాదులే అనుకున్నారు. ఇప్పుడు శివకు సాయం చేసింది మీరు కాదని సాక్ష్యాలతో సహా వీడియోలు బయటికి వచ్చాయి. ఇప్పుడేం చెప్తావ్ నారా లోకేశ్?' అంటూ ప్రశ్నించింది. కువైట్‌లో శివను కాపాడింది లోకేశ్ కాదు.. సాక్ష్యమిదిగో అంటూ ఒక వీడియోను వైఎస్సార్‌సీపీ పోస్టు చేసింది.

జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం జీరో సర్వీస్‌తో ఎంఈవో–1ల బదిలీలు చేపట్టాలని ఎంఈవో–1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఓ ప్రకటనలో కోరారు. దాదాపు ఏడేళ్లుగా బదిలీలు జరగలేదని, 2017 నుంచి పనిచేస్తున్న స్థానాల్లోనే ఉండిపోయారని తెలిపారు. మండలాల్లో సుమారు 200 మంది ఉపాధ్యాయుల వేతనాల డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఈవో–1కు తన జీతభత్యాలు చేసుకునే సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేసినట్లు సింహాచలం తెలిపారు.

ఆర్థిక శ్వేతపత్రం వాస్తవ విరుద్ధం

ఆర్థిక విశ్లేషకులు రాంభూపాల్ విమర్శ


కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక శ్వేతపత్రం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని ఆర్థిక విశ్లేషకులు వి.రాంభూపాల్ విమర్శించారు. ఆదివారం కడపలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆర్థిక విశ్లేషకులు రాంభూపాల్ మాట్లాడుతూ.. '2014–24 మధ్య కాలంలో అప్పులు ఎందుకు పెరిగాయో? దానికి కారణమైన కేంద్రంలోని బీజేపీ గురించి చంద్రబాబు ఆర్థిక శ్వేతపత్రంలో చెప్పకపోవడం సరికాదు. ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, రాజధానికి నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని దోషిగా చూపించకపోవడం సిగ్గుచేటు. 2014–19లో అద్భుతమైన అభివృద్ధి జరిగినట్లు శ్వేతపత్రంలో చెప్పారు. రాజధాని, పోలవరం, వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం ప్యాకేజీ ఇవ్వకుండా ఎలా అభివృద్ధి చెందిందో జవాబివ్వాలి. ఈ బడ్జెట్‌లో కూడా మోదీ సర్కార్ రాష్ట్రానికి కేటాయించిందేమీ లేదు' అని మండిపడ్డారు.

2019-24 మధ్య రాష్ట్రంలోకి రూ.7,371 కోట్ల

విదేశీ పెట్టుబడులు

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు

- జపాన్, కొరియా వంటి దేశాల కంపెనీలు రాక
- 2023-24లో రూ.765 కోట్ల పెట్టుబడులు
- డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: కోవిడ్ మహమ్మారితో రెండేళ్లు ప్రపంచం స్థంభించిపోయినప్పటికీ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం గణనీయమైన సంఖ్యలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐల)ను సాధించింది. 2019 అక్టోబర్ నుంచి 2024 మార్చి మధ్య కాలంలో రాష్ట్రంలోకి రూ.7,371.68 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టంచేశాయి. ఈ ఐదేళ్లలో వివిధ దేశాలకు చెందిన పలు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని విస్తరణ ప్రాజెక్టులు చేపట్టాయి. జపాన్‌కు చెందిన యకహోమా, టోరో, డైకిన్, యూరోప్‌కు చెందిన పెట్రోగ్యాస్, కొరియాకు చెందిన ఎల్‌జీ వంటి సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టాయి. హిల్‌టాప్ సెజ్ (అడిదాస్), మాండలీజ్ చాక్లెట్స్ వంటి సంస్థలు భారీగా విస్తరణ ప్రాజెక్టులు చేపట్టాయి. వీటితోపాటు జర్మనీకి చెందిన పెప్పర్ మోషన్ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ పలమనేరు వద్ద రూ.4,640 కోట్లతో యూనిట్ పెట్టడానికి ముందుకొచ్చింది. వాస్తవ రూపం దాల్చిన పెట్టుబడులు, కొత్త పెట్టుబడుల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకుంటే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోకి రూ.35,000 కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

ముందంజలో విశాఖ, నెల్లూరు జిల్లాలు

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో విశాఖ, నెల్లూరు జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రాష్ట్రంలోకి రూ.64.49 కోట్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు డీపీఐఐటీ పేర్కొంది. ఇందులో విశాఖ జిల్లాకు రూ.39.91 కోట్లు రాగా, నెల్లూరు జిల్లాకు 19.29 కోట్లు వచ్చాయని, మిగిలిన మొత్తం అనంతపురం, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలకు వచ్చినట్లు ఆ నివేదిక పేర్కొంది. 2023 – 24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద చూస్తే రాష్ట్రంలోకి రూ.764.68 కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్, వియత్నాం, అబుదాబీ, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

తెలంగాణ

డెమెన్షియా బాధితుల కోసం స్మార్ట్ వాచ్

అందుబాటులోకి తీసుకువచ్చిన అన్వయ సంస్థ

సనత్‌నగర్ (హైదరాబాద్): వృద్ధుల సమస్యల పరిష్కారంకోసం అన్వయ సంస్థ చేస్తున్న కృషి, సేవలు అభినందనీయమని ప్రత్యేక అతిథులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సంతోష్ మెహ్రా, టెక్ మహీంద్రా హెచ్ఆర్ గ్లోబల్ హెడ్ వినయ్ అగర్వాల్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని ఫ్యామిలీ వరల్డ్‌లో అన్వయ సంస్థ ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులలో డెమెన్షియా (మతిమరుపు) సమస్యను అధిగమించేందుకు తగిన వ్యవస్థలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత సమయంలో అలాంటి వారికి ఉపయుక్తంగా ఉండేలా అన్వయ సంస్థ ప్రత్యేకంగా స్మార్ట్ వాచ్‌ను రూపొందించడాన్ని వారు ప్రశంసించారు. ఈ స్మార్ట్ వాచ్ సాయంతో వృద్ధులు ఎక్కడున్నా తెలుసుకోవచ్చని, అలాగే వారికి ఏం జరిగినా సంరక్షకులకు క్షణాల్లో సమాచారం అందుతుందని వివరించారు. అన్వయ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులకు సేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థను స్థాపించామని, కొద్దికాలంలోనే 40 నగరాలకు విస్తరించామని తెలిపారు.

హత్యా రాజకీయాలు ఇంకెన్నాళ్లు?

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా ఆగ్రహం
- టీడీపీ అరాచకాలపై లండన్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన



లండన్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న యూకే కమిటీ నాయకులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలపై టీడీపీ సాగిస్తున్న అరాచకాలను వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఖండించింది. ఇలా హత్యా రాజకీయాలు ఇంకెన్నాళ్లు చేస్తారని చంద్రబాబుపై పార్టీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలుపోటములు సహజమని.. రాష్ట్ర ప్రజలందరినీ సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హితవు పలికారు. ఏపీలో టీడీపీ అరాచక పాలనను ఖండిస్తూ ఆదివారం లండన్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో గెలిచిన పార్టీ నాయకులు.. ఓడిన పార్టీ వారిపై దాడులు చేసి ప్రాణాలు తీయడమేంటి? వీటిపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇవి ఏ మాత్రం ఆమోదనీయం కాదు. కేంద్రం జోక్యం చేసుకొని ఏపీలో శాంతిభద్రతలు నెలకొల్పాలి. దాడులు చేస్తున్న వారిని జైలుకు పంపాలి. ప్రజాస్వామ్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రవాసాంధ్రులంతా ఏకమై వైఎస్ జగన్‌కు తోడుగా నిలవాలని నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం హింసాకాండను ఆపకపోతే ప్రపంచం మొత్తానికి ఏపీలో జరుగుతున్న దురాగతాలను తెలియజేస్తాం' అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి పాతకోట, మలిరెడ్డి కిశోర్‌రెడ్డి, అనంత్ పరదేశి, సురేందర్ అలవల, వీరా పులపకూర, సుమన్ కోడూరు, పాలెం క్రాంతి కుమార్ రెడ్డి, కార్తీక్ భూమిరెడ్డి, ప్రతాప్ భీమిరెడ్డి, వెంకట్, సాయితేజ, చలపతి గుర్రం, సాయికృష్ణ, ప్రణయ్ ధీరజ్, నరేందర్, నవీన్ దొడ్డ, కరుణాకర్ రెడ్డి మొండెద్దు, వినయ్ కంభంపాటి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల అండతో రెచ్చిపోతున్న టీడీపీ నేతలు

- దళిత రైతులపై దౌర్జన్యం
- కొత్తగాదికుంటలో చీనీ పంటను దున్నేసిన వైనం
- రామగిరిలో హౌసింగ్ లేఅవుట్ ధ్వంసం

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అండ చూసుకుని టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట దౌర్జన్యాలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా శనివారం రామగిరి మండలం కొత్తగాదికుంటలో దళిత రైతులైన పెద్దక్క, శివయ్యలకు చెందిన 8 ఎకరాల భూమిని టీడీపీ నేతలు ట్రాక్టర్‌తో దున్నేశారు. బాధిత రైతులు 30 ఏళ్లుగా ఆ భూమిలో సాగులో ఉన్నారు. మూడు నెలల క్రితం సుమారు 550 చీనీ మొక్కలను ఆ భూమిలో వారు నాటారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే సాకుతో టీడీపీ నేతలు ట్రాక్టరుతో చీనీ మొక్కలను దున్నేసి తీవ్ర నష్టం కల్గించారు. బోరు, మోటార్‌ను సైతం ధ్వంసం చేశారు. ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించలేదు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు.

హౌసింగ్ లేఅవుట్ ధ్వంసం

రామగిరిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలాల కోసం ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను టీడీపీ నాయకులు ఆదివారం జేసీబీతో చదును చేశారు. గత వారం ముత్యాలమ్మపల్లిలో శివ అనే వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి కొష్టానికి వారి తల్లిదండ్రులు నిద్రిస్తుండగానే నిప్పు పెట్టారు. ఈ ఘటనలో శివ తండ్రికి గాయాలయ్యాయి. ఇంత అరాచకం జరుగుతున్నా పోలీసులు కనీసం ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు.

టీడీపీ నేతల వేధింపులతో అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న కల్యాణి

నల్లజర్ల: టీడీపీ నేతల దాష్టీకానికి మరో చిరుద్యోగిని ప్రాణాలు తీసుకోబోయింది. వారి వేధింపులు తట్టుకోలేక ఆదివారం అంగన్‌వాడీ కేంద్రం ఆయా కళ్యాణి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలోని 31వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో ఎనిమిది నెలల కిందట ఉన్నమట్ల కళ్యాణి ఆయాగా చేరింది. జూన్‌లో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఆమె పోస్టుపై స్థానిక టీడీపీ నాయకుల కన్నుపడింది. తరచు ఆమెపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. పిల్లల్ని మందలించిందంటూ తల్లిదండ్రులతో ఫిర్యాదు చేయించారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలంటూ కళ్యాణికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి మెమో జారీచేశారు. ఒక మెట్టు తగ్గి టీడీపీ నాయకుల కాళ్లు పట్టుకుంటే పోయేదేముందంటూ కొందరు అధికారులు ఆమెకు సలహా ఇచ్చారు. ఆమె ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ బొప్పన సత్తిరాజు, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, కఠారి రాజ్‌కుమార్‌లకు చెప్పింది. వారు ఆమెకు ధైర్యం చెప్పారు. శుక్ర, శనివారాల్లో ఇది జరగగా.. కల్యాణి ఆదివారం పురుగుమందు తాగింది. స్థానికులు ఆమెను తొలుత నల్లజర్ల పీహెచ్‌సీకి, అనంతరం తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కళ్యాణి భర్త ఆంజనేయులు ఆటోడ్రైవర్. వారికి ఇద్దరు మగపిల్లలు. ఒక కుమారుడు నతానియేలు దివ్యాంగుడు. అతడికి వచ్చే దివ్యాంగ పెన్షన్ కూడా నిలిపేయిస్తామని టీడీపీ నాయకులు బెదిరించారని కల్యాణి తెలిపింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కళ్యాణిని రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు.

ఆధారాల్లేక వెనక్కు తగ్గిన పోలీసులు



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాయకులు

- మోహిత్‌రెడ్డి అరెస్ట్‌లో నాటకీయ పరిణామాలు
- న్యాయమూర్తి ఎదుట హాజరు పరచకుండానే స్టేషన్ బెయిల్
- 41(సీ) నోటీసు ఇచ్చేందుకు లుక్ అవుట్ నోటీసులు ఇస్తారా?

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒక్క ఆధారం కూడా లేకపోవడంతో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచకుండానే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. శనివారం రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆర్థిక ఉగ్రవాది, టెర్రరిస్ట్ అన్న తరహాలో మోహిత్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు.. ఆదివారం ఉదయం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు శాంతియుతంగా నిరసన ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు పోలీసులు వెనకడుగు వేశారు. మోహిత్‌రెడ్డిపై మోపిన అభియోగాల్లో ఆధారాలు లేకపోవడం, ఘటన జరిగిన సమయంలో జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారుల సమక్షంలోనే సీసీ కెమెరాల సాక్షిగా మోహిత్‌రెడ్డి ఉండడం, ఆ సమయంలో కనీసం ఫోన్ సౌకర్యం కూడా లేకపోవడం.. తదితర కారణాల వల్ల పోలీసులు వెనక్కు తగ్గాల్సి వచ్చింది. దీంతో ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరు కావాలని 41(సీ) నోటీసులు ఇచ్చి పంపించేశారు. ప్రజల మధ్యే ఉంటూ, సొంతూరులో పోలీసుల కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టించుకోని పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిడితో తనకు సంబంధంలేని ఘటనలో 52 రోజుల తర్వాత ఏ–37గా కేసు పెట్టారు.


వంద కేసులు పెట్టినా భయపడం



విదేశాల్లో చదువుకుని ప్రజాసేవకు వచ్చిన నాపై ఇది మొదటి కేసు. ఇలాంటి అక్రమ కేసులు వంద పెట్టినా, బుల్లెట్లతో కాల్చినా వెనక్కి తగ్గేది లేదు. ఈ కేసులో నా ప్రమేయం నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే. మా నాన్న నాకు ప్రజలకు సేవ చేయడం, ప్రజల పక్షాన పోరాడటమే నేర్పించారు. మమ్మల్ని రాజకీయంగా సమాధి చేస్తానని పులివర్తి నాని కలలు కంటున్నారు. అది ఆయన తరం కాదు.

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

దమ్ముంటే జడ్జి ముందు హాజరు పరచాలి



ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో పేరు కూడా లేని వ్యక్తిని 52 రోజుల తర్వాత ఏ–37గా ఇరికించడం అప్రజాస్వామికం. ఇది తప్పుడు కేసు అని ప్రభుత్వానికి, పోలీసులకు కూడా తెలుసు. ఎవరిని తృప్తి పరిచేందుకు లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు.. అరెస్ట్ చేశారు? పోలీసులకు దమ్ము, ధైర్యం ఉంటే అరెస్ట్ చేసిన మోహిత్‌రెడ్డిని న్యాయమూర్తి ముందు హాజరు పరచాలి.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గీత వృత్తి రక్షణకు రణభేరి

సాక్షి, అమరావతి: నిత్యం బతుకుపోరు సాగించే కల్లుగీత కార్మికులు తమ వృత్తి రక్షణకు రణభేరీ మోగించేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుంటే ఉద్యమబాట పడతామంటూ అల్టిమేటం ఇచ్చారు. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లాలతోపాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కీలక సమావేశాలు నిర్వహించుకున్న ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికసంఘం ఉద్యమ కార్యాచరణ చేపట్టింది. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునికీకరించాలని, కల్లుగీత ఆర్థికసహకార సంస్థను ఏర్పాటు చేయాలని.. తదితర 15 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ విషయమై మంత్రి కొల్లు రవీంద్రతోపాటు పలువురు రాష్ట్ర మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చింది. కేరళ తరహాలో గీత వృత్తికి రక్షణతోపాటు ఉపాధి గ్యారంటీ కల్పించాలని, దానిపై ఆధారపడిన వారికి సంక్షేమం, ఉపాధి, సామాజిక భద్రతపై చంద్రబాబు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని గీత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పసికందు కిడ్నాప్

- మూడు గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు
- అనంతపురం పట్టణంలో ఘటన



పసికందును తీసుకొస్తున్న డీఎస్పీ టీవీవీ ప్రతాప్, పక్కనే టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్

అనంతపురం: ఆరు రోజుల పసికందును అపహరించిన ఘటనను పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించడంతో తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ఈ నెల 16వ తేదీన అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కాన్పు నిమిత్తం చేరింది. ఈ నెల 23న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి తల్లీబిడ్డ ఆస్పత్రి గైనిక్ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు పసికందు అదృశ్యమైనట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాలతో అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూటౌన్ సీఐ క్రాంతికిరణ్, నాల్గవ పట్టణ సీఐ ఆర్.ప్రతాప్ రెడ్డి, అవుట్‌పోస్టు ఎస్ఐ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఆస్పత్రిలోని గైనిక్ వార్డును దిగ్బంధనం చేసి.. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. కురుకుంటకు చెందిన ఆమని అనే మహిళ పసికందును అపహరించినట్లు గుర్తించారు. ఆమె నుంచి పసికందును తీసుకుని తల్లిదండ్రులైన అమృత, అనిల్ కుమార్‌కు డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు అప్పగించారు.

సాయం చేయడానికి వచ్చి..

నిందితురాలు ఆమని గైనిక్ వార్డులోకి మూడు రోజుల క్రితం వచ్చింది. అమృత బెడ్డు పక్కనే ఉన్న మరో రోగికి సపర్యలు చేసేది. ఆమెతో బంధుత్వం లేకపోయినప్పటికీ, ప్రతి రోజూ భోజనం తెచ్చి పెట్టి వెళ్లేది. ఈ క్రమంలో అమృత కుమార్తెపై మమకారం పుట్టింది. ఆమనికి ఇద్దరూ కొడుకులే కావడంతో కుమార్తె ఉండాలని భావించి పసికందును అపహరించింది. ఆమనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బ్రెజిల్ డ్రగ్స్ కంటైనర్ కేసు ఏమైంది?

మాజీమంత్రి బొత్స డిమాండ్




సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల సమయంలో బ్రెజిల్ దేశం నుంచి విశాఖ పోర్టుకు అక్రమంగా వచ్చిన మాదక ద్రవ్యాల కంటైనర్ కేసు ఏమైందో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని మాజీమంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. సుమారు 25 కిలోల చొప్పున వెయ్యి బ్యాగుల మాదవ ద్రవ్యాల సరుకు కంటైనర్‌లో విశాఖ పోర్టుకు రాగా.. దీనిని సీబీఐతో పాటు ఇంటర్‌పోల్ పట్టుకున్న విషయాన్ని బొత్స గుర్తుచేశారు. గతంలో తాము అధికారంలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వమే చేసిందని ఆరోపణలు కూడా చేశారన్నారు. నిజానికి.. ఈ వ్యవహారంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి బంధువులకు చెందిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థ దిగుమతి చేసుకుందన్న ఆరోపణలు వచ్చాయని బొత్స గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టడంతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన ఎంపీలు దీనిపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.25 వేల కోట్లకు సంబంధించిన వ్యవహారంపై వాస్తవాలేమిటి? ఇందులో ఎవరి పాత్ర ఉంది? నిందితులను ఎందుకు ఉపేక్షిస్తున్నారో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇది చిన్న విషయం కాదన్నారు.

విశాఖలో డ్రగ్స్ దిగుమతి అనేదిలేదు..

దేశంలో ఎక్కువగా డ్రగ్స్ దిగుమతి అయిన చరిత్ర గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న పోర్టులకు ఉంది తప్ప.. ఏపీలో ఇలాంటి ఘటనలు జరగలేదని బొత్స స్పష్టంచేశారు. విశాఖలో తొలిసారి ఇలాంటి ఘటన చోటుచేసుకున్నప్పుడు.. అధికార పార్టీకి చిత్తశుద్ధి ఉంటే స్థానిక నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎంపీలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి విచారణకు డిమాండ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో ఏ పార్టీ మీద బురదజల్లడంలేదని.. రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

టీడీపీ 'సిట్' దర్యాప్తును కొనసాగించాలి..

ఇదిలా ఉంటే.. ఎన్నికలైన దగ్గర నుంచి భూ ఆక్రమణలు జరిగాయని కొందరు.. మరికొందరైతే దసపల్లా భూములు దోపిడీకి గురయ్యాయంటూ ఆరోపణలు చేసిన విషయాన్ని బొత్స ప్రస్తావిస్తూ.. హుద్‌హుద్ తుపాను తర్వాత ఆ రోజు టీడీపీలో ఉన్నవారే భూ కుంభకోణంపై పరస్పర ఆరోపణలు చేసుకోగా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం 'సిట్' ఏర్పాటుచేసి ఏడాదిపాటు దర్యాప్తు చేసిందన్నారు. అయితే, ఆ తర్వాత దర్యాప్తునకు సంబంధించి టెరమ్స్ ఆఫ్ కండిషన్స్ మార్పుచేసి 2004 నుంచి విశాఖ ప్రాంతంలో జరిగిన భూ ఆక్రమణలపైనా దర్యాప్తు చేయాలని నిర్ణయించారని బొత్స తెలిపారు. అంటే.. 2004 నుంచి దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రులుగా తామున్న ఆ అంశాన్ని కూడా తెరపైకి తెచ్చారన్నారు. అయితే, ఇప్పుడు విశాఖలో భూఆక్రమణల అంశం మళ్లీ తెరపైకి వచ్చిన నేపథ్యంలో.. నిజంగా చిత్తశుద్ధి ఉంటే నాటి సిట్ దర్యాప్తును కొనసాగించాలని.. అప్పుడే ఉత్తరాంధ్ర ప్రజలకు దొర ఎవరో, దొంగెవరో తెలుస్తుందని బొత్స స్పష్టంచేశారు.



చుట్టూ ఎత్తయిన గుట్టలు.. గుట్టలపై పచ్చదనం.. సెలయేళ్ల ప్రవాహం.. మధ్యలో పిల్లదారులు.. హాయినిచ్చే వాతావరణం.. అవన్నీ కలగలసిన చిన్న పల్లె.. అదే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం వెంకటాపూర్ గ్రామం. గోండె బెబ్బులి కొమురంభీం పుట్టిన జోడేఘాట్‌కు వెళ్లే దారిలో ఉన్న ఈ గ్రామం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మార్గంలోనే ఉన్న బాబేఝరి జలపాతాన్ని తిలకించేందుకు పర్యాటకులు కాసేపు వెంకటాపూర్‌లో ఆగుతూ. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. - కెరమెరి (ఆసిఫాబాద్)

యాదాద్రి భక్తులకు మెరుగైన రవాణా వసతి

హైవేపై రిక్వెస్టు స్టాప్‌లు.. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హామీ

యాదగిరిగుట్ట: యాదాద్రి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చెప్పారు. ఆయన ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సజ్జనార్, కుటుంబ సభ్యులకు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సజ్జనార్ విలేకరులతో మాట్లాడుతూ.. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మంజూరైన కొత్త బస్సులు త్వరలోనే వస్తాయని తెలిపారు.



"నవ్వు, కరుణ అనేవి అవగాహనకు సంబంధించి మనుషులు సాధించవలసిన అత్యంత విశిష్ట గుణాలు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 29 జూలై 2024

లెదరు బ్యాగూ... బ్రీఫు కేసూ...

ప్రభుత్వాలు మొదలుకొని సామాన్యుల వరకూ ఈ రోజున చాలా విరివిగా వాడుతున్న మాట, 'బడ్జెట్'. వ్యక్తిగత స్థాయిలో గృహస్థు, లేదా గృహిణి ఎప్పటికప్పుడు జమా, ఖర్చులు బేరీజు వేసుకుంటూ ఒడుపుగా సంసారాన్ని నడపడం కూడా బడ్జెట్ కూర్పు లాంటిదే. ప్రభుత్వాల స్థాయిలో అయితే ఏడాది కాలానికి సరిపోయే ఆదాయ, వ్యయాల ప్రణాళికకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతుంది. అది యావద్దేశ ప్రజల జీవన స్థితిగతులతో ముడిపడి ఉంటుంది కనుక అన్ని వర్గాలవారూ దానికోసం చకోరపక్షులవుతారు. తీరా వచ్చాక ఆశాభంగాలూ ఉంటాయి, ఆశోద్దీపనలూ ఉంటాయి. ఆ విధంగా బడ్జెట్ ఆర్థికాంశాల కూర్పే కాదు; ఆశ నిరాశల కలగలుపు కూడా! కిందటి వారమే కేంద్రం స్థాయిలో మరో బడ్జెట్ సమర్పణ ముగిసింది కానీ, దానిపై చర్చ కొనసాగుతూనే ఉంది.

బడ్జెట్ అనే మాట ఎలా పుట్టిందో తెలుసుకోవడమూ ఆసక్తిదాయకమే. లాటిన్‌లో తోలు సంచీని 'బుల్గా' అనేవారు. ఆ మాటే ఫ్రెంచిలో 'బూజ్', 'బగెట్' అయింది. వాటినుంచే 'బడ్జెట్' పుట్టి 15వ శతాబ్ది నుంచి ప్రచారంలోకి వచ్చింది. ఆదాయ, వ్యయాల ముందస్తు ప్రకటన అనే అర్థంలో ఈ మాటను మొదటిసారి 1733లో ఉపయోగించారట. కోశాగార మంత్రి తన ద్రవ్య ప్రణాళికను ఉంచుకునే తోలుసంచీ 'బడ్జెట్' అనే మాటను ప్రపంచానికి అందించింది. ఈ రోజున విరివిగా వాడే 'వాలెట్', 'పౌచ్'లు కూడా బడ్జెట్ అనే తోలుసంచీకి లఘురూపాలే. 14వ శతాబ్ది నుంచి వాడుకలో ఉన్న 'వాలెట్'కు వస్తువులను చుట్టబెట్టేదని అర్థం. ఇది 'వెల్' అనే ప్రోటో–ఇండో–యూరోపియన్ మూలం నుంచి వచ్చింది. విశేషమేమిటంటే, సంస్కృతంలో 'వలతే', 'వలయం' అనే మాటల మూలాలు కూడా 'వెల్'లోనే ఉన్నాయని భాషావేత్తలు అంటారు. 'పౌచ్' అనే మాటే రకరకాల రూపాల మీదుగా 'ప్యాకెట్' అయింది. బడ్జెట్ అనబడే తోలుసంచే బడ్జెట్ రోజున నేటి ఆర్థికమంత్రులు చేతుల్లో బ్రీఫ్ కేస్‌గా మారిన సంగతిని ఊహించడం కష్టం కాదు. బడ్జెట్ వివరాల గోప్యతకు సంకేతంగా కూడా దానిని తీసుకోవచ్చు.

ఆధునిక కాలంలో మన దేశంలో బడ్జెట్ సంప్రదాయం 1860లో మొదలైందనీ, నాటి బ్రిటిష్ ప్రభుత్వంలో భారత ఆర్థికమంత్రిగా ఉన్న జేమ్స్ విల్సన్ దానికి నాంది పలికారనీ చరిత్ర చెబుతోంది. స్వతంత్ర భారతంలో తొలి బడ్జెట్ సమర్పకులు ఆర్.కె.షణ్ముగం చెట్టి కాగా, బడ్జెట్‌కు నేటి రూపూ, రేఖా కల్పించిన ఆర్థిక పండితుడు పి.సి.మహలనోబిస్. అయితే, చరిత్ర కాలానికి వెళితే, మౌర్యుల కాలంలోనే ఒక ఏడాదికి సరిపోయే బడ్జెట్‌నూ, గణాంకాలనూ కూర్చేవారని చరిత్ర నిపుణులంటారు. ఆ కాలానికే చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రం దానికి ఆధారం. కాకపోతే, అప్పట్లో ఏడాదికి 354 రోజులు. గురుపూర్ణిమగా చెప్పుకునే ఆషాఢ పూర్ణిమ నుంచి సంవత్సరాన్ని లెక్కించేవారు. నేటి బడ్జెట్ తరహా కూర్పే ఇంచుమించుగా అర్థశాస్త్రంలోనూ కనిపిస్తుంది. అర్థమంటే డబ్బు కనుక అర్థశాస్త్రం కేవలం ఆర్థిక విషయాలే చెబుతుందనుకుంటారు కానీ, కౌటిల్యుని ఉద్దేశంలో అర్థమంటే, మనుషుల జీవన విధానానికీ, వారు నివసించే భూమికీ చెందిన అన్ని విషయాలనూ చెప్పేదని– ప్రసిద్ధ సంస్కృత పండితుడు, అర్థశాస్త్ర వ్యాఖ్యాత పుల్లెల శ్రీరామచంద్రుడు అంటారు. అర్థశాస్త్రం ప్రకారం నాటి బడ్జెట్ సంవత్సరాన్ని 'రాజవర్షం' అనేవారు. నేటి ఆర్థికమంత్రిని పోలిన అధికారిని 'సమాహర్త' అనేవారు. ఏయే ఆదాయ వనరు నుంచి ఎంత ఆదాయం రావాలో నిర్ణయించడం, ఆదాయం పెంచడం, ఖర్చు తగ్గించడం అతని బాధ్యత. 'ఆయముఖాలు' అనే పేరుతో ఆదాయాన్ని వర్గీకరించేవారు. ఆదాయమిచ్చే వస్తువును 'ఆయశరీర' మనేవారు. నగరం, జనపదం, గనులు, సేద్యపు నీటి వనరులు, అడవులు, పశువుల పెంపకం, వర్తక మార్గాలు, వ్యవసాయం, సుంకాలు, జరిమానాలు, తూనికలు, కొలతలు, ప్రవేశానుమతులు (పాస్‌పోర్ట్‌లు), మద్యం, దారం, నెయ్యి, ఉప్పు, ఖనిజాలు, రంగురాళ్ళు, బంగారపు పని, కళారంగం, ఆలయాలనే కాక; ఆ కాలపు రీతి రివాజులను బట్టి వేశ్యావృత్తిని, జూదాన్ని కూడా ఆదాయ మార్గంగానే చూసేవారు. వీటిలో ఒక్కోదానికీ పర్యవేక్షణాధికారి ఉండేవాడు. మతపరమైన తంతులు, సాయుధ దళాలు, ఆయుధాలు, గిడ్డంగులు, కర్మాగారాలు, కార్మికులు, రాజప్రాసాద నిర్వహణ ప్రభుత్వం ఖర్చు కిందికి వచ్చేవి. రాజుకు వ్యక్తిగత సంపద ఉండేది కానీ, రాచకుటుంబంలోని మిగతా సభ్యులకు జీతాలు చెల్లించేవారు.

అయితే, ఆదాయం చాలావరకు వస్తురూపంలో ఉండేది కనుక గిడ్డంగులలో భద్రపరిచేవారు. గిడ్డంగులపై అధికారిని 'సన్నిధాత్రి' అనేవారు. ఇంకా విశేషమేమిటంటే, నేటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ లాంటిదే అప్పుడూ విడిగా ఉండేది. ఆదాయవ్యయ పత్రాలనూ, లెక్కలనూ తనిఖీ చేసే ఆ విభాగాధికారిని 'అక్షపటలాధ్యక్షుడ'నేవారు. ఇప్పుడున్నట్టు ఆదాయం పన్ను, కార్పొరేట్ పన్ను, పరోక్ష పన్నులు, వడ్డీ రాయితీ వంటివీ; సాధారణ సేవలు, సామాజిక సేవలు, ఆర్థిక సేవల వంటి వర్గీకరణలూ; సంక్షేమ స్పృహా అప్పుడూ ఉండేవి. కాకపోతే ఇప్పటిలా అభివృద్ధి కేంద్రితమైన ఆలోచనలు అర్థశాస్త్రంలో లేవని పండితులంటారు. కాలానుగుణమైన తేడాలను అలా ఉంచితే, "ప్రజాహితమే రాజు హితం, ప్రజలకు ప్రియమైనదే రాజుకూ ప్రియమైనది కావా"లనే అర్థశాస్త్ర నిర్దేశం త్రికాల ప్రభుత్వాలకూ వర్తించే తిరుగులేని సూత్రం.

లండన్‌లో ఒక వేసవి సాయంత్రం

కామెంట్



కరణ్ థాపర్

వసంతంలో ఇంగ్లండ్‌లో ఉండాలన్నాడు కవి. నిజానికి వేసవి మంచి సమయం. బ్రిటన్‌లో ఒక మంచి వేసవి అరుదుగా ఉంటుంది. ఎండలు మండిపోయే వేసవి రోజున ఏ దేశం కూడా బ్రిటన్‌ను తలదన్నలేదు. పచ్చిక మైదానాలలో గొర్రెపిల్లలు ఉల్లాసంగా సంచరిస్తున్నట్లు స్థానికులు ఉద్యానాలకు చేరుకుంటారు. అక్కడ వారు ఆడతారు, సూర్యరశ్మి కింద హుషారుగా గెంతులేస్తారు. మీగడ, పంచదార అద్దిన స్ట్రాబెరీ పండ్లు బ్రిటిష్ వారి వేసవి ఆనందాల హరివిల్లులు. వారు ఎండలో ఆనందిస్తారు. అది మండించే ఎండైనా సరే. కానీ మనం దాని నుంచి దాక్కుంటాము. తాజా వేసవి గాలులకు బదులుగా ఎయిర్ కండిషనర్‌లకు మొగ్గు చూపుతాము. బ్రిటిషర్లకూ, మనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అది సూక్ష్మంగా తెలియపరుస్తుంది.

ఎండలు మండిపోయే ఒక వేసవి రోజున ఏ దేశం కూడా బ్రిటన్‌ను తలదన్నలేదు. వాతావరణం మాత్రమే కాదు, ఆ ప్రాంతం కూడా దానికై అదే రూపాంతరం చెందుతుంది. నిజానికది రమణీయత. ఎలాగంటే, పచ్చిక మైదానాలలో గొర్రెపిల్లలు ఉల్లాసంగా సంచరిస్తున్నట్లు స్థానికులు ఉద్యానాలకు చేరుకుంటారు. అక్కడ వారు ఆడతారు, సూర్యరశ్మి కింద హుషారుగా గెంతులేస్తారు. మగవాళ్లు సాధారణంగా షార్ట్స్‌లో – తరచూ నడుము పైభాగాన ఒంటిపై బట్టలేమీ లేకుండా – ఉంటారు. ఆడవాళ్లు అంతకంటే తక్కువ దుస్తులతో కనిపించవచ్చు. ఆడా మగా ఇద్దరూ కూడా తమ చుట్టూ ఉన్న ప్రపంచం పట్టనట్లుగా మైమరచి ఉంటారు.



లండన్‌లోని రీజెంట్ స్ట్రీట్

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం తర్వాత గత శుక్రవారం అచ్చు ఆ విధంగానే ఉంది. గూగుల్ చెబుతున్న దానిని బట్టి ఆ రోజు ఢిల్లీ కన్నా లండనే ఎక్కువగా వేడిగా ఉంది. సాయంత్రం 5 గంటలకు సెయింట్ జేమ్స్ పార్క్‌లో 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా, అదే సమయంలో సఫ్దర్‌జంగ్‌లో ఉన్న వేడి 29 డిగ్రీలు మాత్రమే. ఎప్పుడూ మూతి బిగించుకుని ఉండే అనేకమంది బ్రిటిషర్ల ముఖాలపైకి ఉత్సాహభరితమైన చిరునవ్వును తీసుకురాగల విషయం అది.

వాస్తవ వైరుధ్యం ఏమిటంటే లండన్‌లోనే వేడి చాలా ఎక్కువగా ఉన్నట్లు మీకనిపిస్తుంది. అందువల్లే నింగిలోని మబ్బులు, తెరిపివ్వని జల్లులు, తడిసిన కాలిబాటలు... అన్నీ జ్ఞాపకాల్లా నిమిషాల్లో మాయమైపోతుంటాయి. మీరు కనుక రీజెంట్ స్ట్రీట్ లేదా బాండ్ స్ట్రీట్‌లో షాపింగ్ చేస్తుంటే సూర్యుడి భగభగలు మండించేస్తాయి. రోడ్ల నుంచి, భారీ భవనాల నుంచి వెలువడే వేడి మిమ్మల్ని తన జ్వలించే ఆలింగనంతో చుట్టుముట్టేస్తుంది.

ఇళ్లు ఉబ్బరిస్తూ ఉంటాయి. మీరెన్ని కిటికీలైనా తెరచి ఉంచండి. లోనికి వచ్చే గాలి మీకు చల్లగా అనిపించదు. ఒంటిపై మీరెంత తక్కువగానైనా దుస్తులు ధరించండి, అయినప్పటికీ ఒంటి నిండా దుస్తులు ఉన్నట్లు అనిపిస్తుంది. ఏదేమైనా, లేశమైనా మేఘఛాయ లేని ఆకాశం స్పష్టమైన నీలివర్ణంలో ప్రకాశిస్తూ (జాన్) కాన్‌స్టేబుల్ లేదా (జె.ఎం.డబ్ల్యు.) టర్నర్ (18వ శతాబ్దపు ప్రసిద్ధ బ్రిటన్ చిత్రకారులు) గీసిన చిత్రం సజీవంగా కళ్ల ముందుకు వచ్చినట్లుగా ఉన్నప్పుడు ఎవరు మాత్రం ఇంట్లోనే ఉండిపోవాలనుకుంటారు?

నేను బస చేసిన చోటు నుండి ఒక రాయి విసురుకు మరికాస్త దూరంలో ఉన్న హాలెండ్ పార్క్‌లో ఐస్‌క్రీమ్ వ్యాన్ చుట్టూ ఒక పెద్ద గుంపు మూగి ఉంది. బాదరబందీ లేని దంపతులు ఆ మైదానంలో నీడ పడుతున్న చోట్లలో విహారయాత్ర చేస్తున్నట్లుగా ఉన్నారు. ప్రతి చోటా పిల్లలు పరుగులు పెడుతూ, కేరింతలు కొడుతూ ఉంటే వారి నవ్వుల ఆనందం ఆ పచ్చిక బయలులో ప్రతిధ్వనిస్తూ ఉంది.

బ్రిటిష్ గ్రామీణ ప్రాంతాలలో అద్భుతమైన పుష్పించే ముళ్ల పొదలతో కనుచూపు మేరన ఇరువైపులా సస్యశ్యామలమైన పొలాలు కనిపిస్తూ ఉంటాయి. ఇంకాస్త దగ్గరగా చూస్తే కనుక స్ట్రాబెర్రీలను తెంపుతున్న యువజనులను మీరు గుర్తించవచ్చు. ఆ పండ్ల బుట్టలు ప్రతిచోటా అమ్మకానికి ఉంటాయి. మీగడ, పంచదార అద్దిన స్ట్రాబెరీ పండ్లు బ్రిటిష్ వారి వేసవి ఆనందాల హరివిల్లులు.

గ్రామీణ ప్రాంతాల్లోని మరొక ఆహ్లాదం – అక్కడొక విలేజ్ పబ్‌ను సందర్శించటం! ఒక అర లీటరు బిట్టర్స్‌ని (ఒక రకం బీరు) – బ్రిటిషర్లు పెద్దగా తాగే మనుషులు కారు – కొన్ని ఆలూ చిప్స్‌తో సేవిస్తూ చల్లటి గాలి మీ ముంగురులను కదిలిస్తుండగా ఆ ప్రాంగణంలో కూర్చొని ఉండటం ఒక మరపురాని అనుభూతి. ఇక ఎప్పటికీ అక్కడే ఉండిపోవాలనీ, అదెప్పటికీ ముగియకూడదనీ మీకు అనిపించే అవకాశం ఉంది.

"ఓహ్ టు బి ఇన్ ఇంగ్లండ్ నౌ దట్ స్ప్రింగ్ ఈజ్ హియర్" (ఓ! వసంతం వచ్చింది కాబట్టి ఇంగ్లండ్‌లో ఉండాలి) అని మొదట అన్నదెవరూ... కోల్‌రిడ్జా, లేక బ్రౌనింగా? గూగుల్‌ని అడిగితే వాళ్లిద్దరిలో ఎవరైనా కావొచ్చు అని సూచిస్తోంది. నిజానికి వేసవి కాలం మంచి సమయం. కానీ రెండిటినీ (వేసవిని, వసంతాన్ని) కలిపినందుకు బ్రిటిషర్లను మీరు క్షమించవచ్చు. బ్రిటన్‌లో ఒక మంచి వేసవి అరుదుగా ఉంటుంది. గత శుక్రవారం వరకు కూడా ఈ ఏడాది అలాంటి వేసవే లేనట్లుగా ఉండింది.

ఆ సాయంత్రం తాముంటున్న ఎన్నిస్‌మోర్ గార్డెన్స్ పచ్చికల్లో నాకు ఆతిథ్యం ఇచ్చినవారు తమ అతిథులను కాస్త షాంపేన్‌ను సేవించమని కోరారు. పగలు చల్లబడుతున్న కొద్దీ ఆ పసిడి వర్ణ సాయంకాలపు వెలుగులో ఆ తోటలో ఉండటం అన్నది స్వర్గంలా అనిపించింది. కానీ, పాపం అటువంటి ఆనందాలలో ఇమడలేని మాలోని కొందరు దేశీలు లోపలే ఉండిపోటానికి ఇష్టపడ్డారు. అది బ్రిటిషర్లకూ, మనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నాకు సూక్ష్మంగా తెలియపరిచింది. వారు ఎండలో ఆనందిస్తారు. తామెంత పొందగలరో అంతా వారు కోరుకుంటారు. అది మండించే ఎండైనా సరే. కానీ మనం దాని నుంచి దాక్కుంటాము. తాజా వేసవి గాలులకు బదులుగా మనం ఎయిర్ కండిషనర్‌లకు మొగ్గు చూపుతాము.

మర్నాడు ఉదయానికి వేసవి ముగిసిపోయింది. మేఘాలు తిరిగి వచ్చాయి. వర్షం మొదలైంది. షార్ట్స్ స్థానంలోకి జెర్సీలు వచ్చేశాయి. రివర్స్ బేస్‌బాల్ క్యాప్‌లను గొడుగులు ఆక్రమించాయి. సందేహం లేదు, మరొక వెచ్చటి ఎండ రోజును బ్రిటన్ తిరిగి కొద్ది వారాల తర్వాత చూడవచ్చు. ఆలోపు శరదృతువు... కప్పి ఉంచని మెడలను తన చలి విస్ఫోటాల శ్వాసలతో చుట్టేయవచ్చు. అందుకే వేసవిలో ఒక రోజు నేనక్కడ ఉన్నందుకు సంతోషిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొందరమంతే!



సింగపూర్ నుంచి ఇండియాకు వచ్చిన ప్రతిసారీ, చెల్లింపుల కౌంటర్ల వద్ద నేను ఒక భవిష్యత్ ఫిన్‌టెక్ ఊహాస్వర్గంలోకి అడుగుపెడుతున్నట్టూ, నేనో డైనోసార్‌ను అయినట్టూ అనిపిస్తుంటుంది. జనాలు భిన్న ఫ్యాన్సీ పద్ధతుల్లో చెల్లింపులు జరుపుతుంటే, నేను సిగ్గుగా నా క్రెడిట్ కార్డ్ బయటికి తీస్తాను... 'దయచేసి నా మీద ఏ తీర్పులూ ఇవ్వొద్దు' అని మౌనంగా ప్రార్థించుకుంటూ!

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ సీఈఓ

వికసించాల్సిన కమలం



క్యాలిఫోర్నియాకు అటార్నీ జనరల్‌గా కమలా హ్యారిస్ పనిచేస్తున్నప్పుడు, డోనాల్డ్ ట్రంప్ ఒక గేమ్ షోకు హోస్ట్. ఇప్పుడు చెప్పండి, ఎవరికి అర్హత లేదో!

– అలెక్స్ కోల్, పైలట్

మరీ ఇంత బాగానా?



ఒలింపిక్స్‌లో భారత బృందానికి వస్త్రాలను డిజైన్ చేసిన తరుణ్ తహిలియానీ ఎంతో స్ఫూర్తినిచ్చే పని చేశారు. ఇంతకంటే బాగా డిజైన్ చేయొచ్చని ఆయన అందరికీ ప్రేరణనిచ్చారు.

– పూర్బా రే, వ్యాఖ్యాత

మొత్తం చెప్పేస్తే...



ఇదొక సాధారణ సూత్రం. మీరు దాయాలనుకుంటున్నదే సరిగ్గా ఎవరైనా చెబుతున్నప్పుడు వారిని కోర్టుకు ఈడ్వొద్దు. ఎందుకంటే వాళ్లు మరిన్ని అసౌకర్యం కలిగించే సత్యాలను అట్టిపెట్టుకుని ఉండొచ్చు.

– నూపూర్ జె.శర్మ, సంపాదకురాలు

ఇంకాపోతే పేరే ఉండదేమో!



ఆసక్తికర పరిశీలన: పశ్చిమం నుంచి తూర్పు భారతావనికి ప్రయాణిస్తుంటే ఇంటిపేర్లు పొట్టివవుతుంటాయి. కొంకణ్‌లో సర్దేశ్‌పాండే ఉంటుంది. మైదానాల్లో అది దేశ్‌పాండే అవుతుంది. ఈశాన్యానికి పోతుంటే పాండే; ఇక బెంగాల్ చేరేప్పటికి కేవలం 'దే' అవుతుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అందరికీ దక్కే అనుభూతి కాదు!

అనుభవం



డా॥ మెంతబోయిన సైదులు

నిష్కల్మషమైన పిల్లల ప్రేమ పొందడం ఉపాధ్యాయునికి ఒక వరం. గత జూన్‌లో పదోన్నతులపై బదిలీ అయిన ఎందరో ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న పాఠశాలల్లో చివరి పనిదినాన పిల్లల ఆప్యాయతకు కరిగి కన్నీరైనవారే! అందులో నేనూ ఒకడిని. మాది తెలంగాణలోని కర్విరాల కొత్తగూడెం గ్రామం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– పోలుమళ్ళలో తెలుగు ఉపాధ్యాయుడిగా 14 ఏళ్ల అనుబంధం!

జూన్ 13వ తారీఖు నుండి నేను బదిలీ అయ్యి వెళ్లిపోయే 27వ తారీఖు వరకూ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడే కాక మరికొందరు ఉపాధ్యాయులు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిపోతూ ఉన్నారు. పిల్లల బాధ వర్ణనాతీతం. ఎవరూ క్లాసులో మనసుపెట్టి పాఠం వినడం లేదు. అందరూ దిగాలు పడిపోయారు.

'హిందీ టీచర్, మీరు వెళ్తారటగా సార్?' అని కనుగుడ్ల నిండా నీళ్లు నింపుకొని అమాయకంగా అడిగే ఆ పసి హృదయాలకు 'కాదు' అని సమాధానం చెప్పడం అంటే అబద్ధమే అని చెప్పలేక, హృదయం ఆగి ఆగి కొట్టుకుంటుంటే మౌనం వహించాను. పిల్లలకు ఇతర ఉపాధ్యాయుల ద్వారా నిజం తెలిసింది.



జూన్ 26న పాఠశాల అసెంబ్లీ ముగిసిన దగ్గర నుండి పిల్లలు ఆఫీస్ చుట్టూ తిరగడం, నా కోసం వెతకడం, మాట్లాడాలని ప్రయత్నించడం, అన్ని తరగతుల విద్యార్థులూ ఒకే దగ్గర గుమికూడడం... అంతా ఒక విషాదకరమైన వాతావరణం నెలకొన్నది.

27వ తేదీ ఉదయం లేవగానే ఎర్రపహాడ్‌కు బదిలీ అయినట్లు సమాచారం అందింది. ఇంతకాలం మా పాఠశాలతో పెంచుకున్న అనుబంధం గుర్తుకువచ్చి కళ్లు చెమర్చాయి. ఉదయం పాఠశాలకు వెళ్లేసరికి హిందీ టీచర్ వెళ్లడానికి రెడీ అయ్యారు. పిల్లలు గుమికూడి టీచర్‌ను చుట్టుముట్టి వదిలిపెట్టడం లేదు. విపరీతమైన ఏడుపు, దారికి అడ్డు తగులుతూ వెళ్ళొద్దని ప్రాధేయపడ్డారు. టీచర్ కూడా కళ్ళ నీళ్లు పెట్టారు. లంచ్ తర్వాత నెమ్మదిగా బయలుదేరి వేరే స్కూల్‌కి వెళ్లారామె.

తర్వాత పది నిమిషాలకు విద్యార్థులు నా దగ్గరకు వచ్చారు. 'సార్! మీరు ఒక్కరైనా ఉండండి ప్లీజ్' అంటూ తరగతి గదిలోనే ఉన్నారు. 'మీరు భోజనం చేయండి, ఇక్కడే ఉంటాను' అని సర్ది చెప్పాను.

లంచ్ బ్రేక్ తర్వాత పిల్లలందరినీ కలవడానికి పిలిచాను. అందరికీ చాక్లెట్స్ పంచుతున్నాను. చాలామంది దుఃఖభరిత వదనాలతో 'మీరు కూడా వెళ్తున్నారా సార్?' అని ప్రశ్నిస్తున్నారు. నేను మౌనంగా చాక్లెట్లు పంచుతున్నాను. 'మీరు పాఠశాల వదిలి వెళ్తున్నారు, ఈ చాక్లెట్లు మాకు వద్దు' అంటూ కళ్ళనీళ్లు పెట్టుకోవడంతో నా మనసు కలుక్కుమన్నది. ముందుగా 9వ తరగతి పాప ఒకరు ఏడ్చుకుంటూ నా దగ్గరికి వచ్చింది. హఠాత్తుగా నా కాళ్లు పట్టుకుని ఏడవడం ప్రారంభించింది. వెంటనే మరో పాప కాళ్ళు పట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. వీరిని లేపే ప్రయత్నం చేస్తూ... దుఃఖాన్ని ఆపుకుంటూ పిల్లలను సముదాయిస్తున్నాను. పక్కకు తిరిగేలోపే పెద్దగా ఏడుపులతో పదవ తరగతి అమ్మాయిలు అందరూ నన్ను కదలనీయకుండా నా కాళ్ళను చుట్టేశారు. కొన్ని క్షణాల్లో పాఠశాల పిల్లలు అందరూ ఏడుపుతో 'వెళ్లొద్దు సార్, కాళ్లు మొక్కుతాం, దండం పెడతాం, మాకు మీరే కావాలి, ప్లీజ్ సార్, ప్లీజ్ సార్' అంటూ వెక్కివెక్కి ఏడుస్తుంటే... అచేతనుడినై కళ్ళ నీళ్ళు ఆపుకోలేక ఏడ్చేశాను. అప్పుడే పదోన్నతిపై పోలుమళ్ళ పాఠశాలకు బదిలీ అయిన హిందీ టీచర్ పాఠశాల ఆవరణలోకి ప్రవేశించారు. ఈ దృశ్యాన్ని చూసి తను కన్నుల నిండా కన్నీళ్లు తీసింది. పిల్లల ఏడుపులు బడి దాటి ఊర్లోకి వినిపించడం ప్రారంభించాయి. చుట్టుపక్కల ఇళ్ల వాళ్ళు పాఠశాలలోకి ప్రవేశించారు. కొంత ఆశ్చర్యానికి, మరింత బాధకు గురయ్యారు. బయాలజీ మేడమ్ వచ్చి పిల్లలను బ్రతిమాలుతూ తానూ కన్నీళ్లు పెట్టుకుంది. ఒక్కొక్కరినీ బుజ్జగించి, బతిమాలి లేపింది. పాఠశాల మైదానం మొత్తం నిండిపోయారు పిల్లలు. చివరకు అందరిని ఎలాగోలా తరగతి గదిలోకి పంపి అక్కడ ఒక టీచర్ ఉండి నన్ను బయలుదేరమనీ... లేదంటే ఈ రోజు వెళ్లడం కష్టం అనీ చెప్పారు. నేను తెచ్చుకున్న లంచ్ బాక్స్ అలాగే ఉంది. మా పాఠశాల హెచ్ఎమ్ మేడమ్ కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా గుండెల నిండా భారంతో, శోకతప్త హృదయంతో; పిల్లల ప్రేమను, ఆప్యాయతను కళ్ళల్లో నింపుకొని అక్కడి నుంచి బయలుదేరాను.

ఆ పసి హృదయాలది నిష్కల్మషమైన ప్రేమ. అది మనం సంపాదించే కోట్ల రూపాయల కన్నా విలువైనది. ఆ సంపద ఎక్కువగా దక్కేది ఉపాధ్యాయునికే!

వ్యాసకర్త తెలుగు ఉపాధ్యాయుడు | 9010910956

మనువాదులపై ఎక్కుపెట్టిన బాణం

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

సనాతన ధర్మ శాస్త్రాలలో ఉందని నిమ్న వర్గాల బాలికలకు దేవుడితో పెళ్ళి జరిపించి, వాళ్ళని వేశ్యలుగా మార్చి సమాజమంతా వాడుకునేది. వారినే 'దేవదాసీ'లనే వారు. ఆ దేవదాసీల వయసు నలభై దాటగానే వారిని వేలం వేసేవారు. వారిని వేలం పాటలో గెలుచుకుని, తీసుకుపోయిన వారు వారిని ఇంటి పనులకు, వ్యవసాయ పనులకు ఇతరత్రా వాడుకునేవారు. ఇలాంటి నికృష్ట వ్యవస్థను 'సనాతన ధర్మం' పేరుతో మనువాదులు ఈ దేశంలో వేల సంవత్సరాలు కొనసాగించారు.

1947 అక్టోబర్ 8న మద్రాస్ అసెంబ్లీలో సభ్యులు ఒ.పి. రామసామి రెడ్డియార్, ముత్తులక్ష్మీ రెడ్డి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం ఒక తీర్మానం ప్రవేశ పెట్టారు. అంతే– సభలో గందరగోళం జరిగింది. సనాతనవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆరోజు సభ ముగిసిన తరువాత సాయంత్రం పెరియార్ ఇ.వి. రామసామి దగ్గరికి ముత్తులక్ష్మీ రెడ్డి వెళ్ళి సలహా అడిగారు. ఆయన ఆలోచించి కొన్ని సూచనలు చేశారు. మరునాడు 1947 అక్టోబర్ 9న సభ ప్రారంభం కాగానే, సత్యమూర్తి అయ్యర్ చర్చ మొదలు పెట్టారు– 'దేవదాసీలంటే సనాతన ధర్మం ప్రకారం శాస్త్రయుక్తంగా దేవాలయాలలో ఏర్పాటు చేయబడ్డ పరిచారికలు. వారు నేరుగా దైవ సేవకులన్న మాట! వారు చేసే పవిత్ర కార్యాలను బట్టి వారు భగవంతుని కృపకు పాత్రులవుతారు. వారికి భోగభాగ్యాలు లభిస్తాయి'– అంటూ శాస్త్ర నియమాలన్నింటినీ ఉట్టంకిస్తూ సత్యమూర్తి సుదీర్ఘ ప్రసంగం చేశారు. మిగతా వారు కొందరు ఆయన బాణీలోనే మాటాడారు. అంతా అయ్యాక ముత్తులక్ష్మీ రెడ్డి లేచి ఇలా అన్నారు – 'అయ్యర్ గారు చెప్పిన శాస్త్ర విషయాలన్నింటితోనూ నేను ఏకీభవిస్తున్నాను. ఇన్ని వందల వందల సంవత్సరాల నుండి మేము చేస్తూ వచ్చిన సేవలకు మాకు అందిన దైవకృప చాలు. అందుకున్న భోగభాగ్యాలు కూడా మాకు సరిపోయాయి. ఇటువంటి పనులు – అంటే దేవదాసీల వృత్తి చేయడం వల్ల దేవుడి ఆశీస్సులు లభిస్తాయని నమ్మేవారూ, సనాతన ధర్మాన్ని గౌరవించాలని అనుకునేవారూ నిరభ్యంతరంగా వారి ఇంటి ఆడవారిని స్వచ్ఛందంగా దేవదాసీలుగా మార్చుకోవచ్చు. మాకు అభ్యంతరం లేదు. అయితే, మా నిమ్న వర్గాల మహిళలంతా ఈ వృత్తిని తిరస్కరిస్తున్నాం!' – అని ముగించారు.

సనాతన ధర్మం గురించి మహోపన్యాసాలిచ్చిన వారి నోళ్ళు మూతపడ్డాయి. దొంగకు తేలు కుట్టినట్టు కిక్కురుమనకుండా కూర్చున్నారు. అప్పుడు అసెంబ్లీ దేవదాసీ నిర్మూలన చట్టాన్ని ఆమోదించింది. ఆ తర్వాత వివిధ రూపాల్లో ఉన్న 'దేవదాసీ వ్యవస్థ' రద్దయ్యింది. దేవదాసీ వ్యవస్థ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడేది.



రేపు ముత్తులక్ష్మీ రెడ్డి జయంతి

అవన్నీ దేవదాసీ నిర్మూలనా చట్టంతో రద్దయ్యాయి. అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో 'మాతమ్మ – జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతంలో ఉన్న 'నంగా వ్యవస్థ', కన్నడ ప్రాంతంలోని 'బసివి' వ్యవస్థలు రద్దయ్యాయి.

దేవదాసీ వ్యవస్థ నిర్మూలనా చట్టం కోసం అధికారికంగా అసెంబ్లీలో పోరాడిన డాక్టర్ ముత్తులక్ష్మి స్వయంగా ఒక దేవదాసి కూతురు! ఒక దేవదాసీ బిడ్డ దేవదాసీ వ్యవస్థను రద్దు చేయించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం. పెరియార్ ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని, అనేక ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పోరాడి అసెంబ్లీకి వెళ్ళారు.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు.

1886 జూలై 30–1968 జూలై 22 మధ్యకాలంలో 82 ఏళ్ళు జీవించిన ముత్తులక్ష్మి, బ్రిటిష్ ఇండియాలో మద్రాస్ రాష్ట్రంలోని పుదుక్కోట్టై జిల్లా తిరుకోకర్నం గ్రామంలో జన్మించారు. ఆడపిల్లల చదువుకు తీవ్రమైన ఆంక్షలున్న ఆ కాలంలో మద్రాస్ మెడికల్ కాలేజి నుండి 1912లో వైద్యశాస్త్ర పట్టా సాధించారు. ఉన్నత విద్య కోసం ఆమె ఇంగ్లాండు వెళ్ళారు. కానీ, 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్' వారి ఒత్తిడి మేరకు తన బంగారు భవిష్యత్ ద్వారాలు మూసేసుకుని వచ్చి, మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చేరారు.

ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో– ప్రవేశం సాధించిన తొలి మహిళ. ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. అలాగే నాటి బ్రిటిష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్, సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి ఛైర్ పర్సన్, లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డెప్యూటీ ప్రెసిడెంట్, మద్రాస్ కార్పొరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వ ఇల్లమ్)కు రూపకల్పన చేసి, ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి, వేశ్యా వృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

1947లో ఎర్రకోట మీద ఆవిష్కరించిన తొలి భారతీయ పతాకంపై దేశంలో ముఖ్యమైన వారి పేర్లు రాశారు. అందులో ముత్తులక్ష్మి పేరు కూడా ఉంది. బహుముఖీనమైన ప్రతిభతో అనేక రంగాలలో కృషి చేస్తూ దేశసేవ చేసిన ముత్తులక్ష్మి కృషిని భారత ప్రభుత్వం గుర్తించి 1956లో పద్మభూషణ్ ప్రకటించింది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం: దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి: బ.నవమి రా.8.41 వరకు, తదుపరి దశమి; నక్షత్రం: భరణి ప.2.31 వరకు, తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.1.58 నుండి 3.29 వరకు; దుర్ముహూర్తం: ప.12.31 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు; అమృత ఘడియలు: ఉ.10.01 నుండి 11.32 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 5.40; సూర్యాస్తమయం: 6.31.

క్లుప్తంగా...

నాలుగో తరగతి బాలికపై 53 ఏళ్ల వ్యక్తి అత్యాచారం

నెల్లూరు జిల్లాలో దారుణం



కావలి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణం తుఫాన్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్న 53 ఏళ్ల మహబూబ్ బాషా అదే ప్రాంతంలో నాలుగో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు పనులకు వెళ్లగా, ఆరోగ్యం బాగా లేకపోవడంతో శనివారం బాలిక ఇంట్లోనే ఉండిపోయింది. ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌తో ఆడుకుంటూ ఉండగా మహబూబ్ బాషా ఇంట్లోకి వెళ్లాడు. బాలిక వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తోనే బాలిక నగ్న చిత్రాలను తీసి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కావలి టూ టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు చెప్పారు.

అలిపిరి మెట్ల మార్గంలో చీరాల భక్తుడికి పాముకాటు


నాగేంద్ర

చీరాల: తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు స్నేహితులతో కలిసి అలిపిరి మెట్ల మార్గంలో వెళ్తున్న బాపట్ల జిల్లా చీరాలకు చెందిన నాగేంద్ర (29) ఆదివారం పాము కాటుకు గురయ్యాడు. మార్గం మధ్యలో 7వ మైలు రాయి దాటిన తర్వాత ఓ టీస్టాల్ వద్ద నాగేంద్రను పాము కాటు వేసింది. సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంటనే అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సముచిత స్థానం కల్పించండి

పద్మశాలీ సామాజికవర్గ త్రిసభ్య కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న ముట్టే రామచంద్రరావు

కృష్ణలంక (విజయవాడతూర్పు): రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పద్మశాలీ సామాజిక వర్గానికి జనాభా నిష్పత్తి ప్రకారం ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులు కేటాయించి పాలనలో సముచిత స్థానం కల్పించాలని పద్మశాలీ సామాజికవర్గ త్రిసభ్య కమిటీ సభ్యులు ముట్టే రామచంద్రరావు, మెరువ వెంకటేశ్వరరావు, కొతవరపు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పద్మశాలీ సామాజికవర్గ త్రిసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ ప్రతినిధుల సమావేశం జరిగింది. త్రిసభ్య కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన వారందరిని ఏకతాటి పైకి తీసుకొచ్చి ఐక్యతతో హక్కులను సాధించుకునేలా దిశానిర్దేశం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, గంజి చిరంజీవి, వైకే, స్వర్గం పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు సమాజసేవకుల పేర్లు హర్షణీయం: పవన్



సాక్షి, అమరావతి: టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖలో అమలు చేసే పథకాలకు సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లను పెట్టడం హర్షణీయమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు ఆయన అభినందనలు తెలిపారు.

రూ.15వేల కోట్లు అప్పా? గ్రాంటా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15వేల కోట్లు గ్రాంట్‌గా ఇచ్చిందా? రుణంగా ఇచ్చిందా? అనేది సీఎం చంద్రబాబు స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం రామకృష్ణ మాట్లాడారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఏమిస్తారో కేంద్రం చెప్పలేదని.. చంద్రబాబు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రుణం ఇప్పించటానికి మోదీ గ్యారెంటీ అవసరం లేదని, అప్పు తెచ్చుకోగల సామర్థ్యం చంద్రబాబుకు ఉందన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా మోదీని అభినందిస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహారం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. ప్రజల అభిరుచికి తగ్గట్లే వ్యాపారస్తులు కూడా అధునాతన సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే పట్టణాల్లో సంతలు సూపర్ మార్కెట్లలోకి వచ్చాయి. ఇక మాంసం దుకాణాలు కూడా నీట్‌గా మారుతున్నాయి. బహుళజాతి సంస్థలతో పాటు స్థానిక వ్యాపారులు కూడా కస్టమర్లను ఆకర్షించడానికి నీట్‌నెస్ మెయింటైన్ చేస్తున్నారు. అలాంటి మాంసాహార ఉత్పత్తులు కొనడానికే ప్రజలు కూడా ఆసక్తి చూపుతున్నారు. మాంసాహార ఉత్పత్తులను కొన్ని సంస్థలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చాయి. వీటికి దీటుగా పట్టణ ప్రాంతాల్లో తాజా, ఫ్రోజెన్ ఉత్పత్తులు అందించడానికి నాన్ వెజ్ స్టోర్స్, మార్ట్‌ల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. – సాక్షి, అమరావతి



నీట్‌గా మీట్

- పట్టణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న హైజెనిక్ చికెన్, మటన్, ఫిష్ మార్టులు
- పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్న ఔత్సాహికులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో మాంసాహార మార్టులు
- అందుబాటులోకి తాజా, ఫ్రోజెన్ మాంస ఉత్పత్తులు
- ప్రధాన పట్టణాలు, నగరాల్లో విస్తరిస్తున్న నయా బిజినెస్ ట్రెండ్



మీట్ మార్ట్‌కు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఔత్సాహికులు పెట్టుబడులు పెడుతున్నారు. కొందరు నేరుగా మార్టులు నడుపుతుంటే.. మరి కొందరు ఫ్రాంచైజీ తరహాలో ఈ మార్ట్‌లను విస్తరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిరుద్యోగ యువత ముందుకొస్తున్నారు. కేవలం చేపలు, కోడి, మేక మాంసాలకే పరిమితం కాకుండా అన్ని రకాల మాంసాహార ఉత్పత్తులు ఒకే చోట అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా మార్ట్‌లు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 50కు పైగా ఉన్నాయి. ఈ మార్టుల ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున ఐదారు కోట్ల రూపాయలకు పైగా వ్యాపారం జరుగు తోందని అంచనా వేస్తున్నారు. ఉన్నత, ఎగువ మధ్య తరగతి ప్రజలుండే ప్రాంతాలే లక్ష్యంగా మార్టుల యజమానులు షాప్స్ ఓపెన్ చేస్తు న్నారు. విశాఖ, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో ఇవి బాగా విస్తరిస్తున్నాయి.

రాష్ట్రంలో మీట్ మార్టులు **50**

రోజుకు సగటున జరుగుతున్న వ్యాపారం (రూ. కోట్లలో) **5-6**

ఒక్కో మీట్ మార్టుకు పెట్టుబడి (రూ.ల్లో) **30-50** లక్షల వరకు

మీట్ మార్టుల ప్రత్యేకతలు ఇవే..

- కబేళాలతో పాటు డ్రెస్సింగ్, ప్యాకింగ్ ఇలా ప్రతీ దాంట్లో అంతర్జాతీయ ప్రమాణాలు
- పరిసరాలన్నీ అత్యంత పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్
- వచ్చే ప్రతీ కస్టమర్ కళ్లెదుటే వారికి కావాల్సినట్టుగా కట్ చేసి ప్యాకింగ్
- మటన్, చికెన్, ఫిష్ తదితరాలకు ఏ పార్ట్ (భాగం) కావాలంటే ఆ పార్టులు వేరుగా విక్రయం
- బిర్యానీ, తందూరీ వంటి వంటకాలకు తగినట్టుగా కట్ చేసి ప్యాకింగ్
- రెడీ టూ కుక్‌కు వీలుగా మసాలాలు అద్ది మరీ అందించడం
- డోర్ డెలివరీకి ప్రత్యేకంగా కాల్ సెంటర్

శుచి, శుభ్రత ముఖ్యం



శుచి, శుభ్రత ఉంటే కాస్త ధర ఎక్కువైనా వెనుకాడడం లేదు. విజయవాడ నగరంలో పెద్ద ఎత్తున ఫిష్, మటన్ మార్ట్‌లు అందుబాటులోకి వచ్చాయి. బ్రతికున్న చేపలే కాదు.. శుభ్రమైన వాతావరణంలో కోడి, మేక మాంసంతో పాటు తాజాగా బతికి ఉన్న అన్ని రకాల రొయ్యలు ఈ మార్టుల్లో దొరుకుతున్నాయి.

–ఎం.హరినాథ్, రిటైర్డ్ డీఈ, పంటకాలవ రోడ్, విజయవాడ

ప్రజల్లో ఆదరణ బాగుంది



గత కొన్నేళ్లుగా మత్స్య ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నాను. రెండేళ్ల క్రితం ఈ రంగంలోకి అడుగు పెట్టా. తొలుత విశాఖలో ది హైపర్ మీటన్ స్టోర్ ఏర్పాటు చేశాను. ప్రస్తుతం విశాఖలో నాలుగు, కాకినాడ, విజయవాడల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఒక్కో మార్ట్‌కు రూ. 40 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. 50 మందికి ఉపాధి కల్పించా. నెలకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రజలు ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఆదరణ బాగానే ఉంది. ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు కూడా అవకాశం ఉంది. డోర్ డెలివరీ చేస్తున్నాం. భవిష్యత్‌లో మిగిలిన నగరాల్లో కూడా విస్తరించే దిశగా ముందుకెళ్తున్నాం.

– పసల పర్వేష్, ఎం.డీ., హైపర్ మీటన్ స్టోర్



కాకినాడ జిల్లా అన్నవరం సత్యన్నారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలను కూడా జస్టిస్ తిల్హరి దర్శించుకున్నారు.

– అన్నవరం/సఖినేటిపల్లి/వాడపల్లి/అయినవిల్లి

భుజం గాయాలకు ఆధునిక చికిత్స

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

లబ్బీపేట (విజయవాడతూర్పు): భుజాలకు (షోల్డర్) అయ్యే గాయాలకు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల(ఎస్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సహకారంతో ఆర్థోపెడిక్ రీజినల్ సీఎంఈ ఆదివారం విజయవాడలోని ఎస్ఎంసీలో జరిగింది. ఈ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, సీఎంఈ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటేష్ మాట్లాడుతూ మధుమేహులకు వచ్చే భుజం సమస్యలకు మెరుగైన వైద్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఈ పరిశీలకుడు డాక్టర్ సొంగా వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతాన సాఫల్య చికిత్సలపై అవగాహన అవసరం

సంతాన సాఫల్య చికిత్సలో ఆధునిక విధానాలు, పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఆదివారం సదస్సు జరిగింది. ఈ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంతాన సాఫల్య చికిత్సల్లో వస్తున్న ఆధునిక పద్ధతులపై పీజీలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.జగన్మోహనరావు మాట్లాడుతూ చికిత్సల్లో రీసెంట్ ట్రెండ్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం పీజీ విద్యార్థులు కేస్ ప్రజెంటేషన్ చేశారు.


జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, చిత్రంలో డాక్టర్ వెంకటేష్, డాక్టర్ వినయ్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అన్నదమ్ముల మృతి

- తీవ్రంగా గాయపడ్డ తల్లి
- కాకినాడ జిల్లా గండేపల్లిలో ప్రమాదం


ఘటనా స్థలంలో మృతదేహాలు

గండేపల్లి: రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబం.. పొట్టకూటి కోసం పొరుగూరు వెళ్లిన తల్లీ, కొడుకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కుమారులు మృత్యువాత పడగా, తల్లి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన కాకినాడ జిల్లా గండేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ, ఆమె కుమారులు రాజు (20), ఏసు (18), అఖిల్ (10) తోటలో పనుల నిమిత్తం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వెళ్లారు. శనివారం రాత్రి 10 గంటలకు వీరంతా మోటార్ సైకిల్‌పై తాడేరు బయలుదేరారు. రాత్రి 2.45 గంటలకు కాకినాడ జిల్లాలోని గండేపల్లి మండలం, మురారి గ్రామ శివారు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిపై నుంచి దూసుకెళ్లడంతో, దుర్గ తీవ్రంగా గాయపడగా, రాజు, ఏసు, అఖిల్ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుర్గను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి స్వామికి తప్పిన ప్రమాదం

- పోలేరమ్మ జాతరలో బెదిరిన ఎద్దులు
- ఎద్దు తగిలి కిందపడ్డ మంత్రికి స్వల్ప గాయాలు


ప్రమాదం జరగక ముందు పోలేరమ్మ కొలుపుల్లో ఎద్దుల బండి ముందు నిల్చున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (సింగరాయకొండ): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడులో జరుగుతున్న పోలేరమ్మ కొలుపులకు మంత్రి స్వామి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభలతో అలంకరించిన ఎద్దుల బండి ముందు నించొని ఫొటో తీసుకునే క్రమంలో ఎద్దులు బెదిరి ముందుకు ఒక్కసారిగా దూకాయి. ఈ క్రమంలో ఎద్దు తగలటంతో మంత్రి స్వామి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై మంత్రి స్వామిని పక్కకు లాగి ఎద్దులను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే గన్‌మెన్ ప్రసాద్‌కు ఎద్దుల కాడి తగిలి చొక్కా చినిగింది.

పచ్చ మీడియా డైరెక్షన్.. పోలీసుల ఓవరాక్షన్!

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులను హుటాహుటిన హెలికాప్టర్‌లో పంపి అక్కడేదో జరిగిపోయిందనే అనుమానాలు రేకెత్తించడం.. అనుమానితుల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని తనిఖీలు, విచారణ పేరుతో బెదిరించడం.. ప్రజలను రెచ్చగొట్టడం.. పూర్తిగా ఓ వర్గం మీడియా డైరెక్షన్‌లో దర్యాప్తు సాగడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

- ఘటన జరిగిన మర్నాడే ఈనెల 22న సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్వయంగా డీజీపీ, సీఐడీ చీఫ్‌లు హెలికాప్టర్‌లో మదనపల్లె చేరుకుని విచారణ చేపట్టారు. కట్టుదిట్టమైన ఆంక్షల మధ్య రహస్యంగా విచారణ చేపట్టినట్లు చెబుతున్నా ఆ వివరాలన్నీ ఎల్లో మీడియాకు లీక్ కావడం గమనార్హం. ఆ కథనాల ఆధారంగా దాడులు, విచారణలు సాగుతుండటంతో ఇక విచారణ ఎంత నిష్పాక్షపాతంగా సాగుతుందో ఊహించవచ్చు. డీజీపీ, సీఐడీ చీఫ్ ఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా మీడియాను అనుమతించని పోలీసులు టీడీపీ నేతల కార్లను మాత్రం సాదరంగా లోపలికి పంపారు. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు వారు వచ్చినట్లు స్పష్టమవుతోంది.
- విచారణ మొదలైన తొలిరోజు సాయంత్రం ఎల్లో మీడియాను మాత్రమే లోపలకు అనుమతించారు. అంతకుముందు టీడీపీ నేతలను లోపలకు పంపారు. వారితో ఉన్నతాధికారులు చర్చలు జరిపినట్లు చెబుతున్నారు.

అటు వార్తలు.. ఆపై దాడులు

ఎల్లో మీడియాలో వైఎస్సార్ సీపీ నాయకుల గురించి వార్తలు రావడమే ఆలస్యం పోలీసులు దాడులు, తనిఖీలకు దిగుతున్నారు. ఈనెల 23న వైఎస్సార్‌సీపీకి చెందిన మాధవరెడ్డిపై ఈనాడులో వార్త రాగానే పోలీసులు ఆయన ఇంట్లో సోదాలు జరిపారు. అదే పత్రికలో ఈనెల 25న వైఎస్సార్‌సీపీకి చెందిన మరో నాయకుడు బాబ్‌జాన్ గురించి కథనం ప్రచురించడంతో పోలీసులు ఆయన ఇంటిపై దాడులకు దిగి అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. మాజీ ఎమ్మెల్యేను విచారణకు పిలిచే అవకాశం ఉందంటూ 28న పరోక్షంగా నవాజ్ బాషానుద్దేశించి కథనాన్ని వెలువరించడంతో ఉదయమే పోలీసులు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకు తనిఖీల పేరుతో హడావుడి సృష్టించారు.

- శనివారం మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటా చలపతి ఇంట్లో పోలీసులు సోదాలు జరిపారు. డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లి తర్వాత వదిలేశారు. మరో నాయకుడు బండపల్లి అక్కులప్ప విచారణకు హాజరు కాగా ఎల్లో మీడియాలో హంగామా సృష్టించారు.


మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటివద్ద పోలీసులు


ఎవరీ మాధవరెడ్డి?

వైకాపా రాష్ట్ర కీలక నేత ప్రధాన అనుచరుడిగా చెలామణి అవుతున్న మాధవరెడ్డి గత రెండు రోజులుగా సబ్ కలెక్టరు కార్యాలయంలో తిరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. కీలక నేతకు బినామీగా ఉన్న ఇతని పేరిట భారీగా భూములు కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. కార్యాలయంలో జరిగిన ఫైలు నకు మాధవరెడ్డి ప్రమేయంపై ఆరా తీస్తున్నారు. ఇతని ఫస్టుపై సాంకేతిక

ఈ నెల 23న ఈనాడులో ప్రచురించిన వార్త

ఈ నెల 25న ఈనాడులో ప్రచురించిన వార్త

● బాబ్‌జాన్ అనే ఎర్రచందనం స్మగ్లర్... పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. ఇతను సైతం పెద్దిరెడ్డికి అనుచరుడంటూ భూదందాలు సాగించారు. పోలీసులు ఇతనిపై నిఘా పెట్టడం, భూదందాల ఆరోపణలు, బాధితుల నుంచి ఫిర్యాదులతో సంచలనంగా ఉంది.



పెద్దిరెడ్డి పీఏ ఇంట్లో సోదాలు

టాస్క్‌ఫోర్స్: మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటనకు సంబంధించి విచారణ జరుపుతున్న పోలీసులు ఆదివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు శశికాంత్ నివాసంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో పది మంది పోలీసులు పాల్గొన్నారు.

ఎలాంటి తప్పు చేయలేదు

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ఐదేళ్ల పదవీకాలంలో ఎక్కడా కబ్జాలు, అవినీతికి పాల్పడలేదని, ఎలాంటి తప్పు చేయలేదని మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా స్పష్టం చేశారు. శనివారం రాత్రి తాను బెంగళూరులో ఉన్న సమయంలో 22(ఏ) నిషేధిత భూముల బదలాయింపులకు సంబంధించిన ఆరోపణలపై తన నివాసంలో తనిఖీలు నిర్వహించనున్నట్లు పోలీసులు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. తాను ఆదివారం ఉదయం వస్తున్నట్లు చెప్పి తనిఖీలకు సహకరించినట్లు తెలిపారు. రెవెన్యూ, ప్రభుత్వ శాఖల్లో అవినీతికి తావు లేకుండా వైఎస్సార్ సీపీ హయాంలో పారదర్శక పాలన అందించినట్లు గుర్తు చేశారు. ఎక్కడా తలదించుకునేలా వ్యవహరించలేదన్నారు.

కొలనుపాక ఒకప్పుడు జైన విద్యా కేంద్రం

వెలుగుచూసిన శాసన ఆధారం


విద్యాకేంద్రమని సూచించే శాసనమిదే

సాక్షి, హైదరాబాద్: జైన ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న కొలనుపాక ఒకప్పుడు జైన విద్యాకేంద్రంగా కొనసాగిందనేందుకు తాజాగా మరో ఆధారం వెలుగు చూసింది. ఆలయ ప్రాంగణంలోని జైన శిల్ప సంగ్రహాలయం బయట ఉన్న శాసనం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. తాజాగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, విరువంటి గోపాలకృష్ణ, గణేశ్‌లాల్‌లతో కూడిన బృందం ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. శాతవాహనులు, ఆ తర్వాతి కాలాల్లో తెలంగాణ ప్రాంతంలోని కొన్ని చోట్ల జైన విద్యాకేంద్రాలు కొనసాగినట్టు ఆధారాలు వెలుగుచూశాయి. ఇప్పుడు వెలుగు చూసిన శాసనం 10–11 శతాబ్దాలకు చెందిన కళ్యాణీ చాళుక్యుల కాలం నాటిదిగా భావిస్తున్నట్టు హరగోపాల్ వెల్లడించారు. ఈ శాసన స్తంభం మీద జైన మహావీరుడు, దిగువన వ్యాసపీఠం (చదివే పుస్తకాన్ని ఉంచే బల్ల), దానికెదురుగా వ్యాఖ్యాన ముద్రలో ఉపాధ్యాయుడు కూర్చుని ఉన్నట్టు చెక్కారు. దిగువన తెలుగన్నడ లిపిలో శాసనం ఉంది. జైనమూల సంఘంలోని సామిదేనిగణానికి చెందిన సరస్వతిగచ్ఛను తెలిపే శాసనమని ఆయన పేర్కొన్నారు. జైన బసదుల్లో విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందేదని జైన సాహిత్యం చెబుతోందని, తాజా శాసనం వల్ల కొలనుపాక కూడా ఒకప్పుడు జైన విద్యా కేంద్రంగా భాసిల్లిందన్న విషయం తెలుస్తోందని పేర్కొన్నారు.

కర్ణాటకలో అధిక ద్రవ్యోల్బణం.. కాంగ్రెస్ సర్కారే కారణం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజం



బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిప్పులు చెరిగారు. అధిక ద్రవ్యోల్బణం, క్షీణిస్తున్న శాంతి భద్రతలే కాంగ్రెస్ ప్రభుత్వంతో కర్ణాటకకు దక్కాయని విమర్శించారు. కేంద్రంతో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ సీఎం సిద్ధరామయ్య చేసిన ప్రకటనపై ఆమె ఆదివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలవడానికి ఇంధనం, స్టాంప్ డ్యూటీ, పాల ధరలను భారీగా పెంచడం, కనిష్ట మూలధన వ్యయమే కారణమని పేర్కొన్నారు. దేశంలో సరాసరి ద్రవ్యోల్బణం 5.4 శాతం కాగా, కర్ణాటకలో ఇది 6.1శాతంగా ఉందన్నారు. అంతకుముందు భారతీయ జనతా పార్టీ పాలనలో రాష్ట్రంలో ద్రవ్యోల్బణం, జాతీయ సరాసరి కంటే తక్కువగానే ఉందన్నారు.

31న తెలంగాణ కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ ఈ నెల 31న సాయంత్రం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జిష్ణుదేవ్ వర్మ 2018–23 మధ్యకాలంలో త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. కాగా జార్ఖండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న రాధాకృష్ణన్‌ను కేంద్రం మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించడం తెలిసిందే.

అమర్‌నాథ్ యాత్రకు పోటెత్తుతున్న భక్తులు

జమ్మూ: ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రలో రికార్డు స్థాయిలో భక్తులు పాల్గొన్నట్లు ఆలయ బోర్డు తెలిపింది. గత ఏడాది యాత్రలో మొత్తం 4.45 లక్షల మంది యాత్రికులు పాల్గొనగా ఈ ఏడాది జూన్ 29వ తేదీన యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి 29 రోజుల్లోనే ఏకంగా 4.51 లక్షల మంది మంచు గుహలోని స్ఫటిక లింగాన్ని దర్శించుకున్నట్లు వివరించింది. శ్రావణ పూర్ణిమ, రక్షాబంధన్ పండుగల రోజైన ఆగస్టు 29వ తేదీన 52 రోజుల అనంతరం యాత్ర ముగియనుంది.

బ్లింకెన్‌తో జై శంకర్ భేటీ



టోక్యో: భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఆదివారం జపాన్ రాజధాని టోక్యోలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో సమావేశమయ్యారు. రెండుదేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించామని జై శంకర్ 'ఎక్స్'లో తెలిపారు. మూడు వారాల క్రితం ప్రధాని మోదీ రష్యా పర్యటన అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాల్లో కొంత అసంతృప్తి నెలకొనడం, ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూపై న్యూయార్క్‌లో జరిగిన హత్యాయత్నం కుట్ర వెనుక భారత్ హస్తముందంటూ అమెరికా ఆరోపిస్తున్న నేపథ్యంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా భేటీలో ఈ రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చిందీ లేనిదీ తెలియాల్సి ఉంది. అయితే, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభంపై జై శంకర్‌తో చర్చించినట్లు బ్లింకెన్ 'ఎక్స్'లో వెల్లడించారు. సోమవారం టోక్యోలో జరిగే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ పాల్గొంటారు.

చైనాలో భారీ వర్షాలు.. 15 మంది మృతి

బీజింగ్: చైనాలో భారీ వర్షాలతో భవనం కొట్టుకుపోయిన ఘటనలో 15 మంది చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. హునాన్ ప్రావిన్స్‌లోని హెంగ్యాంగ్ నగరం సమీపంలోని యుయెలిన్ గ్రామం వద్ద ఆదివారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆకస్మికంగా సంభవించిన వరదల్లో ఓ నివాస భవన సముదాయంలోని ఓ భాగం మొత్తం ధ్వంసం కావడంతోపాటు అందులోని 18 మంది కొట్టుకుపోయారు. ఘటనలో 15 మంది చనిపోగా వెంటనే రంగంలోకి దిగిన సహాయక సిబ్బంది గాయపడిన ఆరుగురిని కాపాడగలిగారు.

వణికించే చలిలో.. రోడ్డుమీదే ప్రసవం...

దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి...!



కల్లోల గాజాలో విషాద గాథ

నవజాత శిశువు నిమాతో తల్లి ఆలా . (ఇన్‌సెట్‌లో) ఇప్పుడు ఆర్నెల్ల వయసులో నిమా

గాజా నగరం. జనవరి మాసం. రాత్రి 10 గంటలు. ఎముకలు కొరికే చలి. ఇజ్రాయేల్ దాడులతో బాంబుల మోత మోగిపోతోంది. 34 ఏళ్ల ఆలా అల్ నిమర్. అప్పటికే నిండు గర్భిణి. నడిరోడ్డు మీద పురిటినొప్పులు పడుతోంది. నేపథ్యంలో దూరంగా బాంబుల మోతలు. అంబులెన్స్‌కు కాల్ చేయడానికి నెట్‌వర్క్ లేదు. ట్యాక్సీ కోసం వెళ్లిన భర్త అబ్దుల్లా ఇంకా తిరిగి రాలేదు. 'ఎలాగైనా నేను ఆస్పత్రికి చేరుకున్నాకే ప్రసవించేలా చూడు తండ్రీ' అన్న ఆలా వేడుకోళ్లు ఫలించలేదు. దాంతో నిస్సహాయురాలిగా రోడ్డు మీదే ప్రసవించింది. ట్యాక్సీ దొరక్క వెనక్కి పరుగెత్తుకొచ్చిన భర్త నెత్తుటి కూనను చేతుల్లోకి తీసుకున్నాడు. బొడ్డుతాడు కత్తిరించేందుకు కూడా ఏమీ లేదు. సోదరుడు తెచ్చిన మెడికల్ కిట్‌లో ఉన్న కత్తెరతో బొడ్డుతాడు కత్తిరించారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లడానికి ఎట్టకేలకు ఓ కారు దొరికినా పెట్రోల్ అయిపోవడంతో అదీ ఆగిపోయింది. భర్త, సోదరుడు మొబైల్ ఫ్లాష్ లైట్‌తో దారి చూపుతుంటే పసికందును స్వెటర్‌లో చుట్టుకుని రక్తమోడుతూ గంటసేపు నడిచిందా పచ్చి బాలింత. దారంతా 'హెల్ప్ హెల్ప్' అని అరుస్తూనే ఉన్నారంతా. ఎట్టకేలకు ఓ మినీ బస్సు వారిని ఆస్పత్రి చేర్చింది. అప్పటికీ విపరీతమైన నిస్త్రాణతో ఆలా కళ్లు మూతలు పడ్డాయి. తెల్లవారి గానీ స్పృహలోకి రాలేదు. వెంటనే బిడ్డ కోసం తడుముకుంది. పాపాయి ఆరోగ్యంగా ఉందని డాక్టర్లు చెప్పాక గానీ కుదుట పడలేదు. యుద్ధం మొదలయ్యాక అదే ఆమెకు అత్యంత సంతోషాన్నిచ్చిన ఉదయం.

పది నెలలు.. పదకొండు దాడులు...

ఇది ఒక ఘటన మాత్రమే. గత అక్టోబర్‌లో గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టిన నాటినుంచి ఇలాంటి ఘటనలు కోకొల్లలు. బిడ్డలను పోగొట్టుకున్న తల్లులు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథలైన పిల్లలు. కళ్లముందే పిల్లలు మరణిస్తుంటే నిస్సహాయంగా చూసిన వృద్ధులు. తను ప్రసవించే నాటికన్నా యుద్ధం ఆగిపోవాలనిదేవుడుని వేడుకుంది ఆలా. అలా జరగకపోయినా నడి రోడ్డుపైనే ఈ లోకంలోకి వచ్చిన తన చిన్నారి నిమాకు మాత్రం ఇప్పుడు ఆర్నెల్లు నిండాయి. నిమా ఆమెకు మూడో సంతానం. ముగ్గురు పిల్లలకు సరైన ఆహారాన్ని ఇవ్వలేకపోతున్నాననే బాధ ఆలాను వెంటాడుతోంది. పిల్లలకు రోజుకు కనీసం ఒక్క రొట్టె దొరకడమే గగనంగా ఉంది. పూటకు పావు రొట్టెతో సరిపుచ్చుకుని అర్ధాకలితోనే పడుకుంటున్నారు. యుద్ధం మొదలవగానే గాజాలోని జైటౌన్‌లో ఉన్న ఆలా ఇంటిపై తొలి దాడి జరిగింది. దాంతో బంధువుల ఇంటికి వెళ్లారు. అదీ బాంబు దాడులకు బలవడంతో పొరుగు వాళ్ల ఇళ్లకు. అలా ఈ పది నెలల్లో ఆలా కుటుంబం ఏకంగా పదకొండు బాంబుదాడులు తప్పించుకుంది. కాకపోతే అన్నిసార్లూ నిరాశ్రయమవుతూ వచ్చింది. ఆలా ఎనిమిది నెలల గర్భవతిగా ఉండగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు వారుంటున్న ఇంటిని చుట్టుముట్టాయి. అప్పుడు ఆలా కుటుంబంతో పాటు 25 మంది దాకా ఇంట్లో ఉన్నారు. కేవలం దైవకృప వల్లే ఆ దాడి నుంచి బతికి బట్ట కట్టామని గుర్తు చేసుకున్నారామె. నెలకే మరో బాంబుదాడి ఆమె 26 ఏళ్ల సోదరుడిని పొట్టన పెట్టుకుంది. 'చీకటి రోజుల్లో మాత్రం ఆశల గానాలు ఉండవా!? ఉంటాయి. కాకపోతే చీకటిరోజుల గురించే ఉంటాయి' అన్నారో ఫ్రెంచ్ నాటకకర్త. ఇంతటి యుద్ధ మధ్యంలో, అంతులేని విషాదాల పరంపరలో ఆలా కుటుంబాన్ని నడిపిస్తున్నది ఒకే ఒక్కటి.. చిన్నారి నిమా బోసినవ్వులు...

- సాక్షి, నేషనల్ డెస్క్

39,324 మంది మృతి...

గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంలో ఇప్పటివరకు 39,324 మంది మరణించారు. 90,830 మంది గాయపడ్డారు. గత 24 గంటల్లో ఇజ్రాయేల్ జరిపిన దాడుల్లో 66 మంది మృతి చెందారు. 241 మంది గాయపడ్డారు. అక్టోబరు 7న హమాస్ నేతృత్వంలోని దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,139 మంది మరణించడం, అది యుద్ధానికి దారితీయడం తెలిసిందే.

చీర్ ఫర్ భారత్

ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మన క్రీడాకారులను ఉత్సాహపరుద్దాం: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్న మన క్రీడాకారులను మరింత ఉత్సాహపరుద్దామని, వారిని ప్రోత్సహిద్దామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. భారత అథ్లెట్లకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. చీర్ ఫర్ భారత్ అని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ వేదికపై భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించే అవకాశం ఒలింపిక్స్ క్రీడల ద్వారా మన ఆటగాళ్లకు వచ్చిందన్నారు. వారికి మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రధాని మోదీ ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. వివిధ అంశాలను ప్రస్తావించారు. కొన్ని రోజుల క్రితం గణితశాస్త్రంలో ఒలింపిక్స్ జరిగాయని, నలుగురు భారతీయ విద్యార్థులు బంగారు పతకాలు, ఒకరు రజత పతకం సాధించారని ప్రశంసించారు. అస్సాంలోని అహోమ్ రాజుల సమాధులకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కట్టడాల జాబితాలో స్థానం దక్కడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇది మనకు గర్వకారణమని అన్నారు. నేటి యువత మాదక ద్రవ్యాల విష వలయంలో చిక్కుకుంటుండడం బాధాకరమని అన్నారు. అలాంటి వారిని బయటకు తీసుకురావడానికి 'మానస్' పేరుతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్‌పై పోరాటంలో ఇదొక గొప్ప ముందడుగు అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనానికి సంబంధించి '1933' టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి

''త్వరలో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి. మువ్వన్నెల జెండాతో సెల్ఫీ దిగి హర్‌గర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయండి. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. ఖాదీ గ్రామోద్యోగ్ వ్యాపారం తొలిసారిగా రూ.1.5 లక్షల కోట్లకు చేరుకుంది. ఖాదీ, చేనేత వస్త్రాల విక్రయాలు పెరుగుతున్నాయి. దీనివల్ల నూతన ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఎంతోమందికి ఉపాధి లభిస్తోంది. ఖాదీ ఉత్పత్తులను ఉపయోగించడానికి ఇష్టపడినవారు ఇప్పుడు వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఖాదీ వస్త్రాలు ధరిస్తున్నారు. హరియాణాలోని రోహతక్‌లో 250 మంది మహిళలు బ్లాక్ పెయింటింగ్, డయింగ్ శిక్షణతో జీవితాలను తీర్చిదిద్దుకున్నారు'' అని మోదీ ప్రశంసించారు.

నల్లమల చెంచులు టైగర్ ట్రాకర్స్

ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల్లో నివసించే చెంచులను ప్రధాని మోదీ ప్రశంసించారు. వారిని టైగర్ ట్రాకర్స్‌గా అభివర్ణించారు. ''ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల కొండలపై నివసించే చెంచు తెగల ప్రయత్నాలు చూస్తే ఆశ్చర్యపోతాం. టైగర్ ట్రాకర్స్‌గా వారు అడవిలో వన్యప్రాణుల సంచారంపై ప్రతి చిన్న సమాచారం సేకరిస్తారు. అటవీ ప్రాంతంలో అక్రమ కార్యక్రమాలపైనా నిఘా పెడతారు. టైగర్ ఫ్రెండ్స్‌గా వ్యవహరించే వీరు మానవులు, పులుల మధ్య ఎలాంటి వైరం లేకుండా చూస్తారు. చెంచుల కృషితో పులుల సంఖ్య పెరుగుతోంది'' అని 'మన్‌కీ బాత్'లో కొనియాడారు. దేశవ్యాప్తంగా పులుల జనాభా గొప్ప విజయమని పేర్కొన్నారు. ప్రపంచంలోని మొత్తం పులుల్లో 70 శాతం పులులు మన దేశంలోనే ఉన్నాయని చెప్పారు. ఇది మనకు చాలా గర్వకారణమని చెప్పారు.

ఆదివారం బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంల భేటీలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు



అభివృద్ధి, వారసత్వాలకు పెద్దపీట

బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో ప్రధాని

న్యూఢిల్లీ: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా అవతరింపజేయడమే ఏకైక లక్ష్యంగా వికసిత్ భారత్ అజెండా ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. అయితే వికసిత్ భారత్ అజెండాలో ప్రాచీన, వారసత్వ కట్టడాలు, సంస్కృతులను కాపాడుకుంటూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఆయన అన్నారు. ఆదివారం ఢిల్లీలో బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ముఖ్యమంత్రి పరిషత్' భేటీలో 13 మంది సీఎంలు, 15 మంది డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడం, సంక్షేమ పథకాల్లో ప్రజల భాగస్వామ్యంపై ప్రధాని మాట్లాడారు. సమాజంలోని భిన్న వర్గాల్లో చిట్టచివరి వ్యక్తికి సైతం కేంద్ర పథకాలు, సుపరిపాలన గురించి తెలిసేలా సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సీఎంలు, డిప్యూటీ సీఎంలకు మోదీ సూచించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా, జేపీ నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రాలు ఎలా సమర్థంగా అమలు చేయాలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు. ''సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ అందేలా చూడటం మీ తక్షణ కర్తవ్యం. బీజేపీపాలిత రాష్ట్రాలు సుపరిపాలనకు సిసలైన చిరునామాగా మారాలి'' అని మోదీ అన్నారు.



బెయిల్ అర్జీలపై 'సేఫ్ గేమ్' వద్దు

ట్రయల్ కోర్టు జడ్జీలకు సీజేఐ హితవు

బెంగళూరు: బెయిల్ అర్జీల విషయంలో ట్రయల్ కోర్టుల జడ్జీలు 'సేఫ్ గేమ్' ఆడుతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. అనుమానాస్పదం అనే పేరు చెప్పి ప్రతి కేసులోనూ బెయిల్ తిరస్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆదివారం బెంగళూరులో బెర్క్లే సెంటర్ 11వ వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''ట్రయల్ కోర్టులు ప్రతి బెయిల్ పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. కానీ అనుమానాస్పదం పేరిట అర్జీలను ట్రయల్ కోర్టుల జడ్జీలు కొట్టేస్తున్నారు. ఇలాంటి సేఫ్‌గేమ్ పనికిరాదు. బెయిల్ అర్జీలపై ఇంగిత జ్ఞానంతో ఆలోచించాలి. కేసు ప్రాముఖ్యతను బట్టి తుది నిర్ణయం తీసుకోవాలి. అంతేగానీ పై కోర్టుకు వదిలేయకూడదు. ఎందుకంటే వాళ్లంతా హైకోర్టు గడపతొక్కుతున్నారు. అక్కడా బెయిల్ దొరక్కపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారు. అనవసరంగా అరెస్ట్ అయిన వాళ్లు కూడా సుప్రీంకోర్టు దాకా రావాల్సిన పరిస్థితి! ఇలాంటి కేసులన్నీ అంత దూరం రావడం సరికాదు'' అన్నారు. వాతావరణ మార్పులు మహిళలు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని సీజేఐ అన్నారు. ''వాతావరణ మార్పులతో వలసలు పెరుగుతున్నాయి. ప్రజలకు నాణ్యమైన జీవితం కరువవుతోంది. ఆహార కొరతతో చిన్నారులు, ఇతర సమస్యలతో మహిళలు బాధ పడుతున్నారు. ఇబ్బందుల కొలిమిలో కాలిపోతున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు.

ఐఎస్‌ఎస్ నుంచి త్వరలో సునీత రాక!

విజయవంతంగా థ్రస్టర్లకు రిపేరు

వాషింగ్టన్: బోయింగ్ తయారీ స్టార్‌లైనర్ వ్యోమనౌక భూమికి తిరుగుపయనంపై ఆశలు ఇంకాస్త చిగురించాయి. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)కు చేర్చాక స్టార్‌లైనర్‌లోని రియాక్షన్ కంట్రోల్ వ్యవస్థలోని కొన్ని థ్రస్టర్లు మొరాయించిన విషయం విదితమే. నౌకను శూన్యంలో సరైన దిశలో తిప్పేందుకు చిన్నపాటి ఇంజన్లవంటి థ్రస్టర్లు అత్యంత కీలకం. హీలియం సైతం లీక్ అవుతుండటంతో సునీత, విల్మోర్‌ల తిరుగుప్రయాణాన్ని వాయిదావేసి రిపేర్ల పనిపట్టడం తెల్సిందే. తాజాగా థ్రస్టర్లను ఒకదాని తర్వాత మరొకటి ఇలా 27 థ్రస్టర్లను మండించి వాటి పనితీరును పరిశీలించారు. 97–02 శాతం ఖచ్చితత్వంతో అవి పనిచేశాయని హాట్ ఫైర్ పరీక్షకు నాయకత్వం వహించిన ఫ్లైట్ డైరెక్టర్ కోలోయి మెహరింగ్ చెప్పారు. ఈ పరీక్ష జరిపినంతసేపు హీలియం వ్యవస్థలు సవ్యంగానే పనిచేశాయని మెహరింగ్ ప్రకటించారు. ఈ ఫలితాలను వచ్చేవారు సమీక్షించనున్నారు. ఐఎస్‌ఎస్‌ను ఏ రోజున భూమికి తిరుగుపయనం మొదలెట్టాలనే విషయాన్ని వచ్చేవారం సమీక్షలో చర్చించనున్నారు.

సొంత పార్టీ కుట్రకే బైడెన్ బలి

బెదిరించి తప్పించారు: ట్రంప్



వాషింగ్టన్: సొంత డెమొక్రాటిక్ పార్టీ నేతల కుట్రలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బలయ్యారని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఆయన్ను తొలుత బ్రతిమాలి, చివరకు భయపెట్టి అధ్యక్ష బరి నుంచి తప్పించారన్నారు. శనివారం మిన్నెసోటాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. ''బైడెన్‌కు 1.4 కోట్ల మంది ఓటర్ల అండ ఉంది. పోటీలో కొనసాగాలని కృతనిశ్చయంతో కన్పించారు. అలాంటి బలమైన నేతను బెదిరించి తప్పించారు. 'మర్యాదగా తప్పుకుంటే మంచిది. లేదంటే అవమానభారంతో పంపిస్తాం. అధ్యక్షుడు మరణించినా, బాధ్యతలు నిర్వర్తించలేని స్థితిలో ఉన్నా 25వ రాజ్యాంగ సవరణ ద్వారా తప్పించగలమని బెదిరించారు. అలా ఇంటిదారి పట్టించారు. చేసేదేమీ లేక బైడెన్ తప్పుకున్నారన్నది వాస్తవం. కానీ మీడియాలో మాత్రం తప్పుడు కథనాలొచ్చాయి. ఆయన ధైర్యంగా నిష్క్రమించారంటూ అంతా ఆయనను పొగుడుతూ ఆకాశానికి ఎత్తేశారు. వాస్తవానికి ఆయనను బలవంతంగా పక్కకు నెట్టేశారు'' అన్నారు.

కమలపై తిట్ల దండకం

డెమొక్రటిక్ పార్టీ నుంచి తన ప్రత్యర్థిగా దాదాపుగా ఖాయమైన కమలా హారిస్‌పై ట్రంప్ తిట్ల దండకానికి దిగారు. ''ఆమె మితిమీరిన ఉదారవాది. స్థిర చిత్తం లేని నాయకురాలు. మతిలేని వామపక్షవాది. అమెరికా చరిత్రలోనే అత్యంత అసమర్థ ఉపాధ్యక్షురాలు. గతంలో మార్క్సిస్ట్ జిల్లా అటార్నీగా శాన్‌ఫ్రాన్సిస్కోను నాశనం చేశారు. ఇలాంటి నేత అమెరికా చరిత్రలో ఎన్నడూ అధ్యక్ష పోటీలో నిలబడలేదు. హారిస్ పొరపాటున దేశాధ్యక్షురాలైతే దేశంలో హింస, కల్లోలం నిత్యకృత్యాలవుతాయి. ఆమె పరిపాలనలో అమెరికా అంతటా అతివాదం, వైఫల్యాలు, ఉద్రిక్త పరిస్థితులు.. చివరకు మూడో ప్రపంచ యుద్ధమే రావొచ్చు. అందుకే ఈ ఎన్నికల్లో ఆమెను మనం గెలవకుండా అడ్డుకుందాం. ఆమె అమెరికాకు కాకుండా నేరగాళ్లకు అధ్యక్షురాలిగా మసులుకుంటారు. ఆమె గెలిస్తే గాజా నుంచి కూడా శరణార్థులు అమెరికాకు వచ్చి తిష్టవేస్తారు' అని ట్రంప్ ఆరోపించారు. 'నేను గెలిచి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే తొలి రోజే బైడెన్-హారిస్ హయాంలో తీసుకున్న సరిహద్దు విధానాలన్నింటినీ చెత్తబుట్టలో పడేస్తా. సరిహద్దును మూసేసి అక్రమ వలసలను అడ్డుకుంటా' అని అన్నారు. అధికారంలోకి వస్తే క్రిప్టోకరెన్సీని సూపర్‌పవర్‌గా మలుస్తానని చెప్పారు.



ట్రంపే గెలుస్తారు

సంచనాల జ్యోతిష్యురాలి అంచనా

వాషింగ్టన్: ట్రంప్, కమలా హారిస్‌ల మధ్య ఓటర్ల మద్దతు కేవలం ఒక శాతం తేడా ఉందన్న వార్తల నడుమ అక్కడి ప్రముఖ జ్యోతిష్య రాలు అమీ ట్రిప్ ఆసక్తికరమైన భవిష్యవాణి వినిపించారు. అమెరికా అధ్యక్ష పగ్గాలు ట్రంప్ చేతి కొస్తాయని చెప్పారు. అధ్యక్షుడు జో బైడెన్ జూలై 21న రేసు నుంచి తప్పుకుంటారని ఆమె చెప్పిన జోస్యం ఫలించింది. దాంతో ఆమె పేరు మారుమోగిపోయింది. 'సూర్యుడు ట్రంప్‌నకు అత్యంత అనుకూలంగా ఉన్నాడు. ఈసారి గెలుపు ట్రంప్‌దే' అంటూ ట్రిప్ చేసిన తాజా పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. అంతేకాదు, ''హారిస్ శక్తిమంతమైన నాయకురాలిగా ఎదుగుతారు. నాలుగేళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికల బరిలో దిగుతారు'' అంటూ 2020లోనే చెప్పారు. అదీ అక్షరసత్యమైనట్టే కన్పిస్తోంది.

ఆగస్టులో అమెరికాలో విపరిణామాలు!

అమీ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆస్ట్రలాజికల్ రీసెర్చ్ (ఐసార్) నుంచి సర్టిఫైడ్ జ్యోతిష్యురాలు. లైసెన్స్‌డ్ థెరపిస్ట్ కూడా. నేషనల్ కౌన్సిల్ ఫర్ జియోకాస్మిక్ రీసెర్చ్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ ఆస్ట్రాలజర్స్‌లలో క్రియాశీలకంగా ఉన్నారు. గ్రహచారం తదితరాల ఆధారంగా బైడెన్ జూలై 21న అధ్యక్ష రేసు నుంచి తప్పుకుంటారు'' అని అమీ జూలై 11వ తేదీన చెప్పారు. అది అచ్చంగా అలాగే జరిగింది. ''ఈసారి ట్రంపే గెలుస్తారు. అయితే అధ్యక్షునిగా ఆయన అనూహ్య నిర్ణయాలతో అమెరికాలో రాజకీయ అనిశ్చితి ఏర్పడవచ్చు'' అమీ చెప్పారు. ఆగస్టులో ప్రచారం, రాజకీయాల్లో విపరిణామాలు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు!

అండర్‌డాగ్‌నే...

అయినా గెలుపు నాదే: కమల

జనం తనవైపే ఉన్నారని వ్యాఖ్యలు | తనతో చర్చకు ట్రంప్ వెనకాడారంటూ విసుర్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉంటానని ఎన్నడూ అనుకోలేదంటూ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''అండర్‌డాగ్‌గానే బరిలో దిగాను. అయితే ప్రజల అండ నాకుంది. వారి అభిమానంతో విజయం సాధిస్తా'' అంటూ ధీమా వెలిబుచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోవడంతో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన హారిస్ పేరు దాదాపుగా ఖరారవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మస్సాచుసెట్స్‌లోని పిట్స్‌ఫీల్డ్‌లో సుమారు 800 మంది దాతలతో తొలి సమావేశంలో ఆమె మాట్లాడారు. ''ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికలు రెండు భిన్న విధానాల మధ్య పోటీగా సాగుతున్నాయి. ఒకటి దేశాన్ని భవిష్యత్తు వైపు నడిపేది. మరోటి దేశ ప్రగతిని నిలువరించేది'' అని రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి చురకలు వేశారు. డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ అయేందుకు అవసరమైన సంఖ్యకు మించి డెలిగేట్లు తనకిప్పటికే మద్దతిచ్చారని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ''మనం ఎలాంటి దేశంలో నివసించాలని అనుకుంటున్నాం? స్వేచ్ఛ, ప్రేమ, చట్టబద్ధ పాలన కలిగిన దేశంలోనా? విద్వేషం, భయం, అశాంతి నెలకొన్న దేశంలోనా?'' అని ప్రశ్నించారు. తనతో చర్చకు ట్రంప్ ఇప్పటికే వెనుకడుగు వేశారంటూ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆయన తనతో డిబేట్‌కు ముందుకు వస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ''లాయర్‌గా అన్ని రకాల వ్యక్తులను చూశా. మహిళలను వేధించిన వారిని, వినియోగదారులను మోసగించి నిలువునా దోచుకున్న వారిని, స్వార్థం కోసం చట్టాలను ఉల్లంఘించిన వారిని దగ్గర్నుంచి గమనించా. అందుకే ట్రంప్ ఏ టైపో కూడా నాకు బాగా తెలుసు'' అని వ్యాఖ్యానించారు. తనపై ట్రంప్ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు.



వారంలోనే 20 కోట్ల డాలర్ల విరాళాలు

ఈ కార్యక్రమంలో 4 లక్షల డాలర్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 14 లక్షల డాలర్లు పోగవడం విశేషం. హారిస్ ప్రచారం ప్రారంభించిన వారంలోనే ఏకంగా 20 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,640 కోట్లు)ను విరాళాలుగా సేకరించారు. వీటిలో 66 శాతం తొలిసారిగా విరాళాలిచ్చిన వారి నుంచే అందాయని ఆమె బృందం పేర్కొంది. నవంబర్ 5న జరగనున్న ఎన్నికలు హోరాహోరీ కానున్నాయని, కొన్ని రాష్ట్రాల్లోని కొందరు ఓటర్లే నిర్ణాయకంగా మారవచ్చని అభిప్రాయపడింది. ఎన్నికలకు 100 రోజులే ఉండటంతో కమల దేశవ్యాప్తంగా సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. 2,300 ప్రచార కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధమైంది.

బ్రిటన్ విపక్షనేత రేసులో మాజీ మంత్రి ప్రీతీ పటేల్

లండన్: బ్రిటన్ విపక్షనేత పదవి కోసం భారతీయ మూలాలున్న మాజీ హోం మంత్రి ప్రీతీ పటేల్ పోటీపడుతున్నారు. తన సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ బ్రిటన్ సాధారణ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో రిషి సునాక్ తన విపక్ష నేత పదవి నుంచి నవంబర్ రెండోతేదీన వైదొలగనున్నారు. దీంతో పార్టీని మళ్లీని విజయయంత్రంగా మారుస్తానంటూ 52 ఏళ్ల ప్రీతీపటేల్ ఆదివారం తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. మాజీ మంత్రులు జేమ్స్ క్లెవర్లీ, టామ్ టగెన్‌డాట్, మెల్ స్ట్రైడ్, రాబర్ట్ జెన్రిక్‌లతో ఆమె పోటీపడనున్నారు.

హెజ్బొల్లా దాడిలో చిన్నారులు సహా... 12 మంది దుర్మరణం

టెల్‌అవీవ్: ఇజ్రాయెల్ ఆక్రమిత గోలాన్ హైట్స్‌లోని ఫుట్‌బాల్ మైదానంపై శనివారం జరిగిన రాకెట్ దాడిలో చిన్నారులు, టీనేజర్లు సహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై ఇజ్రాయెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ల పనేనని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌లోని మిలటరీ ప్రాంతాలే లక్ష్యంగా తాము రాకెట్లను ప్రయోగించిన మాట వాస్తవమేనని హెజ్బొల్లా పేర్కొంది. అయితే, ఫుట్‌బాల్ మైదానంపై జరిగిన దాడికి బాధ్యత తమది కాదని స్పష్టం చేసింది.

ఉక్రెయిన్‌పై రష్యా దాడుల్లో ... ఐదుగురు మృతి

కీవ్: ఉక్రెయిన్ తూర్పు ప్రాంత డొనెట్స్క్‌పై శని, ఆదివారాల్లో రష్యా జరిపిన క్షిపణి దాడుల్లో ఐదుగురు పౌరులు చనిపోగా మరో 15 మందికి పైగా గాయపడ్డారు. తూర్పు, దక్షిణ ప్రాంతాలపై రష్యా జరిపి దాడుల్లో మరికొందరు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. డొనెట్స్క్‌లోని నికోపోల్ నగరంపై రష్యా బలగాలు జరిపిన దాడుల్లో ఒక బాలిక సహా కనీసం 8 మంది మృతి చెందారు. ఖెర్సన్ ప్రావిన్స్‌లోని ఓ గ్రామంపై జరిగిన దాడిలో ముగ్గురు చిన్నారులు సహా మరో 8 మంది గాయపడ్డారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

సోమవారం : 29 : జూలై : 2024



జోగ్.. జన హోరు

శివమొగ్గ జిల్లాలోని ప్రసిద్ధ జోగ్ జలపాతం ఉరకలెత్తుతోంది. ఆదివారం తరలివచ్చిన పర్యాటకులతో సందడి

న్యూస్‌రీల్

కార్గిల్ విజయ ర్యాలీ



బనశంకరి: బెంగళూరు మానెక్ షా పరేడ్ మైదానంలో అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం, పలు ప్రైవేటు సంఘాల ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవాలను నిర్వహించారు. దేశానికి రైతులు, సైనికులు రెండు కళ్లలాంటివారని, దేశ ప్రజలు రక్షణ కోసం ప్రాణాలకు తెగించి శ్రమిస్తారని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెయ్యి బైక్‌లు, జీపులతో గోవిందరాజనగర నియోజకవర్గం బీజీఎస్ క్రీడామైదానం వరకు జాతా నిర్వహించారు. ఎమ్మెల్యేలు కృష్ణప్ప, ప్రియాకృష్ణ పాల్గొన్నారు.


వృత్తికి నైపుణ్యాన్ని చేర్చాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

గౌరిబిదనూరు: కుమ్మరులు ఆధునికతకు తగినట్లు వృత్తి కౌశల్యాన్ని పెంచుకోవాలి, ఉత్పత్తులను కళాత్మకంగా తయారు చేసే నిపుణతను అలవరచుకోవాలని మాజీ మంత్రి ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయికృష్ణ హాలులో తాలూకా కుమ్మారుల క్షేమాభివృద్ధి సంఘం సమావేశం జరిగింది. చదువుల్లో ప్రతిభ చూపిన బాలలను సన్మానించారు. శివశంకరరెడ్డి ప్రసంగిస్తూ సుమారు 5 వేల సంవత్సరాల క్రితమే కుమ్మరులు కుండలు తయారు చేసినట్లు హరప్పా, మొహెంజోదారో తవ్వకాలలో బయట పడిందని, ఇది అంత ప్రాచీన కళ అని చెప్పారు. ఈ రంగంలో యువతకు శిక్షణ ఇవ్వడానికి తాలూకాలో శిక్షణా కేంద్రం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభార ప్రముఖులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ పూజలు



ప్రత్యేక అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: భక్తుల కొంగు బంగారమైన నగరంలోని బనశంకరీ దేవి ఆలయంలో ఆషాఢమాస పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువ జామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ బనశంకరీదేవి మూల విరాట్‌కు అర్చన, అభిషేకం నిర్వహించి అమ్మవారికి వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడి బాలిక మృతి

బనశంకరి: సెప్టిక్ ట్యాంక్‌లోకి పడి బాలిక మరణించిన ఘటన ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డతోగూరు సెలబ్రిటి ప్యారడైస్ లేఔట్‌లో శనివారం సాయంత్రం హలెనా లిచ్చి (10) అనే బాలిక ఆడుకుంటూ అక్కడి సెప్టిక్ ట్యాంకులోకి పడిపోయింది. స్థానికులు గమనించి బాలికను బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా కొంత సేపటికి మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు డార్జిలింగ్ కు చెందినవారు కాగా నగరానికి వచ్చి ఈ లేఔట్‌లో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ పనులకు వెళ్లగా బాలిక ఒక్కతే ఆడుకుంటూ ప్రమాదానికి గురైంది. ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్తికాలం సిద్దునే సీఎం: మంత్రి

మండ్య: మిగిలిన నాలుగేళ్లు సిద్దరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, సీఎం పదవిలో మార్పు, దీనిపై చర్చ ఉండదని ప్రజా పనుల శాఖ మంత్రి సతీష్ జార్కిహొళి అన్నారు. ఆయన ఆదివారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి కుంభకోణం ఎవరెవరు ఉన్నారో చూద్దాం.. ముందు విచారణ కానివ్వండి అన్నారు. ముఖ్యమంత్రిని మారుస్తామని అన్నది ఎవరు? దళితులకు సీఎం పదవి గానీ, సీఎం పదవి మార్పు గానీ లేవని అన్నారు. పూర్తికాలం సిద్దరామయ్య సీఎంగా ఉంటారని అన్నారు. వాల్మీకి మండలి, ముడా స్థలాల గురించి నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అందుకే ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు.

కాలేయం ప్రధానం



బనశంకరి: ప్రపంచ కామెర్ల దినోత్సవం సందర్భంగా హెపటైటిస్ జబ్బుల గురించి జాగృతి నడక నిర్వహించారు. పలు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటైన నడకను ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావ్ ప్రారంభించారు. కాలేయానికి వచ్చే రోగాలు, లక్షణాలు, నియంత్రణ గురించి వైద్యసిబ్బంది వివరించారు.

మాంసంపై మీమాంస





రాజస్థాన్ నుంచి వచ్చిన మాంసం డబ్బాలు

- కుక్క మాంసమని గగ్గోలు
- బెంగళూరులో కొత్త రగడ
- రాజస్థాన్ నుంచి వచ్చిన బాక్సులకు టెస్టులు

శివాజీనగర: సిలికాన్ సిటీలో మరోసారి కుక్క మాంసమంటూ రగడ చెలరేగింది. కొందరు వ్యాపారులు రాజస్థాన్ నుంచి శునక మాంసాన్ని తెప్పించి మేక మాంసమని అమ్ముతున్నారంటూ కొందరు ఇటీవల గొడవ చేయడంతో కలకలం మొదలైంది. ఓ వ్యాపారి పెద్ద మొత్తంలో రాజస్థాన్ నుంచి మాంసాన్ని తెప్పించి బెంగళూరు హోటళ్లకు సరఫరా చేస్తున్నాడని, అది కుక్క మాంసమని ఆ సంఘాలు ఆరోపించాయి. అబ్దుల్ రజాక్ అనే మాంసం వ్యాపారి రైళ్లలో తెప్పించిన మాంసం డబ్బాలను కొన్ని సంఘాల కార్యకర్తలు మూడురోజుల కిందట అడ్డుకున్నారు.

హోటళ్లకు నోటీసులు

ఈ నేపథ్యంలో నాసిరకం మాంసం ఉపయోగిస్తున్నారని బెంగళూరులో ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లకు ఆహార భద్రతా శాఖ నోటీసులు జారీచేసింది. ఆ వ్యాపారి నుంచి మాంసం కొనుగోలు చేస్తున్న 9 మంది రెస్టారెంట్, హోటల్ యజమానులు విచారణకు రావాలని ఆహార భద్రతా శాఖ నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఇప్పటికే ఇద్దరు యజమానులను విచారించారు, మిగతావారు సోమవారం హాజరు కానున్నారు. మాంసం వ్యాపారిని కూడా విచారణ జరుపుతున్నారు. కొందరు అధికారులు మాట్లాడుతూ నగరంలో మేక మాంసానికి చాలా కొరత ఉందని, అందుకే రాజస్థాన్ నుంచి తెప్పిస్తుంటారని, కుక్క మాంసానికి ఆస్కారం లేదని తెలిపారు. గతంలో కొన్నేళ్ల కిందట బెంగళూరు పరిసరాల్లోని హోటళ్లలో కుక్క మాంసం ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి.

అది మేక మాంసం: హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరుకు రాజస్థాన్ నుంచి రైల్లో సరఫరా అయినది కుక్క మాంసం కాదు, అది మేక మాంసమని హోం మంత్రి జీ.పరమేశ్వర్ చెప్పారు. ఆదివారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ఆరోగ్యశాఖ సిబ్బంది మాంసం నమూనాలను ల్యాబ్‌కు పంపి పరీక్షించారు, అది మేక మాంసం అని తెలిసింది. కానీ కుక్క మాంసం రవాణా అని కొందరు దురుద్దేశంతో ఫిర్యాదు చేశారని చెప్పారు. వ్యాపారులు రాజస్థాన్ నుండి వారం, రెండు వారాలకు ఒకసారి రైల్లో మాంసం తెప్పించి విక్రయిస్తారు. ఇందులో శునక మాంసం ఏదీ లేదు. ల్యాబ్ రిపోర్టులు అవే చెప్పాయి అని పేర్కొన్నారు.

పోలీసు ఇంట్లో దొంగతనం



ఇంటి ముందు దీనంగా కుటుంబం

మైసూరు: పోలీసు ఇంట్లో దొంగ సినిమా రీతిలో దోచుకున్న ఘటన మైసూరులోని జేపీ నగర రెండో స్టేజీలో జరిగింది. ఓ పోలీసు డ్యూటీకి, ఆయన కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని బయటకు వెళ్లారు. ఇదే అదనుగా ఓ దొంగ వచ్చి నిమ్మకాయతో పూజలు చేసి తాళాన్ని పగులగొట్టి లోపలికి వెళ్లాడు. కొంతసేపటికి యజమాని ఇంటికి వచ్చాడు. ఆయనను చూడగానే దొంగ కత్తితో దాడికి యత్నించి పరారయ్యాడు. ఇనుప రాడ్, ఎలక్ట్రానిక్ వస్తువులు, రెండు బ్యాగులతో సహా తన లగేజీని వదిలిపెట్టి పారిపోయాడు. ఇంటి యజమాని ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో 135 గ్రాములకు పైగా బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తేలింది. మొత్తం రూ.7 లక్షల విలువ చేసే సొత్తు కనిపించలేదు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. పెద్దమొత్తంలో నగలు పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

ఘటప్రభ ముంచేసింది

- బెళగావి జిల్లాల్లో గోకాక్ జలమయం
- వందలాది మంది సురక్షిత ప్రాంతాలకు

యశవంతపుర: ఎటు చూసినా నీళ్లే. ఇళ్లలోకి నీరు, అంగళ్లలోకి నీళ్లు. లోతట్టు ప్రాంతాల్లో నడుము లోతు నదీ జలాలు. ఇదీ బెళగావి జిల్లా గోకాక్ పట్టణం, పరిసర తాలూకాల దుస్థితి. ఎగువన మహారాష్ట్ర భారీ వర్షాలు కురుస్తుండడంతో ఘటప్రభ నది ఉగ్రరూపం దాల్చింది. మితిమీరిన ప్రవాహం కారణంగా నదీ జలాలు గోకాక్, చుట్టుపక్కల గ్రామాల్లోకి ప్రవేశించాయి. శనివారం సాయంత్రం నుంచి ముంపు అధికమైంది. ఆదివారం సెలవు రోజు ప్రజలకు ముంపు సంకటం మరింత పెరిగింది. ఎగువన హిడకల్ డ్యాం నుంచి 40 వేల క్యూసెక్కులను నదిలోకి వదలడంతో ఆ నీళ్లు ఊళ్ల మీదకు వచ్చాయి. గోకాక్‌లోనే 400 ఇళ్లు, భవనాలలోకి నీరు చేరింది. వందలాది మంది తట్టా బుట్టా సర్దుకుని సురక్షిత ప్రదేశాలకు వెళ్లారు. సంకేశ్వర పట్టణంలో అనేక ఇళ్లలోకి హిరణ్యకేశి నది జలాలు వచ్చాయి. బాగల్‌కోట వద్ద ఓ రైతు కృష్ణా నదిలో కొట్టుకుపోయాడు. వేలాది ఎకరాలలో పంటలు నీటమునిగాయి. ఇక విజయనగర జిల్లాలో తుంగభద్ర ప్రవాహం యథాతథంగా కొనసాగుతోంది. రాయల రాజధాని హంపీలో చారిత్రక కట్టడాలు పాక్షికంగా మునిగిపోయాయి.

హైవేలో గాలింపు నిలిపివేత

ఉత్తర కన్నడ జిల్లా శిరూరు వద్ద జాతీయ రహదారి - 66లో కొండ విరిగిపడి 13 రోజులవుతోంది. ఎవరైనా మట్టిలో చిక్కుకొని ఉండవచ్చని ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టారు. అయితే ఎవరి ఆచూకీ లభించని కారణంగా గాలింపును నిలిపివేశారు. జూలై 16న హైవేలో ఆకస్మికంగా కొండ విరిగి పడి 12 మంది అదృశ్యమయ్యారు. 8 మంది మృతదేహాలు లభించాయి. మరో నలుగురి జాడ ఇంతవరకు లభించలేదు. హైవే పక్కనే ఉన్న గంగావళి నదిలో 13 రోజులు గాలించినా ఫలితం లేదు. కేరళ వాసి అర్జున్, మరో ముగ్గురు స్థానికులు గల్లంతయ్యారు. తమ వారి కోసం కుటుంబీకులు నిత్యం ఎదురు చూశారు.



ఆదివారం ఉదయం గోకాక్ పట్టణంలో ముంపు ప్రాంతాల నుంచి వెళ్లిపోతున్న జనం



గోకాక్ శివార్లలో విచారంగా ముంపు బాధితులు



గోకాక్‌లో నది చుట్టుముట్టిన ఓ కాలనీ



హంపీలో తుంగభద్ర నదిలో పాక్షికంగా మునిగిన శిల్ప సంపద

సిద్దు సర్కారును బర్తరఫ్ చేయాలి

- ముడా గొడవలో కేంద్రమంత్రి కుమారస్వామి డిమాండ్

మైసూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో ప్లాట్ల కేటాయింపు కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని కేంద్రం బర్తరఫ్ చేయాలని కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి డిమాండ్ చేశారు. మైసూరులోని జర్నలిస్టు భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముడా కుంభకోణం నుంచి బయటపడేందుకు సీఎం సిద్ధరామయ్య దేశాయ్ కమిషన్‌ని ఏర్పాటు చేశారన్నారు. దేశాయ్ కమిషన్ రిపోర్టు అడ్డుపెట్టుకుని తప్పించుకోలేరన్నారు. సీఎం సిద్ధరామయ్య భార్య 50 కాదు 100 ప్లాట్లు తీసుకున్నా తమకు అభ్యంతరం లేదు. అయితే చట్టబద్ధంగా పొందాలని కోరుతున్నామన్నారు. తాను ముడా నుంచి ఎలాంటి ప్లాటు పొందలేదని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న కుమారస్వామి

సన్మానం

జర్నలిస్టులకు హైవేలలో టోల్ గేట్ ఫీజును మినహాయింపు సౌకర్యం కల్పించాలని మైసూరు జిల్లా జర్నలిస్టుల సంఘం కుమారస్వామికి వినతిపత్రం సమర్పించింది. సంఘం అధ్యక్షుడు కె.దీపక్, ధర్మపుర నారాయణ్‌లు కేంద్రమంత్రిని సన్మానించారు. ఎమ్మెల్యేలు హరీష్‌గౌడ్, సురేష్‌బాబు, హనూర్ మంజునాథ్, కేఆర్‌పేట మంజునాథ్, మంజేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం

- కేంద్ర బడ్జెట్‌లో అన్ని విధాలా సాయం
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

శివాజీనగర: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయమైందనే రాష్ట్ర ప్రభుత్వ ఆరోపణలో వాస్తవం లేదని, ఈ బడ్జెట్‌లో రూ.15,300 కోట్ల సహాయం చేశాం. రూ.45,486 కోట్ల పన్నుల వాటా పంపిణీ చేయడమైనదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆదివారం బెంగళూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో కర్ణాటకకు అన్యాయం చేశారని అప ప్రచారం సాగుతోందన్నారు. ఆదాయం అధికంగా ఉన్న కర్ణాటక నేడు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. రుణాలు కూడా పెరిగాయి అని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో ఆర్థిక సమస్యలు నెలకొన్నాయి. పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి కావటం లేదు. దీనిని వదిలేసి కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని రాష్ట్ర సర్కారుపై మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం జాతీయ సరాసరి కంటే పెరగడానికి రాష్ట్రంలో ధరల పెరుగుదలే కారణమని ఆరోపించారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

రైల్వే ప్రాజెక్టులకు అధిక నిధులు

రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్ట్‌లకు ఈ బడ్జెట్‌లో రూ.7,559 కోట్లను కేటాయించామన్నారు. గత యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.835 కోట్లు మాత్రమేనని నిర్మల తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం కర్ణాటకకు రూ. 1 లక్ష కోట్లను వ్యయం చేస్తోందని, 4600 కి.మీ.ల రోడ్లను ఇప్పటికే నిర్మించినట్లు చెప్పారు. సాయం చేస్తుంటే అన్యాయమని గగ్గోలు పెట్టడం సరికాదని అన్నారు.

కేంద్రమంత్రి వస్తే గెస్ట్‌హౌస్ తెరవలేదు

మైసూరు: కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆదివారం ఉదయం దక్షిణ కాశీగా పేరుపొందిన నంజనగూడు దేవస్థానాన్ని దర్శించుకున్నారు. తరువాత విశ్రాంతి కోసం ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్లగా తాళం వేసి ఉండడంతో 10 నిమిషాలు ఎదురు చూసినా తలుపు తీసేందుకు సిబ్బంది ఎవరూ రాలేదు. తర్వాత ఆయన అక్కడి నుంచి వెనక్కు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై జేడీఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను జీవితంలో మళ్లీ సీఎం కాలేనని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సవాల్ చేయడంపై కుమారస్వామి స్పందిస్తూ సీఎంను ప్రజలే నిర్ణయిస్తారన్నారు. దురహంకారంగా మాట్లాడేవారి పరిస్థితి ఏమిటో మీరే చూడండి అని ఘాటుగా బదులిచ్చారు.

బాధ్యులపై చర్యలు: కలెక్టర్

ఈ వ్యవహారంపై మైసూరు జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి స్పందించారు. విచారణ జరుపుతున్నామని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని, అధికారులను రానివ్వడం కుమార ఆరోపించడం తెలిసిందే.



బోనాలతో తరలి వస్తున్న మహిళలు



శ్రీ ఓంశక్తి అమ్మవారి దేవాలయంలో బోనాలతో మహిళలు

బోనాల అట్టహాసం

- బెంగళూరులో తెలంగాణవాసుల సందడి

బొమ్మనహళ్లి: సిలికాన్ సిటీలో బోనాల జాతర అట్టహాసంగా జరిగింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ మాసం బోనాల జాతరను ఆదివారం బెంగళూరులోని కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణ నగరలో ఉన్న ఓం శక్తి అమ్మవారి దేవాలయంలో వేడుకలు జరిగాయి. మహిళలు ఇళ్ల నుంచి సుందరంగా అలంకరించిన బోనాలను ఎత్తుకుని ఆలయానికి వచ్చారు. అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కల్చరల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేవతి మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగాల కోసం బెంగళూరుకు వేలాది మంది వచ్చి స్థిరపడ్డారని, బోనాలకు సొంత ఊర్లకు వెళ్ళలేని వారు నిరాశ పడకుండా బెంగళూరులో ఈ జాతరను నిర్వహించినట్లు తెలిపారు. అందరం కలిసి నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని మహిళలు తెలిపారు.

క్లుప్తంగా

నియామకపత్రాల అందజేత


నియామకపత్రాన్ని అందిస్తున్న అరవింద లింబావళి

కృష్ణరాజపుర: మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చెన్నసంద్రలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన బృహత్ ఉద్యోగ మేళా విజయవంతమైంది. పాల్గొన్న మాజీ మంత్రి అరవింద లింబావళి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ చేసి వారిని అభినందించారు. 70 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 2వేల మందికి పైగా 7వ తరగతి అనుత్తీర్ణుల నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివిన నిరుద్యోగులు పాల్గొని లబ్ధి పొందారు. 500 మంది అభ్యర్థులకు అక్కడికక్కడే ఉద్యోగ నియామక పత్రాన్ని అందించామని, మిగతా అభ్యర్థులకు రెండు, మూడో రౌండ్ ఇంటర్వ్యూల అనంతరం నియామక పత్రాన్ని పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 5వ జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేసిన మహదేవపుర టాస్క్‌ఫోర్స్ వలంటీర్లు, వివిధ కంపెనీల హెచ్ఆర్ ముఖ్యస్థులను సత్కరించారు.

ముడా కంటే వాల్మీకి మండలి కుంభకోణం పెద్దది

యశవంతపుర: మైసూరు ముడా కుంభకోణం కంటే వాల్మీకి మండలి అవినీతి పెద్దదని మాజీ మంత్రి బెళగావి ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి అన్నారు. ఆయన ఆదివారం బెళగావి జిల్లా గోకాక్‌లో విలేకర్లతో మాట్లాడారు. తనకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై అపారమైన గౌరవం ఉందన్నారు. సిద్ధరామయ్య సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం స్థానం నుంచి సిద్ధరామయ్యను దించాలని వస్తున్న డిమాండ్లపై స్పందిన అయన.. అది కాంగ్రెస్ పార్టీ అంతరంగిక విషయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి సిద్ధరామయ్య కారణమన్నారు. ఆయన్ను దించితే కాంగ్రెస్ పాతాళానికి వెళ్తుందన్నారు.

నేడు కేఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి వాయనం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం


వాయనం సమర్పించేందుకు సిద్ధం చేసిన పూజ సామగ్రి

మండ్య: మండ్య జిల్లావాసుల జీవనాడి కృష్ణ రాజసాగర్, కబిని రిజర్వాయర్లు నిండుకుండలా మారాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం కేఆర్ఎస్‌కు వాయనం సమర్పించనున్నారు. ఉదయం 10.30 గంటలకు రానున్న ముఖ్యమంత్రి... డ్యాం దిగువన ఉన్న కావేరీ మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తారు. 11 గంటలకు వాయనం సమర్పిస్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పర్యటనకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీరంగపట్నం శాశ్వత రిలీజియస్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ భానుప్రకాష్ శర్మ నేతత్వంలోని వైదిక బృందం ఇప్పటికే పూజా సామగ్రిని సిద్ధం చేసింది. కన్నాంబడి ఆనకట్టకు వాయనం సమర్పించే సంప్రదాయం దేవరాజు అరసు కాలం నుంచి ప్రారంభమైంది. 1979లో తొలి ముఖ్యమంత్రిగా దేవరాజ అరసు కృష్ణరాజసాగర్ రిజర్వాయర్ వద్ద కావేరీ మాతకు వాయనం సమర్పించారు.

మంగళూరులో చోరీల బెడద

యశవంతపుర: మంగళూరులో చోరీల బెడద తగ్గడం లేదు. దీంతో ప్రజల ఆస్తిపాస్తులకు భద్రత లేకుండా పోయింది. నగరంలో ఎక్కువగా చోరీలు చేసేది చెడ్డీగ్యాంగ్. ఈ ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయినా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. మంగళూరు పట్టణంలోని బిజ్జై న్యూరోడ్డులోని ఇంటిలోకి ఈనెల 14న చోరీ జరిగింది. అనంతరం ఇదేనెల 20న పెదవినగండి సమీపంలోని ఇంటిలో చోరీ జరిగింది. అదే రోజు రాత్రి ప్లెగురిలోని ఆలయంల చోరీ జరిగింది.ఈ చోరీలకు ఏ ముఠా పాల్పడుతోందనేది అంతుచిక్కక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

జిమ్నాస్టిక్ సెంటర్ ప్రారంభం


జిమ్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి పరమేశ్వర్

తుమకూరు: తుమకూరు స్మార్ట్ సిటీ పథకం కింద రూ.3 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన జిమ్నాస్టిక్ కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి, హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ ఆదివారం ప్రారంభించారు. తుమకూరు జిల్లా రాష్ట్రంలో ఖేలో ఇండియా స్మాల్ సెంటర్‌గా ఎంపికైనందున, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన జిమ్నాస్టిక్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు.

తగ్గని వరద ఉధృతి

- ఆల్మట్టి నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- తుంగభద్ర నుంచి నదికి 1.90 లక్షల క్యూసెక్కుల నీరు


నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీలు

రాయచూరు రూరల్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆల్మట్టి డ్యాం నుంచి కృష్ణా నదికి 3 లక్షల క్యూసెక్కుల నీటిని నారాయణపుర డ్యాంకు వదిలారు. ఆదివారం యాదగిరి జిల్లా హుణిసిగి తాలూకాలోని నారాయణ పుర డ్యాం నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు నదికి వదిలారు. బెళగావి, బాగలకోటె, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాలుగా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలో అధికంగా వానలు పడుతుండడంతో నదికి నీటిని అధిక ప్రమాణంలో విడుదల చేశారు. ,రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హువిన హడగి వంతెనపై నీరు ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడ రోడ్డు వంతెనలు నీట మునగడంతో రాయచూరు, కలబుర్గి, విజయపుర జిల్లాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. శనివారం జిల్లాధికారి నితీష్, ఎస్పీ పుట్టమాదయ్య, ఏసీ మెహబూబీ హువిన హడగి వంతెనను పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో పరిశీలన

కోళూరు క్రాస్ వద్ద రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, యాదగిరి జిల్లా ఇంచార్జి మంత్రి శరణ బసప్ప దర్శనాపూర్ సందర్శించారు. ఇలా ఉండగా గత వారం రోజుల నుంచి శివమొగ్గ, చిక్కమగళూరు తదితర డ్యాం పైభాగంలోని జిల్లాల్లో వానలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం పూర్తిగా నిండినందున నదికి 1.90 లక్షల క్యూసెక్కుల నీరు వదలడంతో వరద ముంచెత్తింది. కొప్పళ, రాయచూరు జిల్లాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయచూరు జిల్లా సింధనూరు, మాన్వి, రాయచూరు తాలూకాల్లో నదీ తీరంలోని మాన్వి తాలుకా దాసర కట్ట, రాయచూరు తాలూకా ఎలెబిచ్చాలి రాయల ఏకశిలా బృందావనం, జపం కట్ట, ఉగ్ర నరసి ంహస్వామి, బిచ్చాలమ్మ ఆలయం, నాగదేవత కట్ట, శివ లింగం జలావృతం అయ్యాయి. నదీ తీర ప్రాంతాల ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉత్తుంగభద్ర

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్రకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో శనివారం సాయంత్రం డ్యాం నుంచి మొత్తం 33 గేట్లను పైకెత్తి 1,40,000 క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదిలారు. ప్రస్తుతం డ్యాంలో నీటినిల్వ 98.375 టీఎంసీలకు వరకు చేరుకొంది. డ్యాంకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. డ్యాం ఎగువన ఉన్న శివమొగ్గ, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబె, చిక్కమగళూరు తదితర పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు వరద నీరు యథావిధంగా తరలి వస్తోంది. డ్యాం దిగువ ప్రాంతాల్లో ఉన్న హంపీలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటికే హంపీలోని అనేక మంటపాలు, స్మారకాలలోకి నీరు చేరింది. ఆనెగుందిలో విజయనగర సామ్రాజ్య సార్వభౌముడు శ్రీకృష్ణ దేవరాయల సమాధి పూర్తిగా మునిగిపోయింది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1631.08 అడుగులకు చేరుకొంది. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలోనైనా డ్యాం క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరికలు అమలు చేశారు.

కుమారస్వామికి ముక్కులో నుంచి రక్తస్రావం


కుమారస్వామికి ముక్కులో నుంచి రక్తం కారుతున్న దృశ్యం

సాక్షి బెంగళూరు: ఆకస్మాత్తుగా ముక్కులో రక్తస్రావం కావడంతో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆస్పత్రిలో చేరారు. ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో జేడీఎస్, బీజేపీ పార్టీల సమన్వయ సమితి సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ సీఎం బీఎస్ యడియూరప్పతో కలసి మీడియాతో మాట్లాడుతుండగా కుమారస్వామి ముక్కులో నుంచి హఠాత్తుగా రక్తం కారసాగింది. దీంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఆయనను కొడుకు నిఖిల్ తదితరులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామిని వైద్యులు కొన్ని గంటల పాటు నిఘాలో ఉంచి, ప్రమాదం ఏమీ లేదని డిశ్చార్జి చేశారు.

ఒత్తిడి ఎక్కువై ఇలా అయ్యింది: కుమారస్వామి

డిశ్చార్జి అయి ఇంటికి వెళుతున్న సమయంలో మీడియాతో కుమారస్వామి మాట్లాడారు. తన ఆరోగ్యంపై ఎవరూ ఆందోళన పడొద్దని అభిమానులు, జేడీఎస్ పార్టీ కార్యకర్తలకు తెలిపారు. మీ ఆశీస్సులు, అభిమానాలు, దేవుడి దయ, తల్లిదండ్రుల ఆశీర్వాదాలు ఉన్నంతవరకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. మూడు సార్లు తనకు హృదయ కవాటాలు మార్పిడి చేశారని, నిత్యం రక్తం పల్చగా ఉండేందుకు ఔషధాలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడి ఎక్కువయినప్పుడు , విశ్రాంతి లేనప్పుడు ఇలా ముక్కు నుంచి రక్తం రావడం చాలా సహజమని చెప్పారు. పని ఒత్తిడిని తగ్గించుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు.

క్రీడలతో ఒత్తిడి దూరం


జ్యోతివెలిగించి ఫుట్‌బాల్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి : మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు ఉపకరిస్తాయని మాజీ మండల ప్రధాన్ ముళియ తిమ్మప్పయ్య భట్ అన్నారు. దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా గుత్తిగారు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సేవా సహకార సంఘం కార్యాలయ ఆవరణలో మాస్టర్ సాత్విక్ ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ క్లబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులతో పాటు యువత ఆటపాటలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించేందుకు మాస్టర్ సాత్విక్ ఇలాంటి స్పోర్ట్స్‌క్లబ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా యూనీఫారం అందజేశారు.


కొత్త బస్టాండ్ నుంచి రాకపోకలు షురూ


బస్సు రాకపోకలను ప్రారంభిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్, అధికారులు

తుమకూరు: నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద 39817 చదరపు మీటర్లలో రూ.82.89 కోట్లతో నిర్మించిన దేవరాజ అరసు కొత్త బస్టాండ్ నుంచి బస్సుల రాకపోకలను హోం, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డా. జి. పరమేశ్వర ఆదివార ప్రారంభించారు. ముందుగా తుమకూరు–బెంగళూరు రూట్‌లో 6 అశ్వమేధ నాన్‌స్టాప్ బస్సులను పచ్చజెండా ఊపి ప్రారంభించి కొద్ది దూరం ప్రయాణించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మార్చి 29న బస్టాండ్‌ను ప్రారంభించారని, పెండింగ్‌లో ఉన్న చిన్న మరమ్మతు పనులను పూర్తి చేసి ఈ రోజు నుంచి బస్సులు నడపడం ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. నాలుగు లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లను అమర్చారన్నారు. బస్టాండ్ బేస్‌మెంట్‌లో 1500 బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారన్నారు. సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజన్న, కేఎస్ ఆర్టీసీ చైర్మన్ ఎస్.ఆర్.శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ శుభ్ కళ్యాణ్, జెడ్పీ సీఈఓ జి.ప్రభు, జిల్లా ఎస్పీ కె.వి. అశోక్, కార్పొరేషన్ కమిషనర్ బి.వి.అశ్విజ, అదనపు జిల్లాధికారి శివానంద బి. కరాళె, ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు

యశవంతపుర: గురు దత్తాత్రేయ బాబా బుడన్ గిరికి వెళ్లే మార్గంలోని కవికల్ గండి సమీపంలో రోడ్డు కుంగిపోయింది. ఘాట్ మార్గంలో ఈఘటన జరగడంతో కరెంటు స్తంభాలు పక్కకు వరిగిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో పర్యాటకులపై నిషేధం విధించారు.


కనకపుర వద్ద ఉధృతంగా కావేరి నది

కావేరమ్మ జోరు

దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లా సరిహద్దు ప్రాంతంలో కనకపుర తాలూకాలోని సంగమం వద్ద కావేరి నది పొంగి ప్రవహిస్తోంది. కేఆర్ఎస్, కబిని డ్యాంల నుంచి 1.65 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. మేకెదాటు వద్ద కావేరి నది ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. నది సమీపంలోకి ప్రజలు వెళ్లరాదని జిల్లా యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది. మేకెదాటు, సంగమం వద్ద హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కనకపుర తాలూకాలో వరద ముంపు భయం లేదు. అయితే 2లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే పరిసర గ్రామాలకు ముంపు తప్పదు.

ఉపాధ్యాయ గెళెయర బళగ సేవలు ప్రశంసనీయం


నివృత్త ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

కోలారు: విద్యార్థులకు సంస్కారం నేర్పాలని బెంగళూరు ఉత్తర డీసీపీ దేవరాజ్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల గెళెయర బళగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల పిల్లలకు ప్రతిభా పురస్కారం, గురుశ్రేష్ఠ పురస్కారాలు, నివృత్త ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలు దురలవాట్లకు బానిస కాకుండా చూసుకోవాలన్నారు. గెళెయర బళగ సంస్థ సేవా కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందన్నారు. సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు బెంగళూరు వీవీ సెనెట్ సభ్యుడు సహ్రాద్రి ఉదయకుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు మంజునాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

కోలారు: 2023–24 సంవత్సరంలో పది, ఇంటర్, డిగ్రీ, మెడికల్, ఇంజినీరింగ్, కళా, సాహిత్య రంగాల్లో విశేష సాధన చేసినవారికి కోలారు బ్రాహ్మణ సంఘం ప్రతిభాపురస్కారాలు అందజేసింది. నగరంలోని గాయత్రి ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి సైన్సస్, సుల్తానేట్ ఆఫ్ ఒమాన్ యనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అప్లైడ్ సంస్థ ప్రాధ్యాపకుడు డాక్టర్ రమేష్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మనం ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా మనం నడిచిన దారిని మరువరాదన్నారు. అహం వదలి ముందుకు సాగాలన్నారు. విశేష ఆహ్వానితులుగా వచ్చిన సెల్కో ఫౌండేషన్ మరియు నంజమ్మ నారాయణ శాస్త్రి ట్రస్టు డైరెక్టర్ ప్రదీప్ మూర్తి మాట్లాడుతూ సమాజం మనకేమి ఇచ్చింది అనేదానికంటే మనం సమాజానికి ఏమి ఇచ్చామని ప్రశ్నించుకోవాలన్నారు. తమ ట్రస్టు నుంచి ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు ఏటా రూ.50 వేలు అందిస్తామని తెలిపారు. భౌతిక శాస్త్ర ప్రాధ్యాపకుడు హెచ్ ఆర్ మంజునాథ్, వంశోదయ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సాగర్, కన్నడ ప్రాధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, విజ్ఞాని హెచ్‌సి మంజునాథ్‌లను ఘనంగా సన్మానించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉదయ కుమార్, పదాధికారులు చంద్రప్రకాష్, రామకృష్ణభట్, రామకృష్ణ, రవిశంకర అయ్యర్, హాబి రమేష్, డాక్టర్ ఎస్ వి కృష్ణమూర్తి, ఎంపీ ఆనంద్, శ్రీనిధి అచ్యుత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మలెనాడులో వర్షాలు తగ్గుముఖం

శివమొగ్గ: గత కొద్దిరోజులుగా మలెనాడులో కురుస్తున్న భారీవర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో పొంగిపొర్లుతున్న నదులు, చెరువులు నీటి ప్రవాహం కొంచెం తగ్గుముఖం పట్టింది. శివమొగ్గలో వరద ముప్పును సృష్టించిన తుంగా నది ప్రవాహం కూడా తగ్గిపోయింది. ఆదివారం ఉదయానికి గత 24 గంటల్లో పశ్చిమ కనుమల్లోని మాణిలో 33, యడూరులో 35, హులికల్‌లో 39, మాస్తికట్టెలో 36 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. లింగనమక్కి డ్యాంకు ఇన్ ఫ్లో 37,733 క్యూసెక్కులకు తగ్గింది. 3,525 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో హొసపేటె సమీపంలోని తుంగభద్ర రిజర్వాయర్‌కు అంతే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇక భద్రా డ్యాంకు కూడా ఇన్ ఫ్లో 35,557 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం గరిష్ఠ స్థాయి 186 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 180.7 అడుగులకు చేరుకుంది. డ్యాం పూర్తిగా నిండడానికి కేవలం 6 అడుగులు మాత్రమే మిగిలి ఉంది. తుంగా జలాశయం నుంచి శనివారం 85 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో శివమొగ్గ నగరంలో గుండా వెళ్లే తుంగా నదీ తీరవాసులకు వరద ముప్పు ఏర్పడింది. చాలాచోట్ల నదీ తీరంలో కొన్ని నివాస ప్రాంతాల్లోకి నీరు ప్రవేశించింది. ఇంతలో ముంపు ముప్పు తొలగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్.నాగరాజు, లోకేశ్, సుకేశ్, రమేశ్. ఎన్ఆర్

బనశంకరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని బాందవ సంస్థ అధ్యక్షుడు, గ్యారంటీ పథకాల అమలు కమిటీ జయనగర నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్.నాగరాజు పిలుపునిచ్చారు. జయనగర మూడోబ్లాక్ రాణికిత్తూరు చెన్న క్రీడామైదానంలో జరుగుతున్న 16వ రాష్ట్ర స్థాయి అంతర్‌పాఠశాలల ఒలింపిక్స్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఆయన ట్రోఫీ అందజేసి మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. పోటీల్లో 4వేలమందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పాఠశాలల ఒలింపిక్ సంస్థ అధ్యక్షుడు, మాజీ పోలీస్ అధికారి లోకేశ్, రమేశ్ ఎన్ఆర్, సుకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నడజ్యోతి రథయాత్రకు ఘన స్వాగతం

చిక్కబళ్లాపురం: రాష్ట్రానికి కర్ణాటకగా నామకరణం చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన కన్నడ జ్యోతి రథయాత్ర ఆదివారం చిక్కబళ్లాపురంలోకి ప్రవేశించింది. రథయాత్రకు బీబీ రోడ్డులో తహసీల్దార్ అనీల్, తాలూకా సీఈఓ మంజునాథ్, కన్నడ అభిమానులు, కన్నడ సంఘాల నాయకులు, సాహిత్య అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోడిరంగప్ప మాట్లాడుతూ కన్నడ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

కేపీ పూర్ణచంద్ర తేజస్వీ జీవితం యువతకు ఆదర్శం

శివాజీనగర: సాహితీవేత్త కే.పీ.పూర్ణచంద్ర తేజస్వి జీవితంపై రూపొందించిన 'తేజస్వి అనే విస్మయ' సాక్ష్య చిత్రాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సీ.ఎన్.అశ్వత్థనారాయణ ఆదివారం లోకార్పణం చేశారు. బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రలో తేజస్వి పండుగను ఆవిష్కరించారు. సాక్ష్యా చిత్రం కర్టన్‌రైజర్ విడుదల చేసి మాట్లాడుతూ మాధ్యమ రంగానికి చెందిన అనేకమంది తేజస్విపై సాక్ష్యా చిత్రం రూపొందించటం శ్లాఘనీయమన్నారు. తేజస్వి జీవితం యువతరానికి చేరే దిశలో ఈ సాక్ష్య చిత్రం సహాయపడుతోందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కే.సీ.శివారెడ్డి, న్యాయమూర్తి ఏ.జే.సదాశివ, ప్రొఫెసర్ బి.ఎన్.శ్రీరామ్, డాక్టర్ కే.చిదానందగౌడ, నాడోజ పీ.కృష్ణ, ప్రొఫెసర్ ఎస్.జీ.సిద్ధరామయ్య, కన్నడ విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ డీ.వీ.పరశివమూర్తి, సరోజ ఎం.చంద్రశేఖర్, అనుమోతి, తారణి చిదానంద, తేజస్వి కుమార్తెలు సుశ్మిత, ఈశాన్య పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రేణుకా యల్లమ్మకు కరగ అలంకరణ


కరగ అలంకరణ

కోలారు: నగరంలోని జయనగరలో రేణుకా యల్లమ్మ దేవిని ఆదివారం పూల కరగతో అలంకరించారు. కరగ పూజారి బీవీ మంజునాథ్ పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఆందోళన విరమించిన కార్మికులు


కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీ ఎం మల్లేష్‌బాబు

కేజీఎఫ్: తమను పర్మినెంట్ చేయడంలో బెమెల్ ఫ్యాక్టరీ పాలక మండలి పక్షపాతం చూపుతోందని ఆరోపిస్తూ సత్యాగ్రహం చేపట్టిన దినకూలీలు ఎట్టకేలకు ఆందోళన విరమించారు. ఎంపీ ఎం మల్లేష్ బాబు, ఎమ్మెల్యే రూపా శశిధర్, బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి, ఆదివారం కార్మికులతో చర్చించారు. వచ్చేనెల 30లోపు బెంగళూరు కేంద్ర కార్యాలయంలో బెమెల్ సీఎండీ శాంతను రాయ్ అధ్యక్షతన స నిర్వహించి 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంపై చర్చించి తీర్మానం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ స్థానిక కార్మికులను పక్కన బెట్టి హిందీ మాట్లాడే వారిని పర్మినెంట్ చేయడం తగదన్నారు. దీనిని సరిచేయాలన్నారు. ఆందోళన విరమించిన అనంతరం కార్మికులను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స నిర్వహించారు.

భారతీయ సంస్కృతికి గురువే మూలం

కోలారు: తల్లి, తండ్రి, గురువు తత్వాలను కలిగిఉండడమే భారతీయ సంస్కృతికి పునాది అని శాస్త్ర చూడామని మల్లేపురం బి. వెంకటేష్ అన్నారు. నగరంలోని ఆదర్శ కళాశాలలో అఖిల భారత సాహిత్య పరిషత్, రోటరి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురువందన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పూర్వం ఆచార్యులు ఆశ్రమాలను స్థాపించి శిష్యులకు లౌకిక, ఆధ్యాత్మిక విద్యలను నేర్పించేవారన్నారు. విద్యార్థులు సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా రూపుదిద్దుకోవాలే కాని కేవలం మార్కుల కోసం విద్యాభ్యాసం చేయరాదన్నారు. శిక్షణాధికారి సీఆర్ అశోక్, అఖిల భారత సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు టీ సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ముగ్గురు దొంగలు అరెస్ట్

హుబ్లీ: నగర శివారు ప్రాంతంలో చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసిన గ్రామీణ పోలీసులు వారి నుంచి బైక్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. హానగల్ రాజీవ్ నగర్ వినయ్ కట్టిమని(24), కుందగోళ హొస హంచినాళ జగదీశ్ బండివాడ(21), హానగల్ వివేకానంద నగర గణేష్ ఒంబరిడి(21) అరెస్ట్ అయిన నిందితులు. ఇక్కడి కుసుగల్ రింగ్ రోడ్డులో బాబా సాహెబ్ జకాతి అనే వ్యక్తిపై దాడి చేసి రూ.5,500 నగదు, మొబైల్ లాక్కొని పరారయ్యారు. కేసును నమోదు చేసుకున్న హుబ్లీ గ్రామీణ పోలీసులు సీఐ మురుగేష్ చెన్నన్నవర నేతృత్వంలోని బృందం కార్యాచరణ జరిపి వీరిని అరెస్ట్ చేసింది. ఈ కేసు మిస్టరీ ఛేదనలో ప్రతిభ చూపిన పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ గోపాల బ్యాకోడ్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చాముండేశ్వరి జయంతి


కోలారమ్మ ఉత్సవ మూర్తికి విశేష అలంకరణ

కోలారు: చాముండేశ్వరి జయంతిని ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాలలో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శక్తి దేవతలు కోలారమ్మ, గల్‌పేట చాముండేశ్వరి, జయనగర సఫలమ్మ, కిలారి పేట సత్యమ్మ, తంబళ్లి చౌడేశ్వరి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. కోలారమ్మ దేవాలయంలో తెల్లవారుజామునుంచే విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకం, రుద్రాభిషేకం, సహస్రనామ, అష్టావధానం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

రైల్వే అండర్ పాస్ మూసివేస్తే సహించం


రైల్వే అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

కేజీఎఫ్: నగరంలోని కోరమాండల్ రైల్వే స్టేషన్ నుంచి ఉరిగాం రైల్వే స్టేషన్ మధ్య స్వామినాథపురం టైం బ్లాక్‌ను కలిపే రైల్వే అండర్ పాస్‌ను రైల్వే అధికారులు ఆదివారం మూసివేయడానికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. బ్రిటీష్ పాలకుల హయాంలో 135 సంవత్సరాల క్రితం బంగారు గనులను ప్రారంభించిన సమయంలో బంగారాన్ని ఇక్కడి నుంచి తరలించడానికి బీజీఎంఎల్ వ్యాప్తిలో చిన్న రైల్వే అండర్‌పాస్ నిర్మించారు. ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లడానికి రైల్వే అండర్ పాస్‌నే ఉపయోగిస్తున్నారు. ఈ అండర్ పాస్‌ను మూసి వేయడం వల్ల తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు. అండర్ పాస్ శిథిలమై ఉంటే దానికి మరమ్మత్తు చేయాలి కాని మూసివేయరాదన్నారు. ఈ అండర్ పాస్‌ను మూసి వేస్తే అటువైపుకు వె ళ్లడానికి దాదాపు కిలో మీటర్ చుట్టి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎట్టి పరిస్థితిలోను ఈ అండర్‌పాస్‌ను మూసివేయరాదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

శవమై తేలిన ఆటో డ్రైవర్



ఆటోడ్రైవర్ ప్రసాద్ మృతదేహం

మైసూరు: అప్పుల వారి వేధింపులతో విసిగి పోయి డెత్ నోట్ రాసి అదృశ్యమైన ఆటో డ్రైవర్ శవమై కనిపించాడు. ఈ ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీ కోటే తాలూకాలోని సరగూరు వద్ద కపిలా నదీ తీరంలోని సోమేశ్వ రాలయం సమీపంలో జరిగింది. వివరాలు.. హుణసూరు తాలూకా బిళికెరె పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టువాడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ (40)కు ఫైనాన్సర్ మధు వద్ద కిరణ్ అనే వ్యక్తి షూరిటీ ఇచ్చి డబ్బు అప్పుగా ఇప్పించాడు. అయితే ప్రసాద్ సకాలంలో డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దాంతో కిరణ్ తరచూ ప్రసాద్ ఇంటికి వచ్చి వేధించేవాడు. దీంతో తన చావుకు మధు, కిరణ్ కారణమని ప్రసాద్ డెత్ నోట్ రాసి దానిని ఆటోలో వది లేసి ఈనెల 20న అదృశ్యమయ్యాడు. తాజాగా ప్రసాద్ మృతదేహం సరగూరు సమీపంలోని కపిలా నది ఒడ్డున ఉన్న సోమేశ్వరాలయం వద్ద నీటిలో లభించింది. సరగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిందితుడు ప్రదోష్ అవ్వ మృతి

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో ఏ14 నిందితుడైన ప్రదోష్ అవ్వ ఆదివారం మృతిచెందింది. బెంగళూరు చామరాజపేటలో ఆమె నివాసం ఉంటోంది. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ప్రదోష్‌కు అనుమతి లభించే అవకాశం ఉంది.

అభివృద్ధి పనుల తనిఖీ



మురుగు కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మండ్య : నగరంలోని గురుమఠం హొసహళ్లి, కావేరీ నగర, గాంధీ నగర, బోవి కాలనీ, తావర గెరెల్లో ఎమ్మెల్యే పి.రవికుమార్ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.70 లక్ష లతో నిర్మిస్తున్న రోడ్డు, డ్రైయిన్లు, వివిధ నిర్మాణ పనులను పరిశీలించారు. హొసహళ్లిలో శాశ్వత వసతులతో కూడిన చేపల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ దిశగా స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచిం చానని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అభివృద్ధి పనులను సకాంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరసభ కమిషనర్ ఆర్.మంజునాథ్, సభ్యులు రామలింగయ్య, మంజునాథ, ప్రముఖులు శివ లింగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామ సహాయకుడు ఆత్మహత్య

మైసూరు: జిల్లాలోని నంజనగూడు పట్టణం లోని అశోకపురంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. నంజనగూడు తాలూకా కరళాపుర గ్రామానికి చెందిన శివన్న (45) అనే వ్యక్తి గత ఆరు నెలలుగా గ్రామ సహాయ కునిగా పనిచేస్తున్నాడు. నంజనగూడు అశోక పురం బడావణెలోని ఓ హోటల్ వెనుక భాగం లోని అద్దె ఇంట్లో ఉంటూ నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి దుర్వాసన రావడం తో చుట్టుపక్కల వాసులు పోలీసులకు సమా చారం అందించారు. పోలీసులు చేరుకుని మృ తదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సమస్యలే కారణమని అనుమానాలున్నాయి.

దళితులపై దౌర్జన్యాలను అరికట్టాలి



దళిత యువకుడిని పరామర్శిస్తున్న మునియప్ప

విజయపుర: దళితులపై జరుగుతున్న దౌర్జన్యా లను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అట్రాసిటీ నిరోధక చట్టం కమిటీ సభ్యుడు ఓబదేనహళ్లి మునియప్ప డిమాండ్ చేశారు. రామనగర జిల్లా కనకపుర తాలూకాలోని మాళగాళు గ్రామంలో గంజాయి విక్రేతల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనీష్ అనే దళిత యువ కుడిని ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై సమా చారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసు అధికారులను బదిలీ చేయాలని, వాల్మీకి మండలి నిధుల దుర్వినియోగంపై సీబీఐ దర్యాప్తు జరిపిం చాలని ఆయన డిమాండ్ చేశారు.



హార్న్‌బిల్ పక్షి



ఏనుగులు



పెద్దపులుల సంఘర్షణ



ఆహార గుడ్లగూభ

జీవ వైవిధ్యానికి దర్పణం ఛాయాచిత్రం


బనశంకరి: మనదేశంతోపాటు అఫ్రికా, అమెరి కాదేశాల్లో 35 క్యురేటెడ్ వన్యజీవుల ఛాయా చిత్రాలు బెంగళూరువాసులను కనువిందు చేయనున్నాయి. విశ్రాంత సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి, మాజీ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జ ర్వేటర్ సెక్రటరీ, ప్రముఖ వన్యజీవి, ప్రకృతి ఛాయాగ్రాహకుడిగా పేరుపొందిన ఎంఎన్. జయకుమార్ వన్యజీవులైన ఏనుగులు, సిం హాలు, చిరుతలు, జిరాఫీలు, అరుదైన విదేశీప క్షులను తన కెమెరాలో బంధించారు. ప్రపంచ ఉష్ణోగ్రతలు, వాతావరణమార్పులు జీవ వైవి ధ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ సవాళ్లకు పరిష్కారం కనుగొనకపోతే వీటన్నింటిని శాశ్వతంగా కోల్పోతామనే హెచ్చ రికతో ఆగస్టు 2 నుంచి నేచర్స్ స్ప్లెండర్ పేరుతో బెంగళూరులోని యూబీ సిటీలోని సబ్ లైమ్ గ్యాలరీ 8వ అంతస్తులో ఛాయాచిత్ర ప్రద ర్శన ఏర్పాటు చేయనున్నారు.



జిరాఫీలు



చిరుత



కెమెరాతో వన్యజీవి ఛాయాగ్రాహకుడు ఎం.ఎన్.జయకుమార్

మేకెదాటుపై ఇద్దరు సీఎంలు చర్చించాలి: కుమార

మైసూరు: మేకెదాటు పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరిం చాలని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొ న్నారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లా డారు. కావేరి నీటి కోసం మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పోరాడుతున్నారని అన్నారు. రాజ్యసభలో ఆయన మాట్లాడితే తమిళనాడు ఎంపీలు లేచి నిలబడి నిరసన తెలుపుతున్నారు. కనుక తమిళనాడు ముఖ్య మంత్రితో రాష్ట్ర సీఎం సమావేశమై మేకెదాటు అం శాన్ని పరిష్కరించుకోవాలన్నారు. అప్పుడే ప్రాజెక్టుకు అనుమతులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని కుమా రస్వామి అన్నారు. రాత్రికి రాత్రే మేకెదాటు పథకం అమలు సాధ్యమా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వల్ల కర్ణాటకకు ఎలాంటి అన్యాయం జర గడం లేదన్నారు. బడ్జెట్‌లో ఏమీ ఇవ్వలేదని ఆరోప ణలు చేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. ప్రాజెక్టుల అమలుకు రాష్ట్రానికి చెందిన వాటా నిధులు కేటాయిం చాలన్నారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం తన వాటా సొమ్మును విడుదల చేస్తుందన్నారు.

నిందితులపై పోలీసు కాల్పులు



నిందితులు హర్ష,కన్న(ఫైల్)



చికిత్స పొందుతున్న నిందితులను విచారి స్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం : దళిత యువకుడిపై దాడికి పాల్పడి చేయి నరికి పరారైన ఇద్దరు రౌడీ షీటర్లపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. వివరా లు... కనకపుర తాలూకా మళగాళు గ్రామంలో జెడీఎస్ మాజీ అధ్యక్షుడు వైరముడి కుమారుడు వినీ శ్‌పై ప్రత్యర్థి వర్గానికి చెందిన హర్ష ఆలియాస్ కై మ, కరుణేశ్ ఆలియాస్ కన్నలు సోమవారం రాత్రి దాడి చేసి చేయి నరికివేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తు న్నారు. ఈక్రమంలో మళగాళు గ్రామం సమీపం లో ఇద్దరు నిందితులు దాక్కున్నారని సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం తెల్లవారుజా మున వెళ్లారు. అయితే నిందితులు ఎదురు దాడి చేయగా రాజశేఖర్,శివకుమార్ అనే కానిస్టేబుళ్లు గాయపడ్డారు. దీంతో పోలీసులు కాల్పులు జర పగా బుల్లెట్లు నిందితుల కాళ్లలోకి దూసుకెళ్లాయి. గాయపడ్డ నిందితులను బెంగళూరు ఆస్పత్రికి తర లించారు. ఇద్దరు నిందితులపై రౌడీషీట్లు, 5 క్రిమి నల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

30న మేఘాలయ గవర్నర్‌గా బాధ్యతలు: సీహెచ్ విజయశంకర్

మైసూరు : జీవితాంతం పార్టీ, సంఘం శ్రేయస్సు కోసం కృషి చేసిన తనను ప్రజలు మరిచిపోయినా పార్టీని గుర్తించి ఉన్నతమైన బాధ్యతలు అప్పగించినం దుకు రుణపడి ఉంటానని మైసూరు మాజీ మంత్రి, మేఘాలయ కొత్త గవర్నర్ సీహెచ్. విజయశంకర్ అన్నారు. మేఘాలయ కొత్త గవర్నర్‌గా నియమితు లైన నేపథ్యంలో ఆదివారం మైసూరులో ఆయన విలే కరులతో మాట్లాడారు. 14 ఏళ్ల వనవాసం తనకు ముగిసిందన్నారు. హాసన లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలింది. అక్కడి నుంచి జనం తనను మరిచిపోయారన్నారు. అయితే పార్టీ తనలాంటి వారి సేవలను గుర్తించి తనకు ఇంత ఉన్నత స్థానం కల్పించిందన్నారు. ఈ నెల 30న ప్రమా ణస్వీకారం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. మేఘాలయ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనం తరం 3 రోజుల పాటు జరిగే అఖిల భారత గవర్నర్ల సదస్సులో పాల్గొంటానని తెలిపారు.

కువెంపు స్మారక నిర్మాణానికి భూమిపూజ



28బీఎన్‌జీ54-భూమిపూజ చేస్తున్న మంత్రి మహదేవప్ప తదితరులు

మైసూరు: జిల్లాలోని టీ.నరసీపుర తాలూకా యాచేనహళ్లి గ్రామంలో జిల్లా యంత్రాంగం, కన్నడ సంస్కృతి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో నిర్మించనున్న కువెంపు చితా భస్మ స్మారక భవనం నిర్మాణానికి సాంఘిక సం క్షేమ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి హెచ్.సి.మహదే వప్ప ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కువెంపు సిద్ధాంతాలను అనుస రించాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధుడు, బసవణ్ణ, అంబేడ్కర్‌ల సరసన కువెంపు చేరతా రన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీని లాంఛ నంగా ప్రారంభించారు. చామరాజనగర ఎంపీ సునీల్ బోస్, ప్రొఫెసర్ కేఎస్ భగవాన్, యాచే నహళ్లి జీపీ అధ్యక్షుడు శివకుమార్, సభ్యులు శేఖర్, సరోజమ్మ, మాజీ ఎమ్మెల్యే సునీతా వీర ప్పగౌడ, మైమూల్ డైరెక్టర్ చలువరాజు, రామకృష్ణ సేవా కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ నాగా నందనాథస్వామీజీ, స్థలదాత శంకరే గౌడ పాల్గొన్నారు.

వరద పీడిత ప్రాంతాలను సందర్శించండి

శివాజీనగర: వరద పీడిత ప్రాంతాలను సందర్శించి ప్రజల కష్టాలను ఆలకించాలని, అవసరమైన సహాయం అందజేయాలని మంత్రులకు ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ విన్నవించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసి అనేక నదులు పొంగి పొర్లుతున్నాయన్నారు. అనేక జలాశయాలు నిండి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలకు నష్టం జరిగిందన్నారు. పంటలు, ఇళ్లు నీట మునిగాయన్నారు. చాలా చోట్ల ఇళ్లు కూలిపోయా యన్నారు. ఇటువంటి కష్ట సమయంలో ప్రజలకు అండగా ఉండాలన్నారు. తమ పరిధిలోని ఎమ్మెల్యే లతో కలిసి వరద పీడిత ప్రాంతాలను సందర్శిం చాలని సూచించారు. వరదలతో జరిగిన ఆస్తి, పం టనష్టంపై అధికారులు నివేదికలు తయారు చేస్తు న్నారన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

మైసూరు: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందిన విషాద ఘటన జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని హెగ్గడహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన శివకుమార్ కుమారుడు యశ్వంత్ (16) అనే బాలుడు శనివారం రాత్రి టీవీ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యు దాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. స్థలాన్ని రూరల్ పోలీసులు సందర్శించి కేసు నమోదు చేశారు.

గజరాజుల మృత్యుఘోష

- మూడేళ్లలో 283 ఏనుగుల మృతి
- దేశంలోనే మరణాల్లో కర్ణాటక అగ్రస్థానం



రోడ్డు దాటుతున్న ఏనుగుల మంద(ఫైల్)



మృత్యువాతపడిన ఏనుగు

సాక్షి బెంగళూరు: కన్నడనాడులో అటవీ ఏనుగుల మరణాలు ఏటేటా పెరుగుతున్నాయి. గత మూడేళ్లలో 283 ఏనుగులు మృత్యువాతప డ్డాయి. దేశంలో అత్యధికంగా ఏనుగులు మర ణించిన రాష్ట్రాల్లో కర్ణాటక అగ్రస్థానంలో ఉంది. గతేడాది గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అటవీ ప్రాంతంలో 6,395 ఏనుగులు ఉన్నాయి. కాగా, ఈ ఏనుగుల సంతతి వేగంగా తగ్గుతూ వస్తోం ది. 2021 నుంచి ఈ ఏడాది జూలై వరకు 283 ఏనుగులు వివిధ కారణాలతో మృత్యువాత పడ్డాయి. 2023–24లో 94 ఏనుగులు అసువులు బాసాయి. ఏనుగు మృతుల్లో చాలా వరకు వయోభారంతో మరణించినవే. మిగిలినవి విద్యుదాఘాతం, లేదా ఇతరత్రా కారణాలతో మృతి చెందాయి. చామరాజనగర అటవీ పరిధిలో ఏనుగుల మరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ 2024 ఏడాదిలోనే ఏప్రిల్ నుంచి జూలై నాటికి చామరాజనగర అటవీ ప్రాంతంలో

సంవత్సరాల వారీగా ఏనుగుల మరణాలు	
2021-22	82
2022-23	72
2023-2024	94
2024- ఇప్పటివరకు	35
మొత్తం	283

ఏకంగా 17 ఏనుగులు మరణించాయి. కొడగులో 11, చిక్కమగళూరు, మైసూరు జోన్‌లో చెరో రెం డు, మంగళూరు, బెంగళూరు అటవీ జోన్‌లో చెరొకటి చొప్పున ఏనుగులు ఈ ఏడాది మరణిం చాయి. మొత్తంగా ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 35 ఏనుగులు మృతి చెందినట్లు అధికారికంగా తెలిసింది. ఇటీవల కాలంలో ఏనుగులు–మ నుషుల మధ్య సంఘర్షణలు ఎక్కువగా జరుగు తున్నాయి. వీటి నియంత్రణకు అటవీ అధికా రులు చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ ఏనుగులు అటవీ ప్రాంతాల నుంచి ఊళ్లలోకి రావడం, పంటలను ధ్వంసం చేయడం, మనుషు లను చంపేయడం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సంఘర్షణలో గత ఐదేళ్లలో ఏకంగా 160 ఏనుగులు మరణించాయి. ఈ కారణంతో జరిగిన మరణాల్లో దేశంలోనే కర్ణాటక ఏడో స్థానంలో ఉంది. ఈ అంశంపై చర్చించేందుకు వచ్చే నెల 12న అంతర్జాతీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈసమ్మేళనంలో అటవీ, వన్య జీవి నిపుణులు సూచనలు చేయనున్నారు. ఏను గులు–మానవ సంఘర్షణకు కారణాలు, దాని వల్ల కలిగే పరిణామాలు, పరిహారంపై చర్చించ నున్నారు. అలాగే ఏనుగుల మరణాలను తగ్గిం చేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా ఈ సమ్మే ళనంలో చర్చించనున్నారు. వ్యవసాయ విశ్వవి ద్యాలయం ఆవరణలో జరిగే ఈ సమ్మేళనంలో అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటున్నారు.

హోసూరు వార్తలు..

కావేరి నది జోరు

హోసూరు: గత కొద్దిరోజులుగా కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణరాజసా గర్ డ్యాం నుంచి 1.66 లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో నది జోరుగా ప్రవహిస్తోంది. పర్యాటక కేంద్రం హొగేనకల్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నది వద్దకు వెళ్లరాదని అధికారులు అపాయ హెచ్చరి కలు జారీ చేశారు. కర్ణాటకలో భారీ వర్షాల కారణం గా కావేరినదిలో వరదనీరు మరింతగా పెరిగే అవ కాశం ఉందని తెలిపారు. మరోవైపు కరువు పరిస్థితి ఏర్పడింది. తమిళనాడులోని క్రిష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో సరైన వర్షాలు కురవలేదు. వర్షాధార పంట లపై ఆధారపడిన రైతులు వానల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కావేరి నది

రోడ్డు నిర్మాణం ప్రారంభం

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని సాతనూరు గ్రామపంచాయతీలో తారు రోడ్డు నిర్మాణానికి ఆది వారం తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తారు రోడ్ల నిర్మాణానికి రూ. 30 లక్షల నిధులను మంజూరు చేయించారు. బిన్నమంగలం గ్రామంలో రూ. 9 లక్షల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ జరిగింది. కార్యక్రమం లో యూనియన్ కౌన్సిలర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ, ఒకరు మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి చనిపోయిన ఘటన కల్లావి వద్ద జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కల్లావి సమీపంలోని గంగప్రాంబట్టి గ్రామానికి చెందిన సంజ య్‌గాంధీ (42). ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. శనివారం సాయంత్రం మిత్రుడు రవికుమార్‌తో కలిసి బైక్‌లో వెళ్తుండగా ఎదురుగా మరో బైకిస్టు వచ్చి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలేర్పడిన సంజయ్‌గాంధీ ఘటనా స్థలం లోనే మృతి చెందగా రవికుమార్ తీవ్ర గాయాలపా లయ్యాడు. కల్లావి పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి కళ్ల ముందే బాలుడు దుర్మరణం

క్రిష్ణగిరి: గార్మెంట్స్ బస్సు కింద నలిగి బాలుడు మృతి చెందాడు. ఉద్దనపల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. సూళగిరి తాలూకా ఉద్దనపల్లి సమీపంలోని క్రిష్ణమకొ త్తూరు గ్రామానికి చెందిన కూలికార్మికుడు మంజు నాథ్. ఇతని భార్య దివ్య. వీరికి గిరివాస్ (4) అనే కొడుకు ఉన్నాడు. దివ్య సమీపంలోని గొల్లపల్లి వద్ద నిర్వహిస్తున్న గార్మెంట్స్‌లో కార్మికురాలిగా పనిచేస్తుం ది. రోజూ కొడుకును తీసుకెళ్లేది. శనివారం ఉదయం కొడుకుతో పాటు వెళ్లిన ఈమె గార్మెంట్స్ బస్సు ఎక్కు తుండగా డ్రైవర్ గమనించక ముందుకు నడపడంతో అదుపుతప్పి కిందపడిన బాలుని మీద బస్సు ముందు చక్రాలు వెళ్లిపోయాయి. తీవ్ర గాయాలతో విలవిలలా డుతూ తల్లి ముందే మరణించాడు. తల్లి, ఇతర కార్మి కులు ఈ ఘోరం చూసి తీవ్రంగా శోకించారు. ఉద్దన పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

యశవంతపుర: చిక్కమగళూరు తాలూకా అవుతి హోబళి తుంబళ్లిపుర గ్రామానికి చెందిన కుమార్(35) అనే వ్యక్తి కాలువలో కొట్టుకుపోయి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం పశువులను ఇంటికి తోలు కొని వస్తుండగా కాలువలోజారి పడ్డాడు. ఎంతసేప టికీ ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు గాలిం చగా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో వెళ్లి గాలించగా దొడ్డహళ్ల వద్ద మృతదేహం లభ్యమైంది.

ఘనంగా చాముండేశ్వరి జాతర



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి : ఆనేకల్ తాలూకా నారాయణగ ట్టలో కొలువైన ప్రసన్న నంజుండేశ్వర స్వామి ఆల యంలో ఆదివారం చాముండేశ్వరి అమ్మవారి జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సం దర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అలంకరణ చేపట్టారు. అర్చకులు వేదబ్రహ్మ మోహన్‌శర్మ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ సేవాకర్తలు రామమూర్తి, ఈశ్వరరెడ్డి, యల్లారెడ్డి, హరీష్, గౌరిష్, రవి పాల్గొన్నారు.

మారెమ్మ తల్లికి పూజలు



అమ్మవారికి పూలతో అలంకరణ

బొమ్మనహళ్లి : ఆషాఢమాసం ఆదివారం సం దర్భంగా బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎ స్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో మారెమ్మ దేవికి పూజలు నిర్వహించారు. అమ్మ వారికి అర్చకులు వినయ్ కుమార్ పంచామృతా లతో అభిషేకం నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి దీపహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన

హోసూరు: హోసూరు ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు స్థలపరిశీలన చేసి నివేదికను భారత విమా నయాన సంస్థకు పంపినట్లు జిల్లా అధికారులు తెలిపారు. పారిశ్రామిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు ప్రాంతంలో విమానాశ్రయం లేకపోవడం పెద్ద లోటుగా ఉంది. సమీపంలోని బెం గళూరులో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడం తో హోసూరులో మరో ఎయిర్‌పోర్టును నిర్మించడం సాధ్యం కాదని కేంద్ర విమానయాన సంస్థ చెబుతూ వస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు పచ్చ జెండా ఊపడంతో పారిశ్రామిక అభివృద్ధి సంస్థచే హోసూరు ప్రాంతంలో 5 ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసి నివేదికను తయారు చేశారు. సీఎం స్టాలిన్ ఇటీ వల అసెంబ్లీలో హోసూరు ప్రాంతంలో 2 వేల ఎక రాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయ నున్నట్లు ప్రకటించడంతో మళ్లీ ఆశలు ఏర్పడ్డాయి.

పాముకాటుతో మహిళ మృతి

క్రిష్ణగిరి: ఇంటి ముందు చెత్త ఊడుస్తుండగా పాము కాటేయడంతో మహిళ మృతి చెందిన ఘటన కావే రిపట్టణం పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని సంజీవన్ కొటాయ్ గ్రామానికి చెందిన మహిళ లక్ష్మి (54), శనివారం సాయంత్రం ఇంటి ముందు శుభ్ర పరుస్తుండగా పాము కాటేసింది. గమనించిన స్థాని కులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి, మళ్లీ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు



మంటలు చెలరేగిన దృశ్యం


యశవంతపుర: సిలిండర్ పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఉడుపి జిల్లా కార్కళ పట్టణంలోని అనెకెరె సమీపంలోని కృష్ణా అపార్ట్‌మెంట్‌లో జరిగిం ది. ఆదివారం వేకువజామున ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో భారీ శబ్దం వచ్చింది. అపార్ట్‌మెంట్ ఉంచి మంటలు చెలరేగినట్లు గుర్తించిన స్థానికులు వెళ్లి చూడగా గ్యాస్ సిలిండర్ పేలినట్లు గుర్తించారు. మంటలు వ్యాపించి ఇంటిలోని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఉం డగా ఆస్పత్రికి తరలించారు. కార్కళ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

వైఎస్ జగన్ హయాంలో..

పరిమితంగానే ఏపీ అప్పులు

ఏపీ, గుజరాత్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తప్పనిసరి వ్యయం తక్కువే

ఏపీ తలసరి ఆదాయం జాతీయ సగటు కన్నా ఎక్కువ.. 2024-25 కేంద్ర బడ్జెట్‌పై ఎస్‌బీఐ నివేదిక వెల్లడి



రాష్ట్రంలో గత వైఎస్ జగన్ సర్కారు ఇబ్బడిముబ్బడిగా అప్పులచేసిందంటూ చంద్రబాబు బ్యాచ్ చేస్తున్న ప్రచారం అంతా అవాస్తవమని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఆర్థిక సంఘం సిఫార్సుల కన్నా ఆంధ్రప్రదేశ్ వరుసగా 2022, 2023 సంవత్సరాల్లో పరిమతి కన్నా తక్కువ అప్పులుచేసినట్లు ఆ నివేదిక వెల్లడించింది. గత మంగళవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024–25 కేంద్ర బడ్జెట్ విశ్లేషణాత్మక నివేదికలో ఎస్‌బీఐ ఈ విషయాన్ని పేర్కొంది. వివిధ రాష్ట్రాల అప్పులు, తప్పనిసరి వ్యయాలు, సాధికారతతో కూడిన సంక్షేమ పథకాల వ్యయం, తలసరి ఆదాయాలతో కూడిన అంశాలను విశ్లేషిస్తూ ఎస్‌బీఐ ఈ నివేదికను విడుదల చేసింది.

- సాక్షి, అమరావతి

పరిమితి కన్నా 1.4 శాతం తక్కువగా..

15వ ఆర్థిక సంఘం సిఫార్సులు కన్నా ఏపీ వరుసగా 2022, 2023 సంవత్సరాల్లో తక్కువగా అప్పులు చేసిందని.. అదే హిమాచల్‌ప్రదేశ్, బిహార్, పంజాబ్ రాష్ట్రాలు 2023లో 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు కన్నా ఎక్కువగా అప్పుచేసినట్లు నివేదిక తెలిపింది. ఈ సిఫార్సులతో పాటు విద్యుత్ సంస్కరణలు అమలుచేస్తున్న ఏపీకి 2022లో జీఎస్‌డీపీలో 4.5 శాతం మేర అప్పుచేయడానికి అనుమతి ఉందని.. అయితే 3.1 శాతమే నికర అప్పుచేసింది. అంటే.. పరిమితి కన్నా 1.4 శాతం మేర తక్కువగా అప్పుచేసినట్లు ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. ఇక 2023లో జీఎస్‌డీపీలో 4 శాతం అప్పు చేయడానికి అనుమతి ఉన్నప్పటికీ ఏపీ 3.5 శాతమే నికర అప్పుచేసిందని, అంటే పరిమితి కన్నా 0.5 శాతం తక్కువగా అప్పుచేసిందని నివేదిక పేర్కొంది. జాతీయ సగటు కంటే తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ తప్పనిసరి వ్యయాలైన పెన్షన్, వడ్డీ చెల్లింపులు, పరిపాలనపరమైన వ్యయాలు బిహార్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాజస్థాన్ రాష్ట్రాల్లో చాలా ఎక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, హరియాణాల్లో పెన్షన్లు, వడ్డీలు, పరిపాలనపరమైన తప్పనిసరి వ్యయం తక్కువగా ఉందని తెలిపింది. అంతేకాక.. ఏపీ తలసరి సగటు ఆదాయం జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉందని, ఈ పరిణామం అత్యంత అనుకూలమైనదిగా నివేదిక వ్యాఖ్యానించింది.


దేశాభివృద్ధికి జగన్ పథకాలు దోహదం..

ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు సంక్షేమానికి గణనీయంగా వ్యయంచేసి సంక్షేమ రాష్ట్రాలుగా మార్చారని నివేదిక అభిప్రాయపడింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం ఆరోగ్యం, విద్యతో అనుసంధానం చేసే సంక్షేమ పథకాలను అమలుచేసిందని, అలాగే.. మహిళలు, పిల్లల విద్య, మహిళల ఆరోగ్యంతో కూడిన పథకాలను అమలుచేసిందని పేర్కొంది. మహిళా సాధికారిత సాధించడమే లక్ష్యంగా పథకాలను అమలుచేశారని, ఇవన్నీ దీర్ఘకాలంలో ఫలితాలను సాధించడంతో పాటు దేశాభివృద్ధికి దోహదపడతాయని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, పొదుపు సంఘాలకు వైఎస్సార్ సున్నావడ్డీ అమలు పథకాలు ఈ కోవలేకే వస్తాయని నివేదిక వ్యాఖ్యానించింది.

బిజినెస్ ఉమెన్

వైఎస్ జగన్ ప్రోత్సాహంతో ఏపీలో మూడేళ్లలోనే 2.28 లక్షల మహిళా ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు

- 2023–24 సంవత్సరంలోనే 1.22 లక్షల యూనిట్ల ఏర్పాటు
- రాజ్యసభలో కేంద్ర మంత్రి జితిన్ రాం మాంజీ వెల్లడి



సాక్షి, అమరావతి: గడిచిన మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2021–23 మధ్య కాలంలో కొత్తగా 2,28,299 మంది మహిళలు యూనిట్లను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రి జితిన్ రాం మాంజీ ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. 2021–22లో రాష్ట్రంలో 34,625 యూనిట్లు, 2022–23లో 70,811 యూనిట్లు, 2023–24లో 1,22,863 యూనిట్లు కొత్తగా ఏర్పాటయినట్లు వెల్లడించారు. మూడేళ్లలో దేశవ్యాప్తంగా మొత్తం 46,91,577 మహిళా యూనిట్లు ఏర్పాటయితే అందులో రాష్ట్రానికి సంబంధించి 2,28,299 ఉన్నాయి. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి అనేక ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో భారీగా ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా గడిచిన మూడేళ్లలో 19,30,188 మహిళా యూనిట్లకు రూ. 94,296 కోట్ల రుణాలను అందించారు. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్రంలో మొత్తం ఎంఎస్‌ఎంఈల సంఖ్య 1.96 లక్షలుగా ఉంటే ఇప్పుడు వీటి సంఖ్య 8.89 లక్షలకు చేరింది. కేవలం ఎంఎస్‌ఎంఈల ద్వారా రాష్ట్రంలో 22 లక్షల మందికిపైగా ఉపాధి లభించినట్లు అధికారులు చెప్పారు.

పోలవరం కాలువ గట్టు

మట్టి బొక్కేస్తున్నారు

అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న టీడీపీ నేతలు


ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో జేసీబీతో పోలవరం కుడి కాలువ గట్టు తవ్వి మట్టిని టిప్పర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం


పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

- టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టి తరలింపు
- భారీగా జేబులు నింపుకొంటున్న టీడీపీ నేతలు.. తవ్వకాలతో బలహీనపడుతున్న గట్టు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు.. పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు


మట్టిని తరలిస్తున్న టిప్పరు

ద్వారకాతిరుమల: తమ అక్రమ సంపాదన కోసం టీడీపీ నేతలు ప్రజల ప్రాణాలను కూడా పణంగా పెడుతున్నారు. ఏం చేసినా అడిగే వారు లేరన్న ధైర్యంతో బరితెగిస్తున్నారు. జేబులు నింపుకోవడమే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే పోలవరం కుడి కాలువ గట్లపై కొందరు తెలుగు తమ్ముళ్లు కన్నేశారు. 24 గంటలూ యథేచ్ఛగా కాలువ గట్టును తవ్వి, ఎంతో విలువైన మట్టిని తరలించేస్తున్నారు. టిప్పర్ మట్టిని వేలాది రూపాయలకు అమ్మి, జేబులు నింపుకొంటున్నారు. ఈ తవ్వకాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టు బలహీనపడిపోతోందని, వరదల సమయంలో ఇది ప్రమాదకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని ఎం.నాగులపల్లిలో పోలవరం కుడికాలువ గట్టును గత కొంత కాలంగా తవ్వి మట్టి తరలిస్తున్నారు. టీడీపీ పెద్దల అండదండలు, సూచనలతో స్థానిక సంస్థలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఈ దందా నడిపిస్తూ డబ్బు దండుకుంటున్నారు. పొక్లెయిన్ సహాయంతో తవ్విన మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏవిధమైన అనుమతులూ లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

దూరాన్ని బట్టి ధర

మట్టిని తరలించే దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం నుంచి ఏలూరుకు వెళ్లే ఒక్కో టిప్పర్ నుంచి రూ. 7 వేలు, భీమవరం పరిసర ప్రాంతాలకు వెళ్లే ఒక్కో టిప్పర్ నుంచి రూ.12 వేలు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లను చదును చేయడానికి, చేపల చెరువుల గట్ల నిర్మాణానికి ఈ మట్టిని వినియోగిస్తున్నారు.

రైతులకు తప్పని ఇక్కట్లు

తవ్వకాలు జరుగుతున్న కాలువ గట్టు వెంబడి వ్యవసాయ భూములు ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టిప్పర్ల ధాటికి కాలువ గట్టు మార్గం పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారుతోందని, వేగంగా వెళుతున్న టిప్పర్ల వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు భయపడుతున్నారు.

ఆశలు జల సమాధి

ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో నీట మునిగి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. దేశంలోనే అత్యున్నత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ప్రజలకు సేవలందించాలన్న ఆశయంతో శిక్షణ పొందుతున్న ముగ్గురు అభ్యర్థుల జీవితాలు అర్ధంతరంగా కడతేరిపోయాయి. అనూహ్యంగా వరద పోటెత్తడంతో గ్రంథాలయంలో చదువుకుంటున్న ఇద్దరు యువతులు, ఒక యువకుడు విగత జీవులుగా మారిపోయారు. ఢిల్లీలో ఓల్డ్ రాజిందర్ నగర్ ప్రాంతంలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ భవనం బేస్‌మెంట్‌లోకి శనివారం సాయంత్రం ఒక్కసారిగా వరద నీరు ప్రవహించింది. అక్కడే ఉన్న గ్రంథాలయంలో చదువుకుంటున్న తెలంగాణకు చెందిన తానియా సోనీ(21), ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన శ్రేయ యాదవ్(25), కేరళలోని ఎర్నాకుళంకు చెందిన నెవిన్ డెల్విన్ (29) అక్కడికక్కడే మరణించారు. మరికొందరు ప్రాణాలతో బయటపడ్డారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ దుర్ఘటనపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా స్పందించారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందంటూ దుమ్మెత్తిపోశారు.

నీటి అడుగున మృతదేహాలు

ఢిల్లీలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఓల్డ్ రాజిందర్ నగర్ ప్రాంతం తడిసి ముద్దయ్యింది. పాతకాలం నాటి డ్రైనేజీ వ్యవస్థ చాలా వరకు దెబ్బతినడంతో ఆ ప్రాంతంలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ భవనాన్ని వరద నీరు చుట్టుముట్టింది. భవనం గ్రౌండ్ లెవల్ కంటే బేస్‌మెంట్‌కు 8 అడుగుల దిగువన ఉంది. బేస్‌మెంట్ గేటు మూసి ఉన్నప్పటికీ వరద ఉధృతికి ధ్వంసమైంది. దాంతో నీరు ఒక్కసారిగా అధిక ఒత్తిడితో లోపలికి ప్రవేశించింది. ఆ సమయంలో బేస్‌మెంట్‌లోని గ్రంథాలయంలో దాదాపు 30 మంది విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బయటకు వెళ్లే మార్గం లేక రక్షించాలంటూ కేకలు వేశారు. స్థానికులు తాళ్లు అందించడంతో కొందరు వాటి సాయంతో బయటకు వచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది 7 గంటలపాటు శ్రమించి నీటిని చాలా వరకు తోడివేశారు. ఆదివారం తెల్లవారుజామున నీటి అడుగున పడి ఉన్న ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం కోసం రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు.


కుటుంబ సభ్యులతో సోని(మధ్యలో) (ఫైల్)

కోచింగ్ కోసం వచ్చి..

తానియా సోనీ స్వస్థలం బిహార్‌లోని ఔరంగాబాద్. ఆమె తండ్రి ప్రస్తుతం తెలంగాణలో ఓ మైనింగ్ కంపెనీలో పని చేస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్న తానియా 45 రోజుల క్రితమే రావూస్ స్టడీ సర్కిల్‌లో చేరారు. ఆమెకు ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. ఆదివారం తానియా తల్లిదండ్రులు ఆమె మృతదేహాన్ని ఔరంగబాద్‌కు తీసుకెళ్లారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ వాసి శ్రేయ యాదవ్ బీఎస్సీ–అగ్రికల్చర్ చదివారు. ఈ ఏడాది మే నెలలో రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో చేరారు. శ్రేయ యాదవ్ మరణం గురించి తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని, టీవీ చానళ్లలో చూసి వచ్చామని ఆమె బంధువు ధర్మేందర్ యాదవ్ చెప్పారు. ఆమె మృతదేహాన్ని బంధువులు ఘజియాబాద్‌కు తీసుకెళ్లారు. కేరళవాసి నెవిన్ డాల్విన్ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అభ్యసిస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం సివిల్స్ కోచింగ్ కోసం రావూస్ స్టడీ సర్కిల్‌లో చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ నిర్వాకం వల్లే ఈ దారుణం జరిగిందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్, బీజేపీ ఎంపీ బాన్సూరీ స్వరాజ్‌లు మండిపడ్డారు.

ఇద్దరి అరెస్టు

ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. స్టడీ సర్కిల్ యజమాని అభిషేక్ గుప్తా, కో–ఆర్డినేటర్ దేశ్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. కాగా, ఢిల్లీలోని వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఆదివారం రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఎదుట ఆందోళనకు దిగారు. అనుమతుల్లేని భవనాల్లో తమకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) అధికారులు నగరంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న కోచింగ్ సెంటర్లు, కార్యాలయాలు, దుకాణాలకు నోటీసులు ఇచ్చారు.

నిబంధనల ఉల్లంఘనే

రావూస్ స్టడీ సర్కిల్‌లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. బేస్‌మెంట్‌లో లైబ్రరీ నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమేనని చెప్పారు. ఈ కోచింగ్ సెంటర్‌కు కొద్ది రోజుల క్రితం నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) లభించింది. మూడంతస్తుల భవనంలో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. బేస్‌మెంట్‌ను స్టోర్ రూమ్‌గా ఉపయోగిస్తామంటూ అనుమతి తీసుకున్నారు. బేస్‌మెంట్ లోపలికి వెళ్లొచ్చే మార్గం ఇరుగ్గా ఉంది. లైబ్రరీలోకి అడుగుపెట్టడానికి బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ ఉన్నట్లు చెబుతున్నారు. స్టోర్ రూమ్ కోసం అనుమతి తీసుకున్న బేస్‌మెంట్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయడం తప్పేనని అధికారులు చెప్పారు. కాగా, ముగ్గురు విద్యార్థుల మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యానికి ప్రజలు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

తెలంగాణ

వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు

చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): చారిత్రక నేపథ్యం కలిగిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 116వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను తీసుకురాగా.. యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల నాట్యాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కదువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అమ్మవారికి దేవీ మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. కాగా, ఉదయం 10 గంటల అనంతరం అమ్మవారి ఆలయానికి వీఐపీల తాకిడి ప్రారంభమైంది. వీరి రాక అధికం కావడంతో బోనం ఎత్తుకున్న మహిళలు కాస్త అసౌకర్యానికి గురవ్వాల్సి వచ్చింది. ఇక సాధారణ భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఎదురు చూడాల్సి వచ్చింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీ సమేతంగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ఆలయం వద్ద భక్తుల రద్దీ

విత్తనాల పంపిణీ హుళక్కే

నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుమందుల విక్రయం మనపని కాదన్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన నాన్‌సబ్సిడీ విత్తనాల పంపిణీకి ప్రభుత్వం మంగళం పాడేసింది. పురుగుమందుల సరఫరా ఇక ఉండబోదని తేల్చి చెప్పింది. ఏటా సబ్సిడీ విత్తనాలతో పాటు నాన్‌సబ్సిడీ విత్తనాలు, పురుగుమందులను కూడా ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచేవారు. రైతుల డిమాండ్ మేరకు.. నాన్‌సబ్సిడీగా వారు కోరుకున్న కంపెనీల విత్తనాలు, పురుగుమందులను బుక్ చేసుకున్న 24 గంటల్లో నేరుగా వారి ముంగిటకు సరఫరా చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా వీటి పంపిణీ అవసరం లేదని స్పష్టం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులు విత్తనాలు, పురుగుమందుల కోసం ఇబ్బందులు పడకూడదని రైతుభరోసా కేంద్రాల్లో నాన్ సబ్సిడీ కింద వాటిని అందుబాటులో ఉంచింది.

నిఘా చాలంటున్న ప్రభుత్వం

గత సీజన్ నుంచి నాన్‌సబ్సిడీ విత్తనాల పంపిణీతో పాటు పురుగుమందుల సరఫరాను నోడల్ ఏజెన్సీగా ఏపీ సీడ్స్‌ను నియమించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విత్తన, పురుగుమందుల కంపెనీలతో అవగాహన ఒప్పందం కోసం ఏర్పాట్లు చేశారు. ఇంతలో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వ అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. నాన్‌సబ్సిడీ విత్తనాలు, పురుగుమందుల పంపిణీ బాధ్యత ప్రభుత్వానిది కాదని, ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచనవసరం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. మార్కెట్‌లోకి వచ్చే విత్తనాలు, పురుగుమందులపై నిఘా పెడితే సరిపోతుందని చెప్పినట్లు అధికారులు తెలిపారు. దీంతో డిమాండ్ ఉన్న కంపెనీల విత్తనాలు, పురుగుమందుల బ్లాక్ మార్కెటింగ్ పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు ఇలా..

ఖరీఫ్-2022లో	ఖరీఫ్-2023లో
108.44 క్వింటాళ్ల పత్తి	17.38 క్వింటాళ్ల పత్తి
2.52 క్వింటాళ్ల మిరప	0.64 క్వింటాళ్ల మిరప
2.25 క్వింటాళ్ల సజ్జలు	137 క్వింటాళ్ల సోయాబీన్
37.20 క్వింటాళ్ల సోయాబీన్	

గత ప్రభుత్వ హయాంలో నకిలీలు, బ్లాక్ మార్కెట్‌కు చెక్

పూర్వం నాణ్యమైన విత్తనం దొరక్క మిరప, పత్తి రైతులు నకిలీల బారినపడి ఏటా రూ.వేలకోట్ల విలువైన పెట్టుబడి, ఉత్పత్తి నష్టాలను చవిచూసేవారు. పైగా డిమాండ్ ఉన్న కంపెనీల విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీకి మించి అమ్మేవారు. రైతులు బ్లాక్ మార్కెట్‌లో రెట్టింపు ధరలకు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోయేవారు. నకిలీ విత్తన విక్రయదారులతో పాటు బ్లాక్ మార్కెట్‌కు చెక్ పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డిమాండ్ ఉన్న కంపెనీలకు చెందిన విత్తనాలతోపాటు పురుగుమందులను నాన్‌సబ్సిడీగా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేది. దీంతో రైతులకు అవి ఎమ్మార్పీకే లభించేవి. ఇందుకోసం ఏటా సీజన్‌కు ముందే విత్తన కంపెనీలతో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ, పురుగుమందుల కంపెనీలతో ఏపీ ఆగ్రోస్ అవగాహన ఒప్పందాలు చేసుకునేవి. ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 305.43 క్వింటాళ్ల నాన్‌సబ్సిడీ విత్తనాలను రైతులు ఆర్బీకేల్లో కొనుగోలు చేశారు. రూ.14.25 కోట్ల విలువైన 1,39,443 లీటర్ల పురుగుమందులను 1.57 లక్షలమంది రైతులు ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేశారు.

బతికి ఉన్నంత కాలం అన్నం తినటం ఎంత అవసరమో శుచిగా ఉండటం అంతే అవసరం. శుచిగా ఉండటానికి నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఒక్కసారి ఆపితే మకిలి పేరుకు పోతుంది. తరువాత యథాస్థితికి తేవటానికి సమయం చాలా అవసర మౌతుంది. రాగిచెంబుని ఎంత తోమితే అంత మెరుస్తుంది అని ఒక నానుడి. రాగిచెంబే కాదు జీవితమైనా అంతే. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. ఇల్లయినా, ఒళ్లయినా, సమాజమైనా, దేశమైనా, మరేదైనా సరే!



నిష్కల్మషం నిరంతర ప్రక్రియ

మంచి మాట

భౌతికమైన అంటే పరిసరాల, శారీరక శౌచం మాత్రమే కాదు మనసుని కూడా శుభ్రం చేస్తూ ఉండాలి. జీవప్రక్రియ జరుగుతున్నప్పుడు వ్యర్థాలు వెలువడటం సహజం. వాటిని ఎప్పటి కప్పుడు తొలగించక పోతే చెత్త పేరుకుపోతుంది. ఆరోగ్యం పాడవటం జరుగుతుంది. మనసు కూడా బాగా పని చేసినప్పుడు మథనంలో కావలసిన ఆలోచనలతో పాటు అక్కర లేనివి కూడా వస్తాయి. వాటిని పరిహరించక పోతే బుర్ర చెడిపోతుంది. ఒక్కక్షణం ఏమరుపాటు కలిగినా జరగవలసిన హాని జరిగిపోతుంది. మనకి మిత్రులలాగా కనపడుతూ కీడు చేసే శత్రువులు అవకాశం కోసం ఎదురు చూస్తూ తొంగిచూస్తూ ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మనసులో తిష్ఠవేసుకుని కూర్చుంటారు. ఆ శత్రువుల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎంతో కాలంగా సాధన చేశాను, ఇంకెంత కాలం నియమ నిష్ఠలతో సాధన చెయ్యాలి? ఇంక చాలు – అంటూ ఉంటారు కొంత మంది. పుట్టినప్పటి నుండి గాలి పీలుస్తూనే ఉన్నాం కదా, ఇక గాలి పీల్చటం మానేద్దాం అని ఎవరైనా అనుకుంటారా? ఆఖరి క్షణం వరకు వీలైనంతగా కొనసాగించ వలసిందే. ఒక్కక్షణం ఆపితే ..? ఇంకేముంది? ఆ తరువాత గాలి పీల్చవలసిన పని ఉండదు. ఎందుకంటే గాలి పీల్చటం ఊపిరితిత్తుల ద్వారా రక్తాన్ని శుభ్రం చేయటమే. అందుకే అన్ని సంప్రదాయాల్లోను శౌచం అనే దానికి చాలా ప్రాధాన్యం ఉంది. అది పరిసరాలతో ప్రారంభమై శరీరం, మనస్సు, ఆత్మల వరకు విస్తరిస్తుంది. దీనిని సూచించటానికే జీసస్ పాత్రలు శుభ్రం చేస్తున్న చిత్రం ఒకటి కనపడుతుంది. అదేవిధంగా షిరిడీ సాయి బాబా కూడా పాత్రలు శుభ్రం చేస్తున్న చిత్రం ఉంటుంది. వాళ్ళకి ఎంగిలిపళ్ళాలు కడగవలసిన అవసరం ఏమిటి? అనే సందేహం ఎవరికైనా ఎప్పుడయినా వచ్చిందా?

వాళ్ళు కడుగుతున్నది తమ శిష్యులు, లేక భక్తులు, లేక అనుయాయుల మనస్సులని కప్పిన పాపాలనే మలినాలని. పాపరహితులైన వారే నిరంతరం శుభ్రం చేయటానికి ప్రాధాన్యం ఇస్తూ ఉంటే సామాన్యుల మైన మనవంటి వార మెంత?పుట్టినప్పుడున్నంత నిష్కల్మషంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి.

ఒక్కరోజు నిర్లక్ష్యం చేస్తే అప్పటి వరకు చేసినదంతా తుడిచి పెట్టుకు పోతుంది. రోజూ తుడుస్తున్న అద్దాన్ని ఒక్కసారి తుడవకపోతే దుమ్ముపొర ఉండి దానిలో ప్రతిబింబం సరిగ్గా కనపడదు. ఇది అందరికి ప్రత్యక్ష ప్రమాణం. అదే మనస్సనే అద్దం మీద కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే మలినాలు ఉంటే దానిలో పరమాత్మ రూపం సరిగ్గా ప్రతిఫలిస్తుందా? ఎన్నో మార్పులతో కనిపిస్తుంది. అందుకే సాధకులకి ఒక్కొక్కరికి దైవం ఒక్కొక్క విధంగా ఉన్నట్టు తోస్తుంది. వీటికి తోడు అహంకార మమకారాలు ఆడే నాటకాలు కూడా తక్కువేమీ కావు. ఈ పొరలు కప్పి ఉండటం వల్లనే ఎన్నో వికల్పాలు కలుగుతూ ఉంటాయి. కనుకనే వీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి. లేకపోతే అదే సహజమైన రూపం అని భ్రమపడే ప్రమాదం ఉంది. ఈ భ్రమప్రమాదాల కారణంగా సాధన పెడత్రోవ పట్టే అవకాశం ఉంది.

– డా.ఎస్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మిక కథ

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...

తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారికి దగ్గరగా బంగాళాఖాతం సముద్ర తీరం వద్ద ఉన్న కుగ్రామం అది. అక్కడినుంచి ఓ యువకుడు స్వామి వారి దర్శనార్థం తిరుమల బయలుదేరాడు.

ఏడు పదుల వయస్సు నిండిన తండ్రి కూడా తిరుమల వస్తానన్నాడు. అయితే, కూర్చుంటే లేవలేని, లేస్తే కూర్చోలేని ఆ వృద్ధుడి శరీరం ప్రయాణానికి సహకరించలేదు.

కొండకు రాలేక పోతున్నందులకు తండ్రి చాలా బాధపడ్డాడు.

ఇంటిలోని స్వామి వారి పటాన్ని చూస్తూ ''మహిమలున్న స్వామి వారి కొండనుంచి

ఎన్నాళ్ళయినా చెడనిది, నీటిలో కరగనిది, ఎన్నటికీ వాడనిది ఏదైనా ఒకటి తీసుకుని రా! అయితే అది పవిత్రమైనదిగా ఉండాలి!!'' అని చెప్పాడు.

''అలాగే నాన్నా!'' అని చెప్పి రైలు ఎక్కాడు ఆ యువకుడు.



ఆ రోజు గురువారం కావడంతో అతి నిరాడంబర స్వరూపంతో నొసటన చాలా సన్నని నామం మాత్రమే కలిగి ఉన్నారు స్వామివారు. గురువారం మాత్రమే కనిపించే 'నేత్ర దర్శనం' తృప్తిగా చేసుకున్న ఆ యువకుడు ఆనంద నిలయం నుంచి బయటికి వచ్చాడు. లడ్డూ ప్రసాదాలూ, కలకండ, తులసి చెట్టు లాంటివి తీసుకున్నాడు.

గబుక్కున తండ్రి చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది.

అయితే, తండ్రి చెప్పినట్లు 'చెడనిది, కరగనిది,వాడనిది, ఏదైె ఉంటుందా?' అని ఆలోచించాడు.

తను తీసుకున్న లడ్డూ ప్రసాదం వైపు చూశాడు. 'ప్రసాదం ఎక్కువ కాలం నిల్వ ఉండదు కదా' అనుకున్నాడు. కలకండ వైపు చూశాడు. 'ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది కదా' అని భావించాడు. తులసి చెట్టు వైపు చూశాడు. 'కొన్నేళ్ళకైనా చెట్టు వాడిపోతుంది కదా' అని తలచాడు.

'మరి తండ్రి చెప్పినట్లు వేరే ఏదైనా ఇక్కడ దొరుకుతుందా?' అని మాడ వీధుల్లో వెదికాడు.

అలాంటి వస్తువు ఏదీ అతడికి కనిపించలేదు.

'నాన్నకి సులభంగా మాట అయితే ఇచ్చాను కానీ, అది నేరవేర్చలేకపోతున్నానే...' అని బాధగా నడవటం ప్రారంభించాడు.

రైల్లో వెళ్ళడానికి మరింత సమయం ఉండటంతో నామాల మిట్ట వద్దకు వెళ్ళి కూర్చున్నాడు. 'పరిష్కారం ఏమిటా?' అని పరిపరి విధాలా ఆలోచించాడు. అయితే పరిష్కారం ఏదీ దొరకలేదు.

అక్కడినుంచి శిలా తోరణం వద్దకు నడుచుకుంటూ వెళ్ళాడు. సహజసిద్ధమైన ఆ తోరణాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉన్నాడు. ఇంతలో ఓ కారు వచ్చి అక్కడ ఆగింది. అందులో హిందీ భాష మాట్లాడుతూ ఉన్న ఉత్తర భారత దేశీయులు ఉన్నారు.

వాళ్ళు కారులో నుంచి దిగిందే 'గోవిందా గోవిందా' అని నామస్మరణ చేస్తూ నేలకు నమస్కరించారు. అక్కడే ఉన్న చిన్న రాళ్ళకు కూడా దండాలు పెట్టారు.

అప్పుడు అతడి మనసులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

తిరుమల కొండలోని చెట్టూ పుట్టా, రాయీ రప్పా... అన్నీ పవిత్రమైనవే! ఈ నేలంతా స్వామి వారి పాద స్పర్శతో పునీతమైనదే. కాబట్టి ఇక్కడి రాయిని తీసుకెళ్ళి నాన్నకి ఇస్తాను. నాన్న చెప్పినట్లు 'చెడనిది, కరగనిది, వాడనిది... పవిత్రమైనదీ ఇదే' అని భావించి ఒక గుండ్రటి రాయిని తీసుకుని సంచిలో వేసుకున్నాడు. గోవింద నామ స్మరణలు చేస్తూ ఊరికి ప్రయాణం కట్టాడు.

కొడుకు తెచ్చిన రాయిని చేతిలోకి తీసుకున్న ఆ వృద్ధుడి కళ్ళు తన్మయత్వంతో తడి అయ్యాయి.

ఆ రాయికి పాలతో, నీళ్ళతో అభిషేకం చేసి, నామాలు పెట్టి, తులసి మాల వేసి దేవుడి గదిలో ఉంచారు. 'స్వామే మన ఇంటికి నడిచి వచ్చాడు!'' అనుకుంటూ భక్తిశ్రద్ధలతో పూజ చేసి, కొండ లడ్డును ఊరంతా పంచిపెట్టారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అర్థము అంటే..!!!



సుఖాన్ని... కామాన్ని ధర్మము చేత కట్టాలి. అప్పుడు ధర్మబద్ధమైన అర్థం ప్రభవిస్తుంది. అందుకే కన్యాదాత కన్యను తీసుకొచ్చి ధర్మపత్నిగా ఇచ్చేటప్పుడు వరుడితో... 'కన్యామిమాం ప్రదాస్యామి పితౄణాం తారణాయవై' అంటాడు.

ఒక్కొక్క కార్యానికి ఒక్కొక్క ప్రయోజనం ఉంది. ఆకలితో ఉన్నవాడికి అన్నం, దాహంతో ఉన్నవాడికి నీరు... అలాగే కామం ఒక ప్రయోజనం కోసం... అందువల్ల అది ధర్మంచేత కట్టబడాలి. ఆయనకు సంతానం కలిగి పితౄరుణంనుండి విముక్తుడు కావాలి. ఆయన యజ్ఞం చేయాలంటే పక్కన భార్య ఉండాలి. వివాహం చేయాలంటే పత్ని ఉండాలి. ఆమె లేనప్పుడు ఈ కార్యక్రమాలు వేటికీ కూడా ఆయన అర్హుడు కాడు... ఈ నియమాలు ఎవరో ఒకరు పెట్టినవి కావు. శాస్త్రం నిర్దేశించినవి. అంటే ధర్మపత్నిని స్వీకరించకుండా పుణ్యకార్యాలు చేయడం, తరించడం ఎలా సాధ్యం?

అందుకే జీవితం పండించుకోవడానికి అవసరమయిన సాధనాన్ని కన్యాదాత ఇస్తున్నాడు. నిజం చెప్పాలంటే ... కొడుకు పుడితే.. వాడు ప్రయోజకుడయితే.. వాడు ధార్మికంగా బతికితే... అప్పుడు తల్లీదండ్రీ, ఆపైన ఉన్నవాళ్ళు .. తరువాత అత్తగారు, మామగారు తరిస్తారు. పుత్ అను పేరుగల నరకం నుంచి త్రాయతే.. రక్షిస్తాడు కాబట్టి పుత్రుడు అన్నారు. కుమార్తెను కన్యాదానం చేశాను.. అనుకోండి. అప్పుడు నాకు పది తరాల ముందూ, పది తరాల వెనకా నాతో కలిపి 21 తరాలు తరించిపోతాయి. ఈ సంతానం కలగడానికి కారణం ఎవరు? నా ధర్మపత్ని. ఆమె వల్ల సంతానం కలిగితే ఇంత గొప్ప ప్రయోజనం సిద్ధించింది.

అందువల్ల కామము ఎప్పుడూ ధర్మబద్ధంగా ఉండాలంటే.. భార్యాభర్తలు చెలియలికట్ట దాటకూడదు. విశ్వనాథ సత్యనారాయణ గారు 'చెలియలికట్ట' అనే సాంఘిక నవల రాశారు. అందులో... వివాహం ద్వారా కామము ధర్మం చేత ఎందుకు కట్టబడుతుందో ప్రతిపాదించారు. సముద్రం అనంత జలరాశి. చాలా శక్తిమంతం. అది అనుకుంటే ఊళ్ళను సునాయాసంగా ముంచేయగలదు. అయినా దానికదిగా .. చెలియలికట్ట దాటకూడదని.. ఒక నియమం పెట్టుకుంది. ఆడుకుంటున్నట్లుగా అక్కడిదాకా వస్తాయి. ఎదురుగా వచ్చిన వాళ్ళ పాదాలు కడిగి అలలు వెనక్కి వెళ్ళిపోతాయి. కాళ్ళు కడిగాయి కదా అని అతి చేసి తెగించి మరింత ముందుకు వెడితే.. ప్రమాదం ముంచుకొస్తుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

'ధర్మేచ, అర్థేచ, కామేచ ఏషా నాతి చరితవ్యా..' – ఇది ప్రమాణం.

'మామగారూ! ఇప్పుడు నాకు అర్థమయింది. మీరు నాకు ఇంతటి మహోపకరణాన్ని ఇచ్చారు. నేను ఈమెను అతిక్రమించను. ఈమె నాకు ప్రధానంగా ధర్మబద్ధ జీవితానికి ఒక సాధనం. ఈమెను నేను ధర్మపత్నిగా స్వీకరించినందుకు నా జీవితం పండాలి. చేయగలిగిన పుణ్యకార్యాలు చేయాలి. అసలు నేను నా భార్యతో కలిసి చేయవలసివేమిటో నాకు తెలియాలి. మేమిద్దరం చేయీ చేయీ పట్టుకుని ప్రయాణించాలి. తద్వారా నేనూ తరించాలి, ఆమే తరించాలి.' అనుకుని ఆచరిస్తాడు. అలా కామము ధర్మము తో కలిసినప్పుడు అర్థము ప్రభవిస్తుంది. అర్థము – అంటే? బంగారం, ఇళ్ళు, వస్తు, వాహనాలు కాదు... మరి నిజమైన సంపద ఏది? పిల్లలకు తల్లిదండ్రులు, తల్లిదండ్రులకు పిల్లలే అసలు సిసలైన సంపద. అదే అర్థము ప్రభవించడం అంటే.

సినిమా

ఆకాశంలో ఒక తార



దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ హీరోగా నటించనున్న సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్ ఖరారైంది. పవన్ సాధినేని ఈ మూవీకి దర్శకత్వం వహించనున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. కాగా ఆదివారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ బర్త్ డే సందర్భంగా 'ఆకాశంలో ఒక తార' సినిమాను అధికారికంగా ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే.. దుల్కర్ సల్మాన్ నటించిన పీరియాడికల్ మూవీ 'లక్కీభాస్కర్'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో సెప్టెంబర్ 7న విడుదల కానుంది. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'లక్కీభాస్కర్' టైటిల్ ట్రాక్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించిన ఈ పాటను ఉషా ఉతుప్ పాడారు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ స్వరకర్త.



● రామ్ తాళ్లూరి, విశ్వక్‌సేన్, మీనాక్షీ చౌదరి, రవితేజ ముళ్లపూడి

ఈ ఏడాది నాకు చాలా స్పెషల్ – విశ్వక్‌సేన్

''ఈ ఏడాది నాకు చాలా ప్రత్యేకం. నేను నటించిన మూడో సినిమా (మెకానిక్ రాకీ) కూడా రిలీజ్ అవుతోంది. ('గామి, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాలు విడుదలయ్యాయి). మలక్‌పేట బ్యాక్‌డ్రాప్‌లో సాగే ముక్కోణపు ప్రేమ కథే 'మెకానిక్ రాకీ'. రాకీగా నా పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరో విశ్వక్‌సేన్ అన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. విశ్వక్‌సేన్ హీరోగా, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్ వీడియో లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ–''ఈ సినిమా దీపావళికి క్రాకర్ అవుతుంది. ఫ్యామిలీతో వచ్చి థియేటర్స్‌లో చూడండి. రామ్ తాళ్లూరిగారి వల్లే ఈ సినిమా అవుట్‌పుట్ ఇంత బాగా వచ్చింది. జేక్స్ బిజోయ్ సంగీతం అదిరిపోతుంది'' అన్నారు. ''రొమాంటిక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా 'మెకానిక్ రాకీ' రూపొందింది. నాకు అవకాశం వచ్చిన విశ్వక్, రామ్ తాళ్లూరి గారికి థ్యాంక్స్'' అన్నారు రవితేజ ముళ్లపూడి. ''మెకానిక్ రాకీ' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు రామ్‌తాళ్లూరి, మీనాక్షీ చౌదరి.



● ఊర్వశీ రౌతేలా

ఊర్వశీ రౌతేలా.. పరిచయం అక్కర్లేని పేరు. హిందీ, కన్నడ, తమిళ్, బెంగాలీ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య'(2023) సినిమాతో టాలీవుడ్‌కి పరిచయం అయ్యారు. ఈ మూవీలో 'వేర్ ఈజ్ ద పార్టీ' అంటూ చిరంజీవి సరసన చిందేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత 'ఏజెంట్, బ్రో, స్కంద' వంటి తెలుగు చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో తళుక్కుమన్నారు. ప్రస్తుతం హిందీతో పాటు తెలుగులోనూ నటిస్తున్నారు ఊర్వశీ రౌతేలా. కాగా ఇటీవల ఆమెకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై తాజాగా ఊర్వశీ రౌతేలా

ఎంతో నిరాశపడ్డాను!

స్పందిస్తూ–''నేను నటించిన కొత్త హిందీ చిత్రం 'గుస్పేటియా'. ఆ మూవీలో నాపై చిత్రీకరించిన ఓ సన్నివేశం ఇటీవల నెట్టింట వైరల్‌గా మారడం నన్నెంతో బాధించింది. సినిమా విడుదలకు ముందే ఆ ఫొటోలు, వీడియోలు లీక్ కావడం నన్ను నిరాశకు గురిచేశాయి. అయితే ఆ వీడియో నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినది కాదు. ఏ అమ్మాయికి కూడా ఇలాంటి చేదు అనుభవం ఎదురుకాకూడదని కోరుకుంటున్నా'' అన్నారు. కాగా అక్షయ్ ఒబెరాయ్, ఊర్వశీ రౌతేలా ప్రధాన పాత్రల్లో నటించిన 'గుస్పేటియా' చిత్రానికి సూషి గణేషన్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 9న ఈ సినిమా ప్రేక్షకులముందుకు వస్తోంది.



● ధనుష్

సరికొత్త కుబేర

ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సోషల్ డ్రామా మూవీ 'కుబేర'. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కుదిరితే ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు మేకర్స్. ఆదివారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కుబేర' సినిమా నుంచి ధనుష్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఇదివరకెన్నడూ చేయని ఓ సరికొత్త పాత్రలో ధనుష్ కనిపిస్తారు. ఈ సినిమాలో ఆయన పెర్ఫార్మెన్స్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. బాలీవుడ్ నటుడు జిమ్‌సర్భ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ఈ దేశాన్ని పీడిస్తున్నది నల్లధనం!

'ఈ దేశాన్ని పీడిస్తున్నది దరిద్రం కాదు సర్.. నల్లధనం', 'సక్సెస్, ఫెయిల్యూర్స్ ఇంటికొచ్చే చుట్టాల్లాంటివి.. వస్తుంటాయ్ పోతుంటాయ్.. ఆటిట్యూడ్ ఇంటిపేరులాంటిది. అది పోయేదాకా మనతోనే ఉంటుంది' అంటూ హీరో రవితేజ చెప్పే డైలాగులు 'మిస్టర్ బచ్చన్' టీజర్‌లో ఉన్నాయి. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. హరీష్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 15న విడుదల కానుంది. ఆదివారం నిర్వహించిన 'మిస్టర్ బచ్చన్ ' టీజర్ లాంచ్



● టీజీ విశ్వప్రసాద్, హరీష్ శంకర్, భాగ్యశ్రీ బోర్సే

ఈవెంట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ–''1980, 1990ల మధ్య జరిగే కథ 'మిస్టర్ బచ్చన్'. రవితేజగారితో నేను చేసిన 'మిరపకాయ్' మూవీ కంటే వందరెట్లు 'మిస్టర్ బచ్చన్' బాగుంటుంది'' అన్నారు. ''ఆగస్టు 15న రెండు తెలుగు పెద్ద సినిమాలతో పాటు ఒక తమిళ చిత్రం రిలీజ్ అవుతోంది. అలాగే రెండు చిన్న తెలుగు మూవీస్ కూడా వస్తున్నాయి. అయితే మన థియేటర్ వ్యవస్థ అన్ని సినిమాలను సపోర్ట్ చేయగలదు'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ వేడుకలో భాగ్యశ్రీ బోర్సే, చిత్ర సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల, కెమెరామేన్ అయనంక బోస్ పాల్గొన్నారు.

అగరబత్తి పొగలు కక్కుతోంది!



● రావు రమేష్

'ఏంటి సుబ్రమణ్యం.. పొద్దున్నే పూజ మొదలు పెట్టావా? అగరబత్తి పొగలు కక్కుతోంది.. ఏ బ్రాండో' అనే డైలాగ్‌తో 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమా ట్రైలర్ ప్రారంభం అవుతుంది. నటుడు రావు రమేష్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించగా, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. డైరెక్టర్ సుకుమార్ సతీమణి తబితా సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలంగాణ, ఏపీలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ విడుదల చేస్తోంది. ఆగస్టు 23న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ని హీరో రామ్ చరణ్ విడుదల చేశారు. 'గోల్డ్ ఫ్లాక్ కింగ్ అని కొత్త బ్రాండ్ అగరబత్తి.. నీ కూతురు వాడుతుంటేనే చూసి కొన్నా'(రావు రమేష్) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

వినోదాల రాంబో



● షమ్ము, అశ్విన్ బాబు, ర్యాప్ రాక్ షకీల్

షమ్ము హీరోగా హరీష్ మధురెడ్డి దర్శకత్వం వహిస్తున్న సినిమాకు 'క్రేజీ రాంబో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సంగీత దర్శకుడు ర్యాప్ రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన 'రాజుగారి గది' మూవీ ఫేమ్ హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ–''క్రేజీ రాంబో' టైటిల్ ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''కామెడీ, యాక్షన్, డ్రామా, రొమాన్స్‌తో కూడిన రోలర్-కోస్టర్ రైడ్‌గా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు షమ్ము. ''మధురెడ్డి చెప్పిన కథ బాగా నచ్చింది. దీంతో మా తమ్ముడు షమ్ము హీరోగా నేనే నిర్మిస్తున్నాను. ఈ చిత్రం వినోదాత్మకంగా ఉంటుంది. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాత, మ్యూజిక్ డైరెక్టర్ ర్యాప్ రాక్ షకీల్.

టీఎఫ్‌సీసీ అధ్యక్షునిగా భరత్ భూషణ్



● భరత్ భూషణ్, దామోదర ప్రసాద్, సి.కల్యాణ్, ప్రసన్న కుమార్

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి(టీఎఫ్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా పి. భరత్ భూషణ్ ఎన్నికయ్యారు. టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా నిర్మాత 'దిల్' రాజు పదవీ కాలం ముగిసింది. దీంతో 2024–2025 సంవత్సరానికి గానూ ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఈసారి అధ్యక్షుడి స్థానం కోసం డిస్ట్రిబ్యూటర్ విభాగం నుంచి భరత్ భూషణ్ (విశాఖపట్టణం), 'ఠాగూర్' మధు (నెల్లూరు) బరిలో నిలవగా పి. భరత్ భూషణ్ ఎన్నికయ్యారు. అలాగే టీఎఫ్‌సీసీ ఉపాధ్యక్ష పదవికి నిర్మాతలు అశోక్ కుమార్, వైవీఎస్ చౌదరి పోటీపడగా అశోక్ కుమార్ గెలిచారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, స్టూడియోల యజమానులు వంటి నాలుగు సెక్టార్స్‌లోని సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పి. భరత్ భూషణ్, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్‌లకు పలువురు సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

7 ఒలింపిక్స్ క్రీడల్లో భారత్‌కు పతకం అందించిన ఏడో మహిళా క్రీడాకారిణిగా మనూ భాకర్ నిలిచింది. ఈ జాబితాలో కరణం మల్లీశ్వరి (వెయిట్‌లిఫ్టింగ్: కాంస్యం-2000 సిడ్నీ), సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్: కాంస్యం-2012 లండన్), మేరీకోమ్ (బాక్సింగ్: కాంస్యం -2012 లండన్), పీవీ సింధు (బ్యాడ్మింటన్: రజతం-2016 రియో. కాంస్యం-2020 టోక్యో), సాక్షి మలిక్ (రెజ్లింగ్: కాంస్యం-2016 రియో), లవ్లీనా బొర్గొహైన్ (బాక్సింగ్: కాంస్యం -2020 టోక్యో) ఉన్నారు.

5 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన ఐదో భారతీయ షూటర్‌గా, తొలి మహిళా షూటర్‌గా మనూ భాకర్ గుర్తింపు పొందింది. గతంలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ (డబుల్ ట్రాప్: రజతం-2004 ఏథెన్స్), అభినవ్ బింద్రా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: స్వర్ణం-2008 బీజింగ్), విజయ్ కుమార్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్: రజతం -2012 లండన్), గగన్ నారంగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: కాంస్యం-2012 లండన్) ఈ ఘనత సాధించారు.

“టోక్యో ఒలింపిక్స్ తర్వాత నేను తీవ్రంగా నిరాశపడ్డాను. దాని నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇప్పుడు కాంస్యం సాధించడం పట్ల సంతోషంగా ఉన్నా. దీనిని మాటల్లో చెప్పలేను. వచ్చే సారి ఇంతకంటే మెరుగైన పతకం గెలుస్తానేమో. చాలా కాలం తర్వాత భారత్‌కు షూటింగ్‌లో మెడల్ రావడం కూడా గొప్పగా అనిపిస్తోంది. ఫైనల్లో ఆఖరి షాట్‌లో కూడా ఎంతో ప్రయత్నించా. ఒక దశలో రజతం సాధించగలనని భావించా. నేను భగవద్గీత చదువుతాను. నేను చేయాల్సింది చేసి ఫలితాన్ని భగవంతునికే వదిలేస్తాను. మీకు ఏం రాసిపెట్టి ఉందో అదే జరుగుతుంది. జరగబోయేది మన చేతుల్లో ఉండదు. మన ప్రయత్నం చేస్తూ అత్యుత్తమ ప్రదర్శన మాత్రమే ఇవ్వగలం. ఈ పతకం కోసం మేం చాలా కష్టపడ్డాం. నాకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. -మనూ భాకర్

మను మురిపించె...

కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ మనూ భాకర్

ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా రికార్డు

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో మూడో స్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ

నేడు మరో రెండు పతకాల రేసులో భారత షూటర్లు రమిత, అర్జున్



గత రెండు ఒలింపిక్స్ క్రీడల్లో మూగబోయిన భారతీయ తుపాకీ ‘పారిస్’లో గర్జించింది. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగి కనీసం ఫైనల్ చేరుకోకుండానే వెనుదిరిగిన మనూ భాకర్... ‘పారిస్’లో మాత్రం చిరస్మరణీయ ప్రదర్శనతో దేశం మొత్తాన్ని మురిపించింది. చెక్కు చెదరని ఏకాగ్రతతో... గురి తప్పని లక్ష్యంతో... ఒక్కో బుల్లెట్‌ను 10 మీటర్ల ముందున్న వృత్తంలోకి పంపిస్తూ... మూడో స్థానాన్ని సంపాదించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో మనూ కొత్త చరిత్రను లిఖించింది. ఒలింపిక్స్ క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా ఈ హరియాణా అమ్మాయి గుర్తింపు పొందింది.

పారిస్: గత చేదు అనుభవాలను వెనక్కి నెట్టి పారిస్ వేదికగా భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్రను లిఖించింది. ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా చరిత్రకెక్కింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో 22 ఏళ్ల మనూ భాకర్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. మనూ భాకర్ 221.7 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని సాధించింది. దక్షిణ కొరియాకు చెందిన జిన్ ఓయె (243.2 పాయింట్లు) స్వర్ణం నెగ్గగా... కిమ్ యెజీ (241.3 పాయింట్లు) రజతం గెలిచింది.

ఫైనల్ సాగిందిలా...

ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో ఫైనల్ జరిగింది. ముందుగా స్టేజ్-1లో ఎనిమిది మంది షూటర్లు 10 షాట్‌లు సంధించారు. 12వ షాట్ తర్వాత స్టేజ్-2లో ఎలిమినేషన్ మొదలైంది. 12 షాట్‌ల తర్వాత తక్కువ పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్న వెరోనికా మాయో (హంగేరి-114 పాయింట్లు) నిష్క్రమించింది. అప్పటికి మనూ 121.2 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. 14వ షాట్ తర్వాత తర్హాన్ (టర్కీ-135.6 పాయింట్లు), 16వ షాట్ తర్వాత రాన్‌జిన్ జియాంగ్ (చైనా-156.5 పాయింట్లు), 18వ షాట్ తర్వాత జుయ్ లీ (చైనా-178.3 పాయింట్లు) వెనుదిరిగారు. 20వ షాట్ తర్వాత త్రిన్ తు విన్ (వియత్నాం -198.6 పాయింట్లు) నాలుగో స్థానంతో నిష్క్రమించడంతో వరుసగా జిన్ ఓయె, కిమ్ యెజీ, మనూ భాకర్ పతకాల రేసులో నిలిచారు. 22వ షాట్ తర్వాత మనూ భాకర్ 221.7 పాయింట్లతో మూడో స్థానంలో... కిమ్ యెజీ 221.8 పాయింట్లతో రెండో స్థానంలో, జిన్ ఓయె 222.6 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నారు. 0.1 పాయింట్ తేడాతో కిమ్ యెజీకంటే మనూ వెనుకబడి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. చివరి రెండు షాట్‌లలో జిన్ ఓయె 10, 10.6 పాయింట్లు... కిమ్ యెజీ 9.7, 9.8 పాయింట్లు స్కోరు చేశారు. దాంతో జిన్ ఓయె 243.2 పాయింట్లతో స్వర్ణాన్ని ఖాయం చేసుకోగా, కిమ్ యెజీ 241.3 పాయింట్లతో రజతం నెగ్గింది.

క్వాలిఫయింగ్‌లో మెరిసి...



పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబూతా... మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫయింగ్‌లో రమితా జిందాల్ టాప్-8లో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. 49 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబూతా 630.1 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. 43 మంది షూటర్లు పోటీపడ్డ మహిళల క్వాలిఫయింగ్‌లో రమితా జిందాల్ 631.5 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఈ విభాగంలోనూ టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

‘మను’సంతా పతకమే!

ఒలింపిక్స్‌లో పడి లేచిన తరంగం మనూ భాకర్

జూలై 25, 2021, టోక్యో... ఫైనల్స్‌కు కూడా అర్హత సాధించకుండా తీవ్ర నిరాశ... పని చేయని తుపాకీతో వేదనగా నిష్క్రమించిన రోజు...

జూలై 28, 2024, పారిస్... ఫైనల్స్‌లో సత్తా చాటి ఒలింపిక్ కాంస్యం గెలుచుకున్న క్షణం... గర్జించిన తుపాకీని గొప్పగా ప్రదర్శించిన రోజు...

అవే ఒలింపిక్స్ క్రీడలు...అదే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్... అదే ప్లేయర్...కానీ తుది ఫలితం మాత్రం భిన్నం...

కానీ ఈ మూడు సంవత్సరాల మూడు రోజుల వ్యవధి ఒక చాంపియన్ ప్లేయర్ కెరీర్‌లో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది... ఓటముల నుంచి పాఠాలు నేర్చుకొని గెలుపు వైపు ఎలా సాగాలో చూపించింది. 22 ఏళ్ల వయసులో మనూ భాకర్ ఇప్పుడు ఒలింపిక్ పతక విజేతగా తానేంటో నిరూపించుకుంది. గత ఒలింపిక్స్ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ సగర్వంగా నిలిచింది.

విజయాలు కొత్త కాదు...

మూడేళ్ల క్రితం మనూ భాకర్ టోక్యో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగింది. 19 ఏళ్ల ఒక అమ్మాయి మెగా ఈవెంట్‌లో మొదటిసారి... అదీ మూడు ఈవెంట్లలో పోటీ పడటం చిన్న విషయం కాదు. కానీ అసాధారణ ప్రతిభతో దూసుకొచ్చిన ఈ షూటర్ అలాంటి అవకాశం సృష్టించుకుంది. నిజానికి అప్పటి వరకు ఆమె సాధించిన ఘనతలే భాకర్‌పై అంచనాలు భారీగా పెంచేశాయి. చివరకు అదే ఒత్తిడి ఆమెను చిత్తు చేసింది. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు వరకు పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకుంది. జూనియర్ వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు, యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, వరల్డ్ కప్‌లలో ఏకంగా తొమ్మిది స్వర్ణాలు... ఇలా ఈ జాబితా చాలా పెద్దది. దాంతో ఇదే జోరులో ఒలింపిక్ పతకం కూడా దక్కుతుందని అంతా ఆశించారు. కానీ అది సాధ్యం కాలేదు. ఇదేదో ఆటలో ఓటమిలా కాదు! క్వాలిఫయింగ్ పోటీల్లో కీలక సమయంలో భాకర్ పిస్టల్ సాంకేతిక సమస్యల కారణంగా పని చేయలేదు. దానిని సరిచేసుకొని వచ్చేసరికి ఆరు నిమిషాల కీలక సమయం వృథా అయింది. అయినా సరే 60 షాట్‌ల ద్వారా 575 పాయింట్లు సాధించడం విశేషం. చివరకు కేవలం రెండు పాయింట్ల తేడాతో ఫైనల్ అవకాశం కోల్పోయిన మను కన్నీళ్లపర్యంతమైంది. ఈ ప్రభావం మరో రెండు ఈవెంట్లపై పడి ఆమె కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయింది.

మళ్లీ మొదలు...

ఒలింపిక్ పతకం ప్రతిభ ఉంటేనే కాదు... ధైర్యం తులకే దక్కుతుంది! శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతో పాటు ఓటమి భారంతో కుంగిపోయిన దశ నుంచి మళ్లీ పైకి లేవడం ఎంతో ధైర్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. గొప్ప గొప్ప ఆటగాళ్లు కూడా ఇలాంటి పరాజయం తర్వాత కుప్పకూలిపోతారు. టోక్యో ఒలింపిక్స్ వైఫల్యం తర్వాత ఇతర షూటర్లు అపూర్వీ చండీలా, అభిషేక్ వర్మ, మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఆమె సహచరుడు సౌరభ్ చౌదరీ మళ్లీ కెరీర్‌లో ముందుకు వెళ్లలేక దాదాపుగా షూటింగ్‌కు దూరమయ్యారు. ఒకదశలో మనూ కూడా అలాగే ఆలోచించింది. షూటింగ్ తనలో ఆసక్తి రేపడం లేదని, ఇక ఆటకు గుడ్‌బై చెప్పి సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవ్వాలని నిర్ణయించుకుంది. కానీ సన్నిహితుల కారణంగా ‘చివరిసారిగా మళ్లీ ప్రయత్నిద్దాం’ అనే ఆలోచన మళ్లీ షూటింగ్‌లో కొనసాగేలా చేసింది. ఈసారి కూడా అంతే స్థాయిలో కఠోర సాధన చేసింది. ఏకాగ్రత చెదరకుండా ఒకే లక్ష్యానికి గురి పెట్టింది. దాంతో మళ్ళీ ఫలితాలు వచ్చాయి. జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు స్వర్ణాలు, ఆసియా క్రీడల్లో స్వర్ణం, వరల్డ్ కప్‌లలో రెండు కాంస్యాలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, కాంస్యాలు దక్కాయి. అయితే పారిస్ క్రీడలకు ముందు గత రికార్డులను ఆమె పట్టించుకోలేదు. తనపై అంచనాలు లేకపోవడమే మంచిదని భావించి ప్రశాంతంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా మెగా ఈవెంట్‌లోకి అడుగు పెట్టి పతకంతో తన విలువను ప్రదర్శించింది.

-సాక్షి క్రీడా విభాగం



కాంస్య పతకంతో మనూ భాకర్

“చారిత్రక విజయం! పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున తొలి పతకం గెలిచిన మనూ భాకర్‌కు అభినందనలు. షూటింగ్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళ కావడం మరింత గర్వకారణం. -నరేంద్ర మోదీ, ప్రధాని

భారత పతకాల బోణీ చేసిన భాకర్‌కు శుభాకాంక్షలు. ఈ విజయం మరింత మంది మహిళలకు స్ఫూర్తి నిస్తుంది. మనూ మరిన్ని ఘనతలు సాధించాలి.
-ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించావు. మనూ... నీ ప్రదర్శనతో దేశం మొత్తం గర్వించేలా చేశావు.
-వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం

నీ అంకితభావం, శ్రమ ఫలించాయి. ప్రతీ షాట్‌తో భారత్ గర్వపడేలా చేశావు. నీ పట్టుదలకు ఈ పతకం ఉదాహరణ. -అభినవ్ బింద్రా”

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కాం	మొ
ఆస్ట్రేలియా	4	2	0	6
ద.కొరియా	3	2	1	6
చైనా	3	1	1	5
జపాన్	3	1	1	5
ఫ్రాన్స్	2	2	2	6
అమెరికా	1	3	2	6
భారత్	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సింధు అలవోకగా...



‘హ్యాట్రిక్’ ఒలింపిక్ పతకం లక్ష్యంతో ‘పారిస్’కు వచ్చిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. ఆదివారం మహిళల సింగిల్స్ గ్రూప్ ‘ఎమ్’ తొలి రౌండ్‌లో సింధు 21-9, 21-6తో ఫాతిమత్ (మాల్దీవులు)పై ఏకపక్ష విజయం సాధించింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు పూర్తి ఆధిపత్యం కనబర్చింది. ‘మంచి ఆరంభం లభించడం సంతోషంగా ఉంది. మూడేళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో బరిలోకి దిగడంతో పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి ప్రయత్నించా. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌తో పోల్చుకుంటే ఇవి పూర్తిగా భిన్నం’ అని సింధు వ్యాఖ్యానించింది. బుధవారం జరగనున్న రెండో రౌండ్‌లో ప్రపంచ 75వ ర్యాంకర్ క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా)తో 13వ ర్యాంకర్ సింధు తలపడనుంది. మహిళల డబుల్స్ గ్రూప్ ‘సి’ తొలి రౌండ్ మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ 18-21, 10-21తో కిమ్ సో యాంగ్-కాంగ్ హీ యాంగ్ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ గ్రూప్ ‘కే’ తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-18, 21-12తో ఫాబియన్ రోథ్ (జర్మనీ)పై విజయం సాధించాడు.



శ్రీజ శుభారంభం

టేబుల్ టెన్నిస్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో శ్రీజ 11-4, 11-9, 11-7, 11-8తో క్రిస్టియానా క్లైబెర్గ్ (స్వీడన్)పై విజయం సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో 18వ సీడ్ మనిక బత్రా 11-8, 12-10, 11-9, 9-11, 11-5తో అన్నా హర్సే (ఇంగ్లండ్)పై గెలిచి ముందంజ వేసింది. తదుపరి రౌండ్‌లో 12వ సీడ్ ప్రీతిక పవాడే (ఫ్రాన్స్)తో మనిక తలపడనుంది.

శరత్ కమల్‌కు షాక్

ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ భారత వెటరన్ టీటీ స్టార్ ఆచంట శరత్ కమల్ నిరాశ పరిచాడు. 42 ఏళ్ల శరత్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రపంచ 40వ ర్యాంకర్ శరత్ 12-10, 9-11, 6-11, 7-11, 11-8, 10-12తో 126వ ర్యాంకర్ డేనీ కోజుల్ (స్లొవేనియా) చేతిలో ఓటమి పాలయ్యాడు.

క్వార్టర్స్‌లో బల్‌రాజ్



రోయింగ్‌లో భారత ప్లేయర్ బల్‌రాజ్ పన్వర్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ స్కల్స్ రెపిచేజ్ రెండో రౌండ్‌లో ఆదివారం బల్‌రాజ్ రెండో స్థానంలో నిలిచి ముందంజ వేశాడు. 7 నిమిషాల 12.41 సెకన్లలో పన్వర్ లక్ష్యాన్ని చేరాడు. క్వెంటిన్ ఆటోగ్నెల్లీ (మొనాకో; 7 నిమిషాల 10 సెకన్లలో) టాప్ ప్లేస్‌లో నిలిచాడు. రెపిచేజ్ రౌండ్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన రోవర్లు మంగళవారం క్వార్టర్‌ఫైనల్లో తలపడనున్నారు.

మన స్విమ్మర్లు హీట్స్‌లోనే...

స్విమ్మింగ్‌లో భారత పోరాటం ముగిసింది. పురుషుల విభాగంలో రెండోసారి ఒలింపిక్స్‌లో పాల్గొన్న శ్రీహరి నటరాజ్, మహిళల విభాగంలో ధీనిధి డెసింగు సెమీఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ హీట్‌లో శ్రీహరి 55.01 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఓవరాల్‌గా 33వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఒక్కో హీట్ నుంచి తొలి 16 స్థానాల్లో నిలిచిన వాళ్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. మహిళల విభాగంలో అనూహ్యంగా ఒలింపిక్ బెర్త్ దక్కించుకున్న 14 ఏళ్ల ధీనిధి 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో 2 నిమిషాల 6.96 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 23వ స్థానంలో నిలిచింది.

నన్ను క్షమించండి గురువుగారూ..!



2008 బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా (ఎడమ వైపు), తన కోచ్ జస్పాల్ రాణాలతో మనూ భాకర్

మనూ భాకర్ కెరీర్‌లో రెండు వేర్వేరు సందర్భాలు ఆమె ప్రస్థానంలో కీలకంగా నిలిచాయి. 2018-2019 సమయంలో మనూ వరుస విజయాలతో అద్భుత ఫామ్‌లో ఉంది. ఆ సమయంలో భారత జట్టు (పిస్టల్)కు మాజీ ఆటగాడు జస్పాల్ రాణా కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆ సమయంలో 17 ఏళ్ల ఒక టీనేజర్ ఎలా దుందుడుగా, ఆవేశంగా ఉంటారో భాకర్ కూడా అదే తరహా మానసిక స్థితిలో ఉంది. రాణా కఠినమైన కోచింగ్ శైలి నచ్చక ఆమె బహిరంగంగానే చిన్న చిన్న విమర్శలు చేస్తూ వచ్చింది. కొంత కాలం తర్వాత ఇది మరింత పెరిగింది. మనూ వేర్వేరు ఈవెంట్లలో ఆడితే ఆమె విఫలమయ్యే అవకాశం ఉందని 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌పైనే దృష్టి పెట్టాలంటూ రాణా సూచించాడు. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో మరో షూటర్ చింకీ యాదవ్‌ను ప్రోత్సహించడాన్ని భాకర్ వ్యక్తిగతంగా తీసుకొని కోచ్‌పై మరింత ఆగ్రహాన్ని పెంచుకుంది. చివరకు టోక్యో ఒలింపిక్స్‌కు కొన్ని నెలల ముందు ఢిల్లీ వరల్డ్ కప్‌లో ఇది పూర్తిగా బయటపడింది. 10 మీటర్ల ఈవెంట్‌లో చింకీ స్వర్ణం గెలవగా, మనూ కాంస్యానికే పరిమితమైంది. దాంతో మనూ ‘ఆనందం దక్కింది కదా... మీ అహానికి అభినందనలు’ అంటూ రాణాకు మెసేజ్ చేసింది. ఆ వాక్యాలను రాణా తన టీషర్ట్‌పై వెనుక భాగంలో రాసుకొని మైదానమంతా తిరిగాడు. దాంతో మనూతో అక్కడే అన్ని సంబంధాలు ముగిసిపోయాయి! కాలక్రమంలో రెండేళ్లు గడిచాయి. ఏడాది క్రితం మనూలో కొత్త మథనం మొదలైంది. తాను ఒలింపిక్ పతకం గెలవాలంటే సరైన దారి మళ్లీ సరైన కోచ్‌ను ఎంచుకోవడమే అనిపించింది. ఎంతో మథనం తర్వాత రాణాకు ‘సర్...నాకు మీరు మళ్లీ కోచింగ్ ఇస్తారా’ అని మెసేజ్ చేసింది. ఒక పెద్దన్న తరహాలో రాణా కూడా స్పందించాడు. గత అనుభవాన్ని మనసు లోంచి తీసేసి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. సంవత్సర కాలంలో తనదైన శైలిలో ఆమెకు కోచింగ్‌తో పాటు ఇతర అన్ని సన్నాహకాల్లో అండగా నిలుస్తూ ఇప్పుడు ఒలింపిక్ పతకం వరకు తీసుకొచ్చాడు. వారి సన్నాహాల్లో ఒక ఆసక్తికర అంశం ఉంది. లక్ష్యంగా పెట్టుకున్న పాయింట్లు సాధించలేనప్పుడు తగ్గిన పాయింట్లలో ఒక్కో పాయింట్‌కు 10 యూరోల చొప్పున జరిమానా విధించి దానిని అక్కడి పేదవారికి దానం చేయాలనేది ఒక షరతు! ఇప్పుడూ భాకర్ వయసు 22 ఏళ్లే... కానీ గతంతో పోలిస్తే ఎంతో పరిపక్వతతో వ్యవహరించిన ఆమె విజయానికి బాటలు వేసుకుంది. పతకం కోసం పోటీ పడిన సమయంలో జనంలో కూర్చొని ఉన్న రాణాను చూస్తూ ధైర్యం తెచ్చుకున్నానని, తమ శ్రమ ఫలితాన్నందించిందన్న మనూ... రాణాకు తాను ఎంతో రుణపడి ఉన్నానని చెప్పడం విశేషం.

-సాక్షి క్రీడా విభాగం

నాన్న అండతో...

హరియాణాలోని ఝఝర్ జిల్లా గోరియా మనూ భాకర్ స్వస్థలం. తండ్రి రామ్‌కిషన్ భాకర్ మర్చంట్ నేవీలో చీఫ్ ఇంజినీర్. చిన్నప్పటి నుంచి ఆయన తన కూతురు ఆసక్తి కనబర్చిన ప్రతీ చోటా ప్రోత్సహించాడు. టెన్నిస్, స్కేటింగ్, మార్షల్ ఆర్ట్స్...ఇలా అన్నీ ఆడించాడు. ఒకదశలో బాక్సింగ్‌పై బాగా ఆసక్తి కనబర్చి ఎక్కువ సమయం ఈ గేమ్‌పై దృష్టి పెట్టింది. కానీ 14 ఏళ్ల వయసు వచ్చేసరికి ఇదీ నచ్చలేదు. చివరకు తండ్రికి చెప్పి షూటింగ్ వైపు మరలగా... ఆయన ఇక్కడా వద్దనలేదు. కేవలం రెండేళ్ల శిక్షణ, సాధనతో షూటింగ్‌లో మనూ దూసుకుపోవడం విశేషం. 15 ఏళ్ల వయసులో జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో అగ్రశ్రేణి షూటర్ హీనా సిద్ధూను ఓడించి సంచలనం సృష్టించడంతో పాటు ఈ టోర్నీలో ఏకంగా తొమ్మిది స్వర్ణాలు సాధించడంతో అందరి దృష్టి భాకర్‌పై పడింది. ఆ తర్వాత 16 ఏళ్ల వయసులో మెక్సికోలో జరిగిన వరల్డ్ కప్‌లో స్వర్ణం గెలుచుకొని పిన్న వయసులో ఈ ఘనత సాధించిన షూటర్‌గా నిలిచిన తర్వాత మనూ కెరీర్ బుల్లెట్‌లా దూసుకుపోయింది.



పారిస్‌లో భారతీయం

మూడో రోజు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ

పురుషుల టీమ్ క్వార్టర్ ఫైనల్: తరుణ్‌దీప్ రాయ్, బొమ్మదేవర ధీరజ్, ప్రవీణ్ జాధవ్ (సాయంత్రం గం. 6:30 నుంచి).

హాకీ

పురుషుల పూల్ ‘బి’ మ్యాచ్: భారత్ X అర్జెంటీనా (సాయంత్రం గం. 4:15 నుంచి)

టేబుల్ టెన్నిస్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్: ఆకుల శ్రీజ X జియాన్ జెంగ్ (సింగపూర్) (రాత్రి గం. 11:30 నుంచి).

బ్యాడ్మింటన్

పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి X మార్క్ లామ్స్‌ఫస్-మార్విన్ సైడెల్ (జర్మనీ) (మధ్యాహ్నం గం. 12:00 నుంచి). మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప-తనిషా క్రాస్టో X నామీ మాసుయమా-చిహారు షిదా (జపాన్) (మధ్యాహ్నం గం. 12:50 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్: లక్ష్యసేన్ X కరాగి(బెల్జియం) (సాయంత్రం గం. 5:30 నుంచి).

షూటింగ్

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్: మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్; రిథమ్ సాంగ్వాన్, అర్జున్ సింగ్ చీమా (మధ్యాహ్నం గం. 12:45 నుంచి). పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్: పృథ్వీరాజ్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి).

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఫైనల్: రమితా జిందాల్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి). 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల ఫైనల్: అర్జున్ బబుతా (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,293	81,333
నిఫ్టీ ▲	429	24,835

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,358	▲	176
డోజోన్స్	40,589	▲	654
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,286	▲	99
డాక్స్	18,418	▲	119
హాంగ్‌సెంగ్	2,891	▲	4
నికాయ్	37,667	▼	202

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.55	109.12
€	యూరో	ఎస్‌బీఐ	89.84	92.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.91	55.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.96	55.88
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.04	64.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.68	12.50

ఆదాయపన్ను.. ఆదా ఎలా!



- మినహాయింపులు వినియోగించుకుంటే పాత విధానమే మెరుగు
- రూ.10.5 లక్షల వరకు పన్ను కట్టక్కర్లేదు
- క్లెయిమ్ చేసుకోని వారికి కొత్త విధానం అనుకూలం
- అయోమయం, గందరగోళం ఉండదు
- ఆదాయం, పెట్టుబడుల ఆధారంగానే నిర్ణయం
- రిటర్నుల సమయంలో ఏ విధానమో ఎంపిక తప్పనిసరి







ఆదాయపన్ను పాత, కొత్త విధానాల్లో ఏది అనుకూలం? ఎక్కువ మందిని వేధిస్తున్న సందేహం ఇది. 2024–25 కేంద్ర బడ్జెట్‌లో కొన్ని సవరణలు ప్రతిపాదించడం ద్వారా ఎక్కువ మందిని నూతన పన్ను విధానం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారు విత్త మంత్రి. శ్లాబుల పరిమితుల్లో మార్పులతోపాటు.. స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా పెంచారు. దీనివల్ల కొత్త విధానంలో రూ.17,500 వరకు ఆదా చేసుకోవచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమయంలో ప్రకటించారు. కానీ, పాత పన్ను వ్యవస్థలో వివిధ సెక్షన్ల కింద పన్ను ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకుంటే ఇంతకంటే ఎక్కువే ఆదా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తక్కువ, అధిక ఆదాయం పరిధిలోని వారికి నూతన పన్ను విధానమే అనుకూలమన్నది విశ్లేషకుల నిర్వచనం. మధ్యాదాయ వర్గాలకు, మినహాయింపు ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకుంటే పాత విధానం అనుకూలం. తమ ఆదాయం, పెట్టుబడులు తదితర వివరాల ఆధారంగానే తమకు ఏది అనుకూలమన్నది నిర్ణయించుకోగలరు. ఇందుకు సంబంధించిన వివరాలను అందించే ప్రాఫిట్ ప్లస్ కథనం ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పాత పన్ను విధానం

ఆదాయ శ్లాబు (రూ.లలో)	పన్నురేటు (శాతంలో)
2,50,000	పన్ను లేదు
2,50,001-5,00,000	5 శాతం
5,00,001-10,00,000	20
10,00,001 అంతకుపైన	30

- రూ.5 లక్షల వరకు ఆదాయంపై 87ఏ కింద రిబేట్ ఉంది. దీంతో 60 ఏళ్ల వయసులోని వారికి రూ.50వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.5.50 లక్షల వరకు పన్ను చెల్లించక్కర్లేదు.
- 60–80 ఏళ్ల వయసులోని వారికి రూ.3 లక్షల వరకు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటే కనీస పన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటారు.

కొత్త విధానంలో తాజా మార్పులు

నూతన విధానంలో 5 శాతం పన్ను, 10 శాతం పన్ను శ్లాబుల్లో రూ.లక్ష చొప్పున అదనంగా పరిమితి పెంచారు. అలాగే నూతన విధానంలో వేతన జీవులు, పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచారు.

- నూతన విధానంలో మొదటి రూ.3లక్షల్లోపు ఆదాయం ఉంటే పన్ను పరిధిలోకి రారు.
- స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి చూసుకుంటే రూ.7.75 లక్షల ఆదాయం దాటని వేతన జీవులు, పెన్షనర్లు రూపాయి పన్ను చెల్లించక్కర్లేదు. రూ.3–7లక్షల ఆదాయంపై సెక్షన్ 87ఏ కింద రిబేట్ అమల్లో ఉంది. దీనికి రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్ అదనం. ఫ్యామిలీ పెన్షన్ తీసుకుంటున్న వారికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.15,000 ఉంటే రూ.25,000 చేశారు. అంటే ఫ్యామిలీ పెన్షన్ తీసుకునే వారు రూ.7,25,000 లక్షల ఆదాయం వరకు పన్ను చెల్లించక్కర్లేదు.

నూతన పన్ను విధానంలో మార్పులు

ఆదాయ శ్లాబు (రూ.లలో)	ప్రస్తుత రేటు (శాతంలో)	కొత్త శ్లాబు	ప్రతిపాదిత రేటు (శాతంలో)	మార్పు
3,00,000 వరకు	పన్ను లేదు	--	మార్పులేదు	--
3,00,000-6,00,000	5	3,00,000-7,00,000	5	పరిమితిని లక్ష మేర పెంచారు
6,00,001-9,00,000	10	7,00,001-10,00,000	10	పరిమితిని లక్ష మేర పెంచారు
9,00,001-12,00,000	15	10,00,001-12,00,000	15	10లక్షల నుంచి మొదలవుతుంది
12,00,001-15,00,000	20	12,00,001-15,00,000	20	ఎలాంటి మార్పు లేదు
15,00,001, అంతకుపైన	30	మార్పు లేదు	30	మార్పు లేదు



మినహాయింపులు

- నూతన పన్ను విధానంలో కేవలం కొన్ని మినహాయింపులే ఉన్నాయి. సెక్షన్ 80సీసీడీ(2) కింద ఎన్‌పీఎస్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఉద్యోగితోపాటు, ఉద్యోగి తరఫున సంస్థలు ఈపీఎఫ్ చందాలను జమ చేస్తుండడం తెలిసిందే. అదే విధంగా ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాకు సైతం సంస్థలు జమ చేయవచ్చు. ఉద్యోగి మూల వేతనం, కరువు భత్యంలో 10 శాతం గరిష్ఠ పరిమితి ఇప్పటి వరకు ఉంటే, దీన్ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 14 శాతం చేశారు. కనుక ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతా తెరిచి, సంస్థ ద్వారా అందులో జమ చేయించుకోవడం ద్వారా అదనపు పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు.
- సెక్షన్ 24 కింద నూతన పన్ను విధానంలోనూ ఇంటి రుణంపై పన్ను ప్రయోజనం ఉంది. కాకపోతే ఆ ఇంటిని అద్దెకు ఇవ్వాలి. అప్పుడు ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించే వడ్డీ మొత్తంపైనా పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.
- కన్వేయన్స్ అలవెన్స్, సెక్షన్ 10(10సీ) కింద స్వచ్ఛంద పదవీ విరమణ ప్రయోజనం గరిష్ఠంగా రూ.5లక్షలు, సెక్షన్ 10(10) కింద గ్రాట్యుటీ రూ.20లక్షలపైనా పన్ను లేదు.
- ఉద్యోగి రాజీనామా లేదా పదవీ విరమణ సమయంలో సెలవులను నగదుగా మార్చుకోవడం వల్ల వచ్చే మొత్తం రూ.25 లక్షలపైనా సెక్షన్ 10(10) పన్ను లేదు.

నిపుణులు ఏమంటున్నారు?

ఎంత మేర పన్ను తగ్గింపులు, మినహాయింపులు క్లెయిమ్ చేసుకుంటారన్న అంశం ఆధారంగానే పాత, కొత్త పన్ను విధానంలో ఏది ఎంపిక చేసుకోవాలన్నది ఆధారపడి ఉంటుంది. ఒక పేపర్‌పై తమ ఆదాయం, పెట్టుబడులు, బీమా ప్రీమియం వివరాలను నమోదు చేసుకుని, హెచ్‌ఆర్‌ఏ లెక్క తేల్చిన అనంతరం ఏ విధానం అనుకూలమో నిర్ణయించుకోవాలి. మొత్తం ఆదాయంలో ఎంత మేర పన్ను తగ్గింపులను క్లెయిమ్ చేసుకుంటున్నారు, ఏ విధానం అనుకూలమో స్పష్టత తెచ్చుకున్న తర్వాతే రిటర్నుల దాఖలుకు ముందుకు వెళ్లాలి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల మేర ఇన్వెస్ట్ చేస్తూ.. ఇంటి రుణం, విద్యా రుణం తీసుకుని చెల్లింపులు చేస్తూ.. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంతోపాటు, హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అధిక ఆదాయ శ్లాబుల్లో ఉన్న వారికి సైతం పాత విధానమే మెరుగని షేర్ డాట్ మార్కెట్ బిజినెస్ హెడ్ వైభవ్ జైన్ తెలిపారు. ఈ క్లెయిమ్‌లు చేసుకోని వారికి కొత్త విధానాన్ని సూచించారు. నూతన విధానంలో పెద్దగా పన్ను ప్రయోజనాలు లేకపోయినా సరే.. కొత్తగా ఉద్యోగంలో చేరి, రూ.7 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి ఎంతో ప్రయోజనమని ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ లోహిత్ భాటియా తెలిపారు.

ఎంపికలో స్వేచ్ఛ..

ఆదాయపన్ను రిటర్నులు వేసే సమయంలో కొంత శ్రద్ధ వహించక తప్పదు. ఎందుకంటే కొత్త పన్ను విధానమే డిఫాల్ట్‌గా ఎంపికై ఉంటుంది. నూతన విధానంలోనే రిటర్నులు వేసే వారు అన్ని వివరాలు నమోదు చేసి సమర్పించొచ్చు. పాత విధానంలో కొనసాగాలనుకుంటే కచ్చితంగా 'నో ఫర్ ఆప్టింగ్ అండర్ సెక్షన్ 115బీఏసీ'' అని సెలక్ట్ చేసుకోవాలి. వేతన జీవులు ఏటా రిటర్నులు వేసే సమయంలో రెండు పన్ను విధానాల్లో తమకు అనుకూలమైనది ఎంపిక చేసుకోవచ్చు. వ్యాపార ఆదాయం ఉంటే మాత్రం ఇలా ఏదో ఒకటి ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లేదు. వీరు పాత విధానంలోనే కొనసాగదలిస్తే ఫారమ్ 10–ఐఈఏ సమర్పించాలి. కాకపోతే జీవితంలో ఒక్కసారి మాత్రం నూతన పన్ను విధానానికి మారిపోయే ఆప్షన్ ఉంటుంది. ఒక్కసారి ఈ అవకాశం వినియోగించుకుని నూతన విధానంలోకి మారితే, తిరిగి పాత విధానంలోకి వెళ్లే అవకాశం ఉండదు. ఇప్పటికే 66 శాతం మేర నూతన పన్ను విధానంలో రిటర్నులు వేస్తున్నట్టు సీబీడీటీ చెబుతోంది.

మినహాయింపులు

- గృహ రుణం తీసుకుని దాని అసలుకు ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా చెల్లించే రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను లేదు.
- సెక్షన్ 24(బి) కింద గృహరుణం వడ్డీకి చెల్లించే మొత్తం రూ.2లక్షల వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ రుణంపై కొనుగోలు చేసిన ఇంటిని వేరొకరికి అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయం నుంచి.. రుణానికి చెల్లించే వడ్డీ మొత్తాన్ని మినహాయించుకోవచ్చు.
- సెక్షన్ 80ఈఈ కింద మొదటిసారి ఇంటిని రుణంపై సమకూర్చుకున్న వారు ఏటా రూ.50,000 అదనపు మొత్తాన్ని వడ్డీ చెల్లింపుల నుంచి మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ కొనుగోలు చేసిన ఇంటి ధర రూ.45 లక్షల్లోపు ఉంటే ఈ పరిమితి సెక్షన్ 80ఈఈఏ కింద రూ.1.50లక్షలుగా ఉంది.
- సెక్షన్ 80సీ కింద గరిష్ఠంగా రూ.1.5 లక్షల ఆదాయపన్ను మినహాయింపు కోసం.. జీవిత బీమా ప్రీమియం చెల్లింపులతోపాటు, సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, పీపీఎఫ్, ఐదేళ్ల ట్యాక్స్‌ఫ్రీ బ్యాంక్ ఎఫ్‌డీ, ఈఎల్‌ఎస్‌ఎస్, యులిప్ ప్లాన్‌లో పెట్టుబడులు, పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులను చూపించుకోవచ్చు.
- పెన్షన్ ప్లాన్‌లో (ఎన్‌పీఎస్)లో పెట్టుబడికి సైతం గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీసీడీ(1) కింద మినహాయింపు పొందొచ్చు. కాకపోతే సెక్షన్ 80సీలో భాగంగానే ఇదీ ఉంటుంది. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000 వరకు అదనంగా ఎన్‌పీఎస్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనం ఉంది. అంటే మొత్తం రూ.2లక్షలు.
- సెక్షన్ 80డీ కింద హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెల్లించే ప్రీమియం గరిష్ఠంగా రూ.25,000 మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ60 ఏళ్లలోపు తల్లిదండ్రులకు ప్రీమియం చెల్లిస్తుంటే, మరో రూ.25,000 మొత్తంపైనా పన్ను మినహాయింపు పొందొచ్చు. 60 ఏళ్లు నిండిన వారికి హెల్త్ ప్రీమియం రూ.50,000 వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వ్యాధి నివారణ పరీక్షల కోసం చేసే వ్యయాలు రూ.5,000పైనా అదనపు పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది. హెల్త్ ఇన్సూరెన్స్ లేని తల్లిదండ్రుల వైద్య చికిత్సల కోసం చేసే వ్యయం రూ.50,000 మొత్తంపైనా పన్ను మినహాయింపు కోరొచ్చు.
- సెక్షన్ 80డీడీబీ కింద కేన్సర్, డిమెన్షియా తదితర తీవ్ర వ్యాధుల్లో చికిత్సలకు చేసే వ్యయాలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. 60 ఏళ్లలోపు వారికి రూ.40వేలు కాగా, అంతకుమించిన వయసు వారి చికిత్స కోసం ఈ పరిమితి రూ.లక్షగా ఉంది.
- బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80 టీటీఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. సెక్షన్ 80టీటీబీ కింద 60 ఏళ్లు నిండిన వారికి బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ పరిమితి రూ.50,000గా ఉంది.
- సెక్షన్ 80ఈ కింద ఉన్నత విద్య కోసం తీసుకున్న రుణానికి చేసే వడ్డీ చెల్లింపులపై పూర్తి పన్ను మినహాయింపు తీసుకోవచ్చు. 8 ఏళ్లపాటు ఈ ప్రయోజనం ఉంటుంది.
- అద్దె ఇంట్లో ఉంటూ, పనిచేస్తున్న సంస్థ నుంచి ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) పొందే వారు, ఆ మొత్తంపై సెక్షన్ 10(13ఏ) కింద పన్ను ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. 1. పనిచేస్తున్న సంస్థ నుంచి ఒక ఏడాదిలో పొందిన వాస్తవ హెచ్‌ఆర్‌ఏ మొత్తం. 2. వాస్తవంగా చెల్లించిన అద్దె నుంచి తమ వార్షిక వేతనంలో 10 శాతాన్ని తీసివేయగా మిగిలిన మొత్తం. 3. మెట్రోల్లో నివసించే వారి మూల వేతనంలో 50 శాతం/ పల్లెల్లో నివసించే వారు అయితే మూల వేతనంలో 40 శాతం. ఈ మూడింటిలో ఏది తక్కువ అయితే అంత మేర తమ ఆదాయంపై పన్ను చెల్లించక్కర్లేదు. ఉదాహరణకు హైదరాబాద్‌లో నివసించే శ్రీరామ్ నెలవారీ స్థూల వేతనం రూ.50,000 (సంవత్సరానికి రూ.6లక్షలు). అతడి మూలవేతనం, డీఏ కలిపి రూ.30,000. హెచ్‌ఆర్‌ఏ కింద సంస్థ ప్రతినెలా రూ.10,000 ఇస్తోంది. కానీ శ్రీరామ్ రూ.12,000 కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. ఈ ఉదాహరణలో శ్రీరామ్ రూ.84,000ను హెచ్‌ఆర్‌ఏ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు.
- ఇంకా సెక్షన్ 80సీ కింద గుర్తింపు పొందిన సంస్థలకు విరాళాలతోపాటు మరికొన్ని మినహాయింపు ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

పాత/కొత్త విధానాల్లో ఏది లాభం?

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	59,800	0	59,800
15,00,000	2,57,400	1,30,000	1,27,400
25,00,000	5,69,400	4,34,200	1,35,200
30,00,000	7,25,400	5,90,200	1,35,200
50,00,000	13,49,400	12,14,200	1,35,200

నోట్: పాత, కొత్త విధానాల్లో స్టాండర్డ్ డిడక్షన్ ఒక్కటే క్లెయిమ్ చేసుకునే వారికి సంబంధించి గణాంకాలు ఇవి.

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	28,600	0	28,600
15,00,000	2,10,600	1,30,000	80,600
25,00,000	5,22,600	4,34,200	88,400
30,00,000	6,78,600	5,90,200	88,400
50,00,000	13,02,600	12,14,200	88,400

నోట్: పాత విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలతోపాటు స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనాన్ని వినియోగించుకుంటే వచ్చే వ్యత్యాసం ఇది.

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	0	0	0
15,00,000	1,17,000	1,30,000	-13,000
25,00,000	3,66,600	4,34,200	-78,000
30,00,000	4,91,400	5,90,200	-98,800
50,00,000	9,90,600	12,14,200	-2,23,600

నోట్: పాత విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలతోపాటు, స్టాండర్డ్ డిడక్షన్, హెచ్‌ఆర్‌ఏ, ఇతర వేతన అలవెన్స్‌ల ప్రయోజనం కలిపి స్థూల వేతనంలో 20 శాతం మేర క్లెయిమ్ చేసుకునేట్టు అయితే వచ్చే.. వ్యత్యాసం ఇది. ఈ టేబుల్ చివరి వరుసలో మైనస్ రూపంలో ఉన్న మొత్తం పాత విధానంలో కొనసాగడం వల్ల వచ్చే నికర ప్రయోజనం

నోట్: మూడు టేబుళ్లలో ఉన్న గణాంకాలు 60ఏళ్లలోపువారికి ఉద్దేశించినవి.



ఏది ప్రయోజనం..?

- కేవలం స్టాండర్డ్ డిడక్షన్ వరకే క్లెయిమ్ చేసుకునేట్లయితే రూ.7,75,000 లక్షల్లోపు ఆదాయం ఉన్న వేతన జీవులు, పెన్షనర్లకు నిస్సందేహంగా నూతన విధానమే మెరుగని ఇక్కడి టేబుల్ చూస్తే అర్థమవుతుంది. స్వయం ఉపాధి, ఇతరులకు రూ.7లక్షల వరకు నూతన విధానంలో పన్ను లేదు. పాత విధానంలో అయితే స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని రూ.5.50లక్షల మొత్తంపై వేతన జీవులు, పెన్షనర్లకు పన్ను వర్తించదు. ఆ తర్వాత ఆదాయంపై 20% పన్ను పడుతోంది.
- రూ.7,75,000 ఆదాయం కలిగి.. పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేలతోపాటు, సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.7 లక్షల వరకే పన్ను ఆదాయంపై మినహాయింపులను క్లెయిమ్ చేసుకునే వారికీ నూతన పన్ను విధానం లాభం.
- రూ.7 లక్షలకు మించకుండా ఆదాయం కలిగిన వారు పాత విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ సహా రూ.2లక్షలకు పైన పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అందులో కొనసాగొచ్చు. క్లెయిమ్ చేసుకోలేని వారికి కొత్త విధానం నయం.
- అలాగే, రూ.11 లక్షల ఆదాయం కలిగిన వారు రూ.3,93,700కు మించి పన్ను మినహాయింపులు (స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని) క్లెయిమ్ చేసుకున్నప్పుడే పాత విధానం ప్రయోజనకరం.
- రూ.16 లక్షల పన్ను ఆదాయం కలిగిన వారు రూ.4,83,333కు మించి పన్ను మినహాయింపులు (స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని) క్లెయిమ్ చేసుకున్నప్పుడే పాత విధానం ప్రయోజనకరం.
- రూ.50వేల స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు, 24(బీ) కింద గృహ రుణ వడ్డీ రూ.2 లక్షలు, హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనం రూ.80వేలు (రూ.50వేల వేతనంపై సుమారు), హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.25వేలు, ఎన్‌పీఎస్ పెట్టుబడి రూ.50వేలను క్లెయిమ్ చేసుకుంటే పాత విధానంలో నికరంగా రూ.10.55 లక్షల ఆదాయంపై పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఉండదు.

రెండింటిలోనూ సేమ్ ట్యాక్స్

స్థూల ఆదాయం (రూ.లలో)	చేసుకోవాల్సిన క్లెయిమ్	పాత, కొత్త విధానంలో చెల్లించాల్సిన పన్ను
7,75,000	3,25,000	0
10,00,000	3,50,000	44,200
12,50,000	4,31,250	79,300
15,75,000	4,83,333	1,45,600
20,00,000	4,83,333	2,78,200

నోట్: ఉదాహరణకు రూ.10లక్షల స్థూల ఆదాయం ఉన్న వ్యక్తి రూ.3,50,000 పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే చెల్లించాల్సిన నికర పన్ను రూ.44,200. కొత్త విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ మినహా ఎలాంటి క్లెయిమ్‌లు చేసుకోపోయినా చెల్లించాల్సిన పన్ను మొత్తం రూ.44,200.

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్

32.72 శాతం వాటా కొనుగోలు

- డీల్ విలువ రూ. 3,954 కోట్లు
- 55 శాతానికి అల్ట్రాటెక్ వాటా
- మరో 26% వాటాకు ఓపెన్‌ఆఫర్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా ఇండియా సిమెంట్స్ లిమిటెడ్(ఐసీఎల్)లో 32.72 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. సంస్థ ప్రమోటర్ల నుంచి రూ. 3,954 కోట్లకు ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ దిగ్గజం వాటాను సొంతం చేసుకోనుంది. అంతేకాకుండా పబ్లిక్ వాటాదారుల వద్ద నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించింది. తద్వారా తీవ్ర పోటీతోపాటు.. వేగవంత వృద్ధిలోనున్న దక్షిణాది(ప్రధానంగా తమిళనాడు) మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించేందుకు అల్ట్రాటెక్‌కు వీలు చిక్కనుంది. కాగా.. దేశీ సిమెంట్ రంగంలో మరింత పోటీకి తెరతీస్తూ హైదరాబాద్ కంపెనీ పెన్నా సిమెంట్‌ను రూ. 10,422 కోట్లకు అదానీ గ్రూప్ సొంతం చేసుకున్న నెల రోజుల తదుపరి అల్ట్రాటెక్ సైతం సిమెంట్ కంపెనీ కొనుగోలుకి తెరతీయడం ప్రాధాన్యతను సంతరించుకుంది!

షేరుకి రూ. 390

షేరుకి రూ. 390 చొప్పున ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్లు, సహచరుల వాటాను కొనుగోలు చేయనున్నట్లు అల్ట్రాటెక్ తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ప్రమోటర్లు ఎస్.శ్రీనివాసన్, చిత్ర, రూపా గురునాథ్, ఎస్కే అశోక్ బాలాజీ నుంచి 28.42 శాతం, శ్రీ శారదా లాజిస్టిక్స్ నుంచి 4.3 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఇందుకు బోర్డు ఆమోదించినట్లు వెల్లడించింది. తాజా డీల్‌తో ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 55 శాతానికి జంప్ చేయనుంది. దీంతో సెబీ నిబంధనల ప్రకారం పబ్లిక్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. దీనిలో భాగంగా షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల ఈక్విటీ షేర్లను వాటాదారుల నుంచి కొనుగోలు చేయనుంది. వారాంతాన ఐసీఎల్ షేరు రూ. 374.6 వద్ద ముగిసింది. ఈ ధరతో పోలిస్తే ఓపెన్ ఆఫర్ ధర 4 శాతం అధికం. 26 శాతం వాటాకు అల్ట్రాటెక్ రూ. 3,142 కోట్లు వెచ్చించవలసి ఉంటుంది. కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతి తదుపరి ఐసీఎల్‌కు అల్ట్రాటెక్ ప్రమోటర్‌గా అవతరించనుంది.

తొలుత ఇన్వెస్టర్‌గా..

మొత్తం 14.45 ఎంటీపీఏ సామర్థ్యంగల ఐసీఎల్‌లో ఈ ఏడాది జూన్‌లో అల్ట్రాటెక్ ఇన్వెస్టర్‌గా రెండు బ్లాక్ డీల్స్ ద్వారా 23 శాతం వాటాను చేజిక్కించుకుంది. డీమార్ట్ ప్రమోటర్లు దమానీ కుంటుంబం నుంచి ఈ వాటాను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. డీల్ విలువ రూ. 1,900 కోట్లుగా అంచనా. తాజా కొనుగోలుతో దక్షిణాది మార్కెట్లలోనూ కార్యకలాపాలు విస్తరించగలమని ఏబీ గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

అదానీ పోటీ

అంబుజాను సొంతం చేసుకోవడం ద్వారా 2022 సెప్టెంబర్‌లో సిమెంట్ పరిశ్రమలోకి అడుగు పెట్టిన డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ సైతం దేశీయంగా దిగ్గజాలతో పోటీపడుతోంది. స్విస్ దిగ్గజం హోల్సిమ్ నుంచి 6.4 బిలియన్ డాలర్లకు(సుమారు రూ. 51,000 కోట్లు) అంబుజా సిమెంట్‌ను కొనుగోలు చేసింది. తద్వారా ఏసీసీలోనూ మెజారిటీ వాటాను పొందింది. అంతేకాకుండా 2023లో మైహోమ్ ఇండస్ట్రీస్, సంఘీ ఇండస్ట్రీస్‌లను చేజిక్కించుకుంది. వెరసి 2028కల్లా 140 ఎంటీపీఏపై దృష్టిపెట్టి ముందుకు కదులుతోంది. ఇందుకు ప్రస్తుత యూనిట్ల విస్తరణ, ఇతర సంస్థల కొనుగోళ్ల తదితర ప్రణాళికలను అమలు చేస్తోంది. పెన్నా కొనుగోలుతో అదానీ గ్రూప్ సిమెంట్ తయారీ సామర్థ్యం 14 ఎంటీపీఏ పెరిగి 93 ఎంటీపీఏకు చేరిన సంగతి తెలిసిందే. 155 ఎంటీపీఏ(కన్సాలిడేటెడ్) సామర్థ్యంతో దేశీ సిమెంట్ రంగంలో నంబర్ వన్‌గా నిలుస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ తదుపరి రెండో ర్యాంకులో అదానీ గ్రూప్ నిలుస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

నిఫ్టీ 25,000 పాయింట్లకు..?





డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్ల విభజన

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-7-2024	
విశాఖ	485–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	480–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20



ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్

బర్మింగ్‌హామ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు.. వెస్టిండీస్‌పై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. మూడు రోజుల్లోనే ముగిసిన మూడో టెస్టులో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసి 3–0తో సిరీస్ చేజిక్కించుకుంది. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 7.2 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 87 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ బెన్ స్టోక్స్ (28 బంతుల్లో 57 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 33/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ చివరకు 175 పరుగులకు ఆలౌటైంది. మికైల్ లూయిస్ (57), కవెమ్ హడ్జ్ (55) మినహా మిగతావారు విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో మార్క్ వుడ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 376 చేసింది. వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అట్కిన్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి.

నిఖత్ 'పంచ్' సూపర్...



పారిస్: తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ తన పంచ్‌పవర్ చాటింది. మహిళల 50 కేజీల విభాగంలో తిరుగులేని ఆధిపత్యం కనబర్చిన నిఖత్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో నిఖత్ 5–0తో మ్యాక్సీ కరీనా క్లోట్జెర్ (జర్మనీ)పై విజయం సాధించింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ బౌట్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించగా... తన ఎత్తును సద్వినియోగ పర్చుకుంటూ జర్మనీ బాక్సర్ కూడా దీటైన పంచ్‌లు విసిరింది. అయితే రెండో రౌండ్‌లో తేరుకున్న నిఖత్.. కీలక సమయాల్లో హుక్స్, జాబ్స్‌తో పాయింట్లు కొల్లగొట్టి విజేతగా నిలిచింది. గురువారం జరగనున్న ప్రిక్వార్టర్స్‌లో ఫ్లయ్ వెయిట్ ప్రపంచ చాంపియన్ వూ యూ (చైనా)తో నిఖత్ తలపడనుంది. మరోవైపు మహిళల 54 కేజీల విభాగంలో భారత బాక్సర్ ప్రీతి పవార్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో ప్రీతి 5–0తో వియత్నాం బాక్సర్ వో థీ కిమ్‌పై ఏకపక్ష విజయం సాధించింది.

ఆర్చరీలో మళ్లీ నిరాశ



ఒలింపిక్స్ ఆర్చరీ క్రీడాంశంలో భారత్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ స్టార్ ఆర్చర్ దీపికా కుమారి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో.. తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అంకిత తడబడటం... భజన్ కౌర్ రాణించినా ఫలితం లేక పోవడంతో భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 0–6 (51–52, 49–54, 48–53)తో నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలైంది. దీపిక, అంకిత ఏమాత్రం ప్రభావం చూపలేక పోయారు. దీపిక, అంకిత సంధించిన బాణాలకు 4,6,7 పాయింట్లు కూడా రావడం భారత విజయావకాశాలపై ప్రభావం చూపింది.

మరో విజయం... సిరీస్ భారత్ సొంతం

- రెండో టి20లోనూ శ్రీలంక ఓటమి
- దంచేసిన జైస్వాల్, సూర్య, పాండ్యా
- 7 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు
- రేపు ఆఖరి టి20



పల్లెకెలె: చినుకులు పడినా... ఆట చాలాసేపు ఆగినా... భారత బ్యాటర్ల మెరుపుల్ని, విజయాన్ని ఎవరూ ఆపలేకపోయారు. దీంతో ఆదివారం జరిగిన రెండో టి20లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ 7 వికెట్ల తేడాతో లంకను ఓడించింది. ఇంకా 9 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా... ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. మొదట శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. టాపార్డర్‌లో కుశాల్ పెరీరా (34 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, ఓపెనర్ నిసాంక (24 బంతుల్లో 32; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవి బిష్ణోయ్ (3/26) కీలక వికెట్లు తీసి లంక ఇన్నింగ్స్‌కు అడ్డుకట్ట వేశాడు. అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ లక్ష్యఛేదనకు దిగగానే వానొచ్చి మ్యాచ్‌ను ఆటంక పరచడంతో లక్ష్యాన్ని 8 ఓవర్లలో 78 పరుగులుగా సవరించారు. దీన్ని టీమిండియా 6.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (15 బంతుల్లో 30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ (12 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) గెలిచేందుకు అవసరమైన మెరుపులు మెరిపించారు. సిరీస్‌లో చివరిదైన మూడో టి20 మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

పెరీరా ఫిఫ్టీ

తొలి మ్యాచ్‌లో చెలరేగిన ఓపెనర్లు కుశాల్ మెండిస్ (10), నిసాంకలను భారత బౌలర్లు ఈసారి కట్టడి చేశారు. అయితే వన్‌డౌన్ బ్యాటర్ పెరీరా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. నిసాంక, కమిందు మెండిస్ (23 బంతుల్లో 26; 4 ఫోర్లు)లతో కలిసి జట్టు స్కోరు పెంచాడు. 31 బంతుల్లో పెరీరా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. పాండ్యా ఒకే ఓవర్లో మెండిస్, పెరీరాలను అవుట్ చేస్తే... రవి బిష్ణోయ్ కూడా తర్వాతి ఓవర్లో షనక (0), హసరంగ (0)లను డకౌట్ చేయడంతో లంక తడబడింది. తర్వాత రమేశ్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు.

సులువుగా దంచేశారు!

వాన తర్వాత భారత లక్ష్యం 8 ఓవర్లలో 78 పరుగులుగా మారింది. అప్పటికే 3 బంతులు పడటంతో 45 బంతుల్లో 72 పరుగుల సమీకరణం భారత్‌కు ఏమంత కష్టం కాలేదు. సంజూ సామ్సన్ (0) డకౌటైనా... కెప్టెన్ సూర్యకుమార్, ఓపెనర్ యశస్వి దంచేసే పనిలో పడ్డారు. హసరంగ మూడో ఓవర్లో జైస్వాల్ 6, 4 కొడితే సూర్య మరో బౌండరీ బాదడంతో 16 పరుగులు వచ్చాయి. తీక్షణ మరుసటి ఓవర్లో సూర్యకుమార్ 'హ్యాట్రిక్' ఫోర్లు కొట్టి మరో 15 పరుగులు రాబట్టాడు. ఇదే ఊపులో పతిరణ ఐదో ఓవర్లో భారీ సిక్సర్ బాదిన సూర్య తర్వాతి బంతికే అవుటయ్యాడు. 5 ఓవర్లలో భారత్ 54/2 స్కోరు చేసింది. ఇక 18 బంతుల్లో 24 పరుగులు చేయాల్సివుండగా, 6వ ఓవర్లో సిక్స్‌కొట్టి యశస్వి అవుటైనా... హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దంచేయడంతో 18 పరుగులొచ్చాయి. మరుసటి ఓవర్లో పాండ్యా రెండు బౌండరీలతో మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 32; కుశాల్ మెండిస్ (సి) బిష్ణోయ్ (బి) అర్ష్‌దీప్ 10; పెరీరా (సి) రింకూ సింగ్ (బి) పాండ్యా 54; కమిందు మెండిస్ (సి) రింకూ సింగ్ (బి) పాండ్యా 26; అసలంక (సి) సంజూ సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 14; షనక (బి) బిష్ణోయ్ 0; హసరంగ (బి) బిష్ణోయ్ 0; రమేశ్ మెండిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 12; తీక్షణ (బి) అక్షర్ 2; పతిరణ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 161. **వికెట్ల పతనం:** 1–26, 2–80, 3–130, 4–139, 5–140, 6–140, 7–151, 8–154, 9–161. **బౌలింగ్:** సిరాజ్ 3–0–27–0, అర్ష్‌దీప్ 3–0–24–2, అక్షర్ 4–0–30–2, రవి బిష్ణోయ్ 4–0–26–3, పరాగ్ 4–0–30–0, పాండ్యా 2–0–23–2.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) షనక (బి) హసరంగ 30; సంజూ సామ్సన్ (బి) తీక్షణ 0; సూర్యకుమార్ (సి) షనక (బి) పతిరణ 26; పాండ్యా (నాటౌట్) 22; పంత్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (6.3 ఓవర్లలో 3 వికెట్లకు)** 81. **వికెట్ల పతనం:** 1–12, 2–51, 3–65. **బౌలింగ్:** షనక 1–0–12–0, తీక్షణ 2–0–16–1, హసరంగ 2–0–34–1, పతిరణ 1.3–0–18–1.

సుమిత్ తొలి రౌండ్‌లోనే...



ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం తడబడ్డాడు. తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన సుమిత్ శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 2–6, 6–2, 5–7తో ప్రపంచ 68వ ర్యాంకర్ కొరెన్‌టీన్ మౌటెట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 28 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 36 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 38 సార్లు దూసుకొచ్చి 21 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

ఫైనల్లో 'కప్' వదిలేశారు

ఆసియా కప్ టి20 టోర్నీ తుదిపోరులో భారత మహిళలకు షాక్

ఫైనల్లో 8 వికెట్లతో నెగ్గిన శ్రీలంక ● తొలిసారి ఆసియా కప్ టైటిల్ సొంతం



దంబుల్లా: భారత మహిళల జైత్రయాత్రకు ఫైనల్లో బ్రేక్! ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్ గెలుస్తుందనుకున్న జట్టును ఆతిథ్య శ్రీలంక గట్టి దెబ్బ కొట్టింది. అన్ని మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్‌ను అసలైన ఫైనల్లో శ్రీలంక ఓడించి తొలిసారి ఆసియా కప్‌ను ముద్దాడింది. ఆదివారం జరిగిన ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందంపై శ్రీలంక 8 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (47 బంతుల్లో 60; 10 ఫోర్లు) రాణించగా, రిచా ఘోష్ (14 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) ఆఖర్లో మెరిపించింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 18.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి జయభేరి మోగించింది. కెప్టెన్ చమరి అటపట్టు (43 బంతుల్లో 61; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత (51 బంతుల్లో 69; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో గెలిపించారు.



శబరి బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి



అయినవిల్లి వీరవల్లిపాలెంలో వరద నీటిలో స్థానికులు

మరింత పెరిగిన 'గోదావరి'

సాక్షి, అమరావతి/సాక్షి, అమలాపురం/ధవళేశ్వరం/చింతూరు/పోలవరం రూరల్: ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి మరింత ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం సా.6 గంటలకు బ్యారేజ్‌లోకి 15,99,761 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతుండగా.. డెల్టా కాలువలకు తొమ్మిది వేల క్యూసెక్కులు వదులుతూ మిగులుగా ఉన్న 15,90,761 క్యూసెక్కుల ప్రవాహాన్ని అధికారులు 175 గేట్లు ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి దాకా ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి గరిష్టంగా వచ్చిన వరద ఇదే. ఇక ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద నీటి మట్టం 15.7 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. మరోవైపు.. శనివారం రాత్రి నుంచి బేసిన్‌లో వర్షాలు కాస్త తెరిపివ్వడంతో ఎగువనున్న ప్రాణహిత, ఇంద్రావతి తదితర ఉప నదుల్లో వరద ప్రవాహం క్రమేణ తగ్గుతోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం కూడా క్రమేణ తగ్గుతోంది. ఆదివారం రాత్రి 7 గంటలకు 48.4 అడుగులకు చేరుకుంది. దీంతో మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుని రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఇక చింతూరు, కూనవరం వద్ద శబరి ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో గ్రామాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని 191 గ్రామాలు వరదలకు ప్రభావితమైనట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. 35,746 కుటుంబాలను 149 పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. అలాగే, పోలవరం ప్రాజెక్టులోకి 13,35,413 క్యూసెక్కులు చేరుతుండగా స్పిల్ వే 48 గేట్ల ద్వారా ఆ మొత్తాన్ని దిగువకు వదిలేస్తున్నారు. స్పిల్ వే ఎగువన నీటి మట్టం 34.12 మీటర్లకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలోని పోలీస్ చెక్‌పోస్ట్‌లో రెండు అడుగుల మేర నీరు చేరింది. దీంతో దీనిని మరోచోటుకి మార్చారు. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో కూడా ఐదు అడుగుల మేర వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, ఏజెన్సీ సిబ్బంది కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటుచేశారు. ఇక ఎగువన వరద ప్రవాహం క్రమేణ తగ్గుతుండడంతో సోమవారం నుంచి ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టనుంది.

లంక గ్రామాలను ముంచెత్తుతున్న వరద..

మరోవైపు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గౌతమి, వృద్ధ గౌతమి, వైనతేయ, వశిష్ట నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల్లో శనివారం కన్నా ఆదివారం సాయంత్రం అడుగున్నర నుంచి రెండడుగుల ఎత్తున వరద పెరిగింది. మరో రెండడుగుల వరకు పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని లంక గ్రామాల్లో జూన్ 19న మొదలైన వరద ముంపు పది రోజులుగా కొనసాగుతోంది. పి. గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో వరద తీవ్రత అధికంగా ఉంది. పలు లంక గ్రామాల్లోని ఇళ్లలోకి వరద చేరుతోంది. వరదలు, భారీ వర్షాలవల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డెల్టాలో మురుగునీటి కాలువలు పొంగి పొర్లుతుండడంతో సుమారు 5 వేల ఎకరాల్లో చేలు నీట మునిగాయి. అలాగే, లంక గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో అరటి, కంద, కూరగాయ పంటలు నీట మునిగాయని అంచనా. మరో నాలుగు రోజులపాటు వరద ముంపు ఉండే అవకాశం ఉన్నందున నష్టం మరింత పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్‌లు కె.గంగవరం మండలం కోటిపల్లి వరద ప్రాంతాల్లో పర్యటించారు.

పరిహారమివ్వండి.. పునరావాసం కల్పించండి..

వరద నీటిలో బాధితుల ఆందోళన

ఏటా వరదల కారణంగా బాధలు పడలేకపోతున్నామని, తమకు పోలవరం పరిహారం ఇచ్చి సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో వరద బాధితులు ఆదివారం వరదనీటిలో ఆందోళన చేపట్టారు. ఏటా జూలై నుంచి సెప్టెంబరు వరకు తమకు ఈ వరద కష్టాలు తీరడంలేదని, ఏడాది పొడవునా సంపాదించిందంతా వరదల సమయంలో సామాన్ల తరలింపుకే ఖర్చయిపోతోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడంతోపాటు ఇతర ప్రాంతాల్లో పునరావాసం కల్పించి తమను ఇక్కడినుంచి తరలించాలని బాధితులు డిమాండ్ చేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్న ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య హామీతో వారు ఆందోళన విరమించారు.

వర్షాలకు విరామం

- బలహీనంగా రుతుపవనాల ప్రభావం
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం

సాక్షి, విశాఖపట్నం: రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాలు మినహా.. ఇతర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. రుతుపవనాల ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాపై బలహీనంగా ఉండటంతో.. మరో 10 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో చెదురుమదురు వానలు మినహా.. మోస్తరు, భారీ వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో మాత్రం ఈ నెలాఖరు వరకు సాయంత్రం, రాత్రి వేళల్లో వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

వాటర్ ప్యాకెట్ల బోటు బోల్తా

- యువకుడి గల్లంతు, ఐదుగురిని కాపాడిన స్థానికులు
- ఊడిమూడిలంక వద్ద వశిష్ట నదీ పాయలో ప్రమాదం




విజయకృష్ణ (ఫైల్)

పి.గన్నవరం: వరద బాధితులకు వాటర్ ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్న ఒక ఇంజిన్ బోటు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒక యువకుడు గల్లంతు కాగా, లైఫ్ జాకెట్లు ధరించిన మరో ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక సమీపంలోని వశిష్ట నదీ పాయలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలో వరద ముంపునకు గురైన ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలకు ఉచ్చులవారిపేట ఏటిగట్టు నుంచి పడవపై వాటర్ ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఉచ్చులవారిపేట ఏటిగట్టు వద్ద సుమారు 200 వాటర్ ప్యాకెట్ల బస్తాలు ఇంజిన్ బోటులో లోడ్ చేశారు. పడవను నడుపుతున్న ఊడిమూడిలంకకు చెందిన మద్దా మురళి, కూలీలు నేలపూడి యోహాన్, నేలపూడి వెంకటేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, పీడబ్ల్యూఎస్ వర్కర్ గిడ్డి ఈశ్వర్ లైఫ్ జాకెట్లు ధరించారు. పెదపేటకు చెందిన మరో కూలీ చదలవాడ విజయకృష్ణ (27) లైఫ్ జాకెట్ ధరించలేదు. వీరు ఆరుగురు బోటులో ఊడిమూడిలంకకు బయల్దేరారు. 25 మీటర్ల దూరం వెళ్లే సరికి బోటు అదుపుతప్పి నీట మునిగిపోయింది. దీంతో ఈత వచ్చిన ఈశ్వర్ తన లైఫ్ జాకెట్‌ను విజయకృష్ణకు అందించాడు. అయినప్పటికీ విజయకృష్ణ నీట మునిగి గల్లంతయ్యాడు. మిగిలిన ఐదుగురు వ్యక్తులు వరద ఉధృతిలో ఒకటిన్నర కిలోమీటర్ల దూరం వరకూ కొట్టుకుపోయి అక్కడ ఉన్న చెట్ల కొమ్మలను పట్టుకుని వేలాడారు. ఒడ్డున ఉన్న ఒక వ్యక్తి బోటు మునిగిపోవడాన్ని గమనించి బూరుగులంక రేవులో పడవ నడిపే వ్యక్తికి సమాచారం అందించాడు. దీంతో హెచ్‌సీ బూరుగులంక నుంచి రెండు బోట్లలో నదిలోకి వెళ్లి చెట్లకు వేలాడుతున్న ఐదుగురినీ రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. గల్లంతైన యువకుడి కోసం ఎన్డీఆర్‌ఎఫ్ దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

రేపు శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 3.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- నేడు శ్రీశైలంలోకి మరింత పెరగనున్న వరద



సాక్షి, అమరావతి/శ్రీశైలంప్రాజెక్ట్/హొళగుంద: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులోకి 3.79 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులు తరలిస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 61,111 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 59 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయానికి ప్రాజెక్టు నిండిపోతుంది. మంగళవారం ఉదయం ఆరు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి నాగార్జునసాగర్‌కు నీరు విడుదల చేయనున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీటి విడుదలను ప్రారంభించనున్నారు. నాగార్జునసాగర్‌లోకి 53,774 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 510.2 అడుగుల్లో 132.01 టీఎంసీలకు చేరుకుంది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో కృష్ణా నదిలో ఎగువన వరద ఉధృతి కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 2.68 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 3.25 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 3.20 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 3.27 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 3.04 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 2.98 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

ప్రమాదకర స్థాయిలో తుంగభద్ర ప్రవాహం

తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యామ్‌లోకి 1.24 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. మొత్తం 33 గేట్లను ఎత్తి 1.51 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దీంతో మంత్రాలయం వద్ద తుంగభద్ర వరద ఉధృతి మరింతగా పెరిగింది. మంత్రాలయం వద్ద అధికారులు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. సుంకేశుల బ్యారేజ్‌లోకి 1.49 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులను వదులుతూ 1.46 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. అటు జూరాల నుంచి కృష్ణా వరద, ఇటు సుంకేశుల నుంచి తుంగభద్ర వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్న వరద ప్రవాహం గంటగంటకు పెరుగుతోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత



సొంతదారులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

రాయచూరురూరల్: నగరంలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకొని సొంతదారులకు అప్పగించారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు 16 మంది ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని సొంతదారులకు సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సత్యనారాయణ అందజేశారు. వీటి విలువు రూ.3.70లక్షలు ఉంటుందని సీఐ ఉమేష్ కాంబ్లే తెలిపారు.

కవులతో ఉత్తమ సమాజం



పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కవుల రచనలతోనే ఉత్తమ సమాజం నిర్మితమవుతుందని బీదర్ బుద్ధవిహార్ దేవనాం ప్రియదమ్మదీప భంతేజ అన్నారు. కవి సురేష్ బాబు రచించిన దారీ చూపిన దీపాలు పుస్తకాన్ని ఆదివారం కన్నడ భవన్‌లో ఆవిష్కరించారు. తోటివారికి సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. నందిని అస్పత్రి ప్రధాన వైద్యుడు మహలింగప్ప, జయదేవి, వెంకటేష్, బేవిన బెంచి, అబ్దుల్,వీర హనుమాన్, చంద్ర శేఖర్ పాటిల్, భాస్కర్, సురేష్ బాబు పాల్గొన్నారు.

బంగారు దొంగపై మరో కేసు

హుబ్లీ: స్థానిక కేశ్వాపుర జ్యువెలరి అంగడిలో చోరీకి పాల్పడిన నిందితుడిపై ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడంతో హత్యాయత్నం చేశాడని మరో కేసు నమోదైంది. నిందితుడు ఫర్హాన్ షేక్ పోలీస్ అధికారి, సిబ్బందిపై దాడి చేసి పరారు కావడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు కాల్పులు జరిపి తిరిగి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలోని అతడిపై గోకుల్ రోడ్డు పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

రేపు రేణుకా యల్లమ్మ జాతర ఉత్సవాలు



అలంకరణలో రేణుకా యల్లమ్మదేవి

బళ్లారిటౌన్: సంగనకల్లు రోడ్డులోని సుబ్బరావు క్యాంప్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ దేవి మూడో ఏడాది జాతర ఉత్సవాలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఆలయం సమితి నాయకుడు సద్గురు జుమారి తాత పేర్కొన్నారు. అందులో భాగంగా ఆలయంలో 29న ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకీ ఉత్సవాలు, 30 సాయంత్రం మహారథోత్సవాన్ని మంగళవాయిద్యాలతో పల్లకీ ఉత్సవాలు, తొలుత కుంభాల ఊరేగింపుతో జరుపుతున్నట్లు తెలిపారు. 31న పల్లకీ ఉత్సవాలు, లంకా దహనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, ఉత్సవం రోజున పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మ జోగతి తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ముగ్గురు దొంగలు అరెస్ట్

హుబ్లీ: నగర శివారు ప్రాంతంలో చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసిన గ్రామీణ పోలీసులు వారి నుంచి బైక్, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. హానగల్ రాజీవ్ నగర్ వినయ్ కట్టిమని(24), కుందగోళ హొసహంచినాళ జగదీశ్ బండివాడ(21), హానగల్ వివేకానంద నగర గణేష్ ఒంబరిడి(21) అరెస్ట్ అయిన నిందితులు. ఇక్కడి కుసుగల్ రింగ్ రోడ్డులో బాబాసాహెబ్ జకాతి అనే వ్యక్తిపై దాడి చేసి రూ.5,500 నగదు, మొబైల్ లాక్కొని పరారయ్యారు. కేసును నమోదు చేసుకున్న హుబ్లీ గ్రామీణ పోలీసులు సీఐ మురుగేష్ చెన్నన్నవర నేతృత్వంలోని బృందం కార్యాచరణ జరిపి వీరిని అరెస్ట్ చేసింది. ఈ కేసు మిస్టరీ ఛేదనలో ప్రతిభ చూపిన పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ గోపాల బ్యాకోడ్ అభినందించారు.


ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



జాతాను ప్రారంభిస్తున్న జయన్న

రాయచూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పోషించాలని నగరసభ సభ్యుడు జయన్న పిలుపునిచ్చారు. వృక్ష జాగృతి మహోత్సవంలో భాగంగా రాయచూరు హసిరుబళగ, అటవీ శాఖ, నగరసభ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు జాతాను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆఫీసర్ల కాలనీలో మొక్కలు నాటారు. నగరంలో పచ్చదనం పెంపొందించాలంటే విరివిగామొక్కలు నాటాలన్నారు. అటవీశాఖాధికారి రాజేష్, నవీద్, తిప్పణ్ణ, రామచంద్ర, శరణ బసవ, నాగేష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంకా తగ్గని వరద ఉధృతి



తుంగభద్ర డ్యాం 33 గేట్లను పైకెత్తిన దృశ్యం



హువిన హడగి వంతెనపై ప్రవహిస్తున్న కృష్ణమ్మ

- ఆల్మట్టి నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- తుంగభద్ర నుంచి నదికి 1.90 లక్షల క్యూసెక్కుల నీరు


రాయచూరు రూరల్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆల్మట్టి డ్యాం నుంచి కృష్ణా నదికి 3 లక్షల క్యూసెక్కుల నీటిని నారాయణపుర డ్యాంకు వదిలారు. ఆదివారం యాదగిరి జిల్లా హుణిసిగి తాలూకాలోని నారాయణ పుర డ్యాం నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు నదికి వదిలారు. బెళగావి, బాగలకోటె, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాలుగా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలో అధికంగా వానలు పడుతుండడంతో నదికి నీటిని అధిక ప్రమాణంలో విడుదల చేశారు. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హువిన హడగి వంతెనపై నీరు ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడ రోడ్డు వంతెనలు నీటమునగడంతో రాయచూరు, కలబుర్గి, విజయపుర జిల్లాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. శనివారం జిల్లాధికారి నితీష్, ఎస్పీ పుట్టమాదయ్య, ఏసీ మెహబూబీ హువిన హడగి వంతెనను పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో పరిశీలన

కోశూరు క్రాస్ వద్ద రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, యాదగిరి జిల్లా ఇంచార్జి మంత్రి శరణ బసప్ప దర్శనాపూర్ సందర్శించారు. ఇలా ఉండగా గత వారం రోజుల నుంచి శివమొగ్గ, చిక్కమగళూరు తదితర డ్యాం పైభాగంలోని జిల్లాల్లో వానలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం పూర్తిగా నిండినందున నదికి 1.90 లక్షల క్యూసెక్కుల నీరు వదలడంతో వరద ముంచెత్తింది. కొప్పళ, రాయచూరు జిల్లాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయచూరు జిల్లా సింధనూరు, మాన్వి, రాయచూరు తాలూకాల్లో నదీ తీరంలోని మాన్వి తాలుకా దాసర కట్ట, రాయచూరు తాలూకా ఎలెబిచ్చాలి రాయల ఏకశిలా బృందావనం, జపం కట్ట, ఉగ్ర నరసింహస్వామి, బిచ్చాలమ్మ ఆలయం, నాగదేవత కట్ట, శివ లింగం జలావృతం అయ్యాయి. నదీ తీర ప్రాంతాల ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉత్తుంగభద్ర

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లాల ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్రకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో శనివారం సాయంత్రం డ్యాం నుంచి మొత్తం 33 గేట్లను పైకెత్తి 1,40,000 క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదిలారు. ప్రస్తుతం డ్యాంలో నీటినిల్వ 98.375 టీఎంసీలకు వరకు చేరుకొంది. డ్యాంకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. డ్యాం ఎగువన ఉన్న శివమొగ్గ, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబె, చిక్కమగళూరు తదితర పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు వరద నీరు యథావిధంగా తరలి వస్తోంది. డ్యాం దిగువ ప్రాంతాల్లో ఉన్న హంపీలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటికే హంపీలోని అనేక మంటపాలు, స్మారకాలలోకి నీరు చేరింది. ఆనెగుందిలో విజయనగర సామ్రాజ్య సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల సమాధి పూర్తిగా మునిగి పోయింది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1631.08 అడుగులకు చేరుకొంది. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలోనైనా డ్యాం క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరికలు అమలు చేశారు.



హంపీ వద్ద పొంగిప్రవహిస్తున్న తుంగభద్రా నది



ఆనెగుంది రాతి వంతెన వద్ద తుంగభద్ర పరవళ్లు



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీలు

సమాజానికి వారధులు పాత్రికేయులు



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజానికి పాత్రికేయులు వారధిలాంటి వారని రాష్ట్ర వైద్యవిద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, చిన్న నీటిపారుదల, సైన్స్ సాంకేతిక విద్యా శాఖా మంత్రి బోసురాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రాం సభా మంటపంలో జిల్లా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నేడు యువకులు పత్రికా రంగంలో ముందుకు వస్తున్నారన్నారు. సమాజంలో పేరుకున్న సమస్యలపై స్పందించాలన్నారు. సోషల్ మీడియా ప్రభావం అధికమైందన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

జీవమాన సాధక అవార్డులు పొందిన విలేకరులు నరసింగరావ్, నాగరాజ్, జిల్లా స్థాయి అవార్డులు పొందిన రఘునాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావ్, విఠల్, రామణ్ణ, మహంతేష్, నాగరత్న, అబ్దుల్ ఖాదర్, హనుమేష్, రాఘవేంద్ర, ముత్తన్నలను సన్మానించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, నగర విధాన సభ సభ్యుడు శివరాజ్ పాటిల్, మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్, సింధనూరు శాసన సభ్యుడు హంపనగౌడ బాదర్లి, మస్కి శాసన సభ్యుడు బసనగౌడ తుర్విహాళ, విధాన పరిషత్ సభ్యుడు వసంత కుమార్, వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గురునాథ్, ప్రధాన కార్యదర్శి పాషా, రాష్ట్ర సభ్యుడు శివమూర్తి, శివప్ప, వెంకటేష్ లున్నారు.

షటిల్ విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు ట్రోఫీలను అందిస్తున్న జిల్లా ఎస్పీ శోభరాణి

బళ్లారిఅర్బన్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ బళ్లారి శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జిల్లా మైదానంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆద్యంతం అలరించి ఆసక్తికరంగా సాగాయి. ఆదివారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలను ముఖ్యఅతిథులు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో బళ్లారి వైద్యులు విజేతలుగా కొన్నింట రన్నరప్‌గా నిలిచారు. నాకౌట్ దశలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 58 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. చివరి పోటీల్లో మహిళా విభాగం డబుల్స్‌లో బెళగావి డాక్టర్ దీప, హుబ్లీ డాక్టర్ పూజ, బళ్లారి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దీప విజయం సాధించారు. అలాగే 40 ఏళ్ల వయస్సు మించిన విభాగంలో ఉత్తర కన్నడ డాక్టర్ అపర్ణ, డాక్టర్ కోకిల హెగ్డే సింగిల్స్‌లో విజయం సాధించారు. మొత్తానికి వివిధ విభాగాల్లో 10 ఫైనల్ పోటీలకు గాను బెస్టాప్ త్రీ ఎవరూ సాధించలేదు. అన్ని నేర సేట్ల ద్వారానే గెలుపు సాధించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శోశారాణి విన్నర్, రన్నరప్‌లకు ట్రోఫీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మహేష్‌చంద్ర, కోశాధికారి సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్, సీనియర్ దంత వైద్యులు శేషగిరిరావువ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రాజీవ్, రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ మంజునాథ్, డాక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

తల్లి ఫిర్యాదు స్వీకరించ లేదని తనయుడి వీరంగం

చెళ్లకెరె రూరల్ : తల్లి ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించలేదని తనయుడు పోలీస్ స్టేషన్ వద్ద చేసిన హంగామా సోషల్ మీడియాలో వైరల్ అయింది. పట్టణానికి చెందిన పృథ్వీరాజ్ గొడవ చేసిన యువకుడు. పృథ్వీరాజ్ చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం తల్లికి చెప్పకుండా బెంగళూరుకు వెళ్లాడు. దీంతో తల్లి తన కొడుకు కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లింది. అయితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. పృథ్వీరాజ్ చెళ్లకెరెకు తిరిగి వచ్చిన తరువాత తల్లి తన ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోవడంపై కొడుకుతో చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన పృథ్వీరాజ్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో గొడవకు దిగాడు. తాను చేస్తున్న హంగామా అంతా వీడియోలో చిత్రీకరించాడు. చివరికి పోలీసులు మొబైల్ లాక్కుని పృథ్వీరాజ్‌ను అక్కడి నుంచి పంపారు. తనకు న్యాయం చేయాలని లేకుంటే తనకు ఏం చేయాలో తెలుసునని, తన వద్ద మొత్తం బెంగళూరు మ్యాప్ ఉంది. డీఆర్‌డీఓ, మెట్రో, అంతటా ఎలక్ట్రిక్ పని చేసిన అనుభవం కలవాడిని, తనకు న్యాయం జరగకుంటే మొత్తం బెంగళూరునే బ్లాస్ట్ చేస్తానని అన్న మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

విజ్ఞాన శిఖరం అబ్దుల్ కలాం



అవార్డులు అందజేస్తున్న దృశ్యం

రాయచూరురూరల్: విజ్ఞాన రంగంలో దేశానికి వన్నె తెచ్చిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం అని కిల్లే బృహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అన్నారు. పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో అబ్దుల్ కలాం సంస్థ అధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అబుద్దల్ కలాం వర్ధంతి కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. అబ్దుల్ కలాం అదర్శాలను నెరవేరాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం అబ్దుల్ కలాం పేరుతో ఏర్పాటు చేసిన అవార్డులను పలువురు ప్రముఖులకు ప్రదానం చేశారు. అబ్దుల్ కలాం సంస్థ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, బ్రహ్మ కుమారి విశ్వవిద్యాలయం సంచాలకులు స్మిత, కిరణ్, సాజిద్ సమీర్, రాకేష్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

రాజీవ్ హయాంలోనే ముడా స్కాం



మాట్లాడుతున్న బసవనగౌడ పాటిల్ యత్నాళ్

హుబ్లీ: పాలక, విపక్షాల మధ్య పతాక స్థాయికి చేరిన ముడా కుంభకోణంపై విజయపుర నగర ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ స్వపక్ష నేతల పైనే సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ అధ్యక్షుడు హెచ్‌వీ రాజీవ్ బీజేపీలో ఉన్నప్పుడు ఈ స్కాం చోటు చేసుకుందని, ప్రస్తుతం రాజీవ్ కాంగ్రెస్‌లో చేరారన్నారు. విజయపురలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. స్కాంలన్ని మూసివేయడానికి రాజీవ్ కాంగ్రెస్‌లోకి చేరారని ఆయన ఆరోపించారు. రాజీవ్ ఎవరి శిష్యుడన్నది అందరికీ తెలిసిందేనన్నారు. కేవలం సిద్దరామయ్యను మాత్రమే లక్ష్యంగా చేసుకోవద్దని తాను విధానసభలోనే చెప్పానన్నారు. ప్రస్తుతం విజయేంద్ర చెబుతున్నారు. ఇది కేవలం సిద్దరామయ్యపై పోరాటం కాదు, కాంగ్రెస్‌పై పోరాటం అని, అంటే సిద్దరామయ్య ఎవరు, వేరేనా? లేక బీజేపీ వేరేనా బుడా స్కాంలో యడియూరప్ప ఉన్నా, విజయేంద్ర ఉన్నా, యడియూరప్ప అక్క పిల్లలు ఉన్నా రాజీవ్ మరెవరు ఉన్నా అందరు దొరుకుతారన్నారు. రాజీవ్ యడియూరప్ప శిష్యుడో, విజయేంద్ర శిష్యుడో తెలపాలన్నారు. రాజీవ్ మీ శిష్యుడేనని, ఎందుకు పాదయాత్ర చేస్తారు అని విజయేంద్రనే అడగండి అని విలేకరులను తిరిగి ప్రశ్నించారు. మంత్రి నాగేంద్ర రాజీనామా స్వీకరించినందుకు సీఎంను అభినందిస్తానన్నారు. నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ అధ్యక్షుడు అని మంత్రి వర్గం నుంచి తొలగించాల్సింది. అప్పుడు నిజమైన సిద్దరామయ్య అని లోకానికి తెలిసేది. కాబట్టి ఈ కేసును సీబీఐ చేత దర్యాప్తు చేయించాలని యత్నాళ్ డిమాండ్ చేశారు.

పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలంటూ వంచన

హుబ్లీ: యూబీఎస్‌ఈ గ్రూప్ ఎల్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని నమ్మించి నగరానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.20.65 లక్షలను ఆన్‌లైన్‌లో కేటుగాళ్లు తమ ఖాతాల్లోకి బదలాయించుకొని వంచించిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈశ్వర్ నగర్ సదాశివ పాటిల్ మోసానికి గురైన వ్యక్తి. గూగుల్‌లో బ్రౌజింగ్ చేస్తుండగా యూబీఎస్‌ఈ వాణిజ్య ప్రకటనను చూశాడు. దీనిపై క్లిక్ చేయగా వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. ఈ క్రమంలో అక్షత అనే మహిళ ఫోన్ చేసి డబ్బులు పెట్టుబడి గురించి వివరాలు తెలియజేశారు. యూబీఎస్‌ఈ ఏపీఐఈ అనే యాప్ డౌన్‌లోడ్ చేసి ట్రేడింగ్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఆ తర్వాత వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి విడతల వారీగా డబ్బులు బదలాయించుకొని వంచించినట్లు బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

జెండర్ మైనార్టీలకు రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న వైశాలి

హొసపేటె: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు లింగనిర్ధారణ మైనార్టీ కమ్యూనిటీ నిబంధనలు అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జుజు కమ్యూనిటీ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు వైశాలి కోరారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైశాలి మాట్లాడుతూ నిబంధనల్లోని లింగనిర్ధారణ మైనార్టీలు, స్త్రీ, పురుషులు వంటి వాటి గురించి స్పష్టంగా చెప్పారు. స్థానిక సంస్థలు నిర్వహించే అన్ని దశల్లోని ఎన్నికల్లో తమ సంఘంలోని సభ్యులకు గుర్తింపు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని అన్నారు. అన్ని స్థాయిల్లో గౌరవం ఇవ్వాలన్నారు. భిక్షాటన మానేయాలంటే ప్రభుత్వం అన్ని సౌకర్యాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ శక్తి అవార్డు గ్రహీత జోగతి మంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల రోడ్డు

- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వాహనదారుల పాట్లు వర్ణనాతీతం



అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉన్న రోడ్డు

హొసపేటె: విజయనగర జిల్లా కొట్టూరు పట్టణంలోని జేపీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల వైపునకు వెళ్లే రోడ్డు వర్షాల కారణంగా బురదమయంగా మారి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై బురదలో కూరుకుపోయి నానాపాట్లు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్ని నీటి కుంటలుగా మారి వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. బురదమయంగా ఉండటంతో డెంగీ, మలేరియా ప్రబలే అవకాశాలున్నాయని పాఠశాల, కళాశాల విద్యార్థులు, సామాన్య ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీంతో తమ పిల్లలను సమయానికి బడికి పంపలేక పోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిస్తే ఈ రోడ్డు బురదమయంగా మారి వాహనదారులు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్డు దుస్థితికి కారణమైన ప్రజాప్రతినిధులు, అధికారులకు జాలీ ప్రశాంత్, చంద్రు, కొట్రేశ్ శాపనార్థాలు పెట్టారు.

మైదానానికి ఆ పేరు పెట్టండి

రాయచూరు రూరల్: నగరంలోని క్రికెట్ మైదానానికి దివంగత క్రీడాకారుడు విజయ్ రెడ్డి పేరు పెట్టాలని బాలంకు అస్పత్రి డాక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. విజయ్‌రెడ్డి జ్ఞాపకార్థం యస్‌సీఏబీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్‌కు మంచి ఆదరణ ఉన్నందున క్రీడాకారులకు మంచి సదుపాయాలు కల్పించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం శిబిరంలో యువకులు రక్తదానం చేశారు. శ్రీకాంత్, శరణు రెడ్డి, అంబాపతి, విజయ్ కుమార్, అరుణ, అంజినేయ పాల్గొన్నారు.

గవాయి సంగీత సేవ అనన్యం



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: పండిత పుట్టరాజ్ గవాయి అంధ విద్యార్థుల సంగీత రంగానికి చేసిన సేవలు అనన్యమని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, సోమవారపేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య అభిప్రాయ పడ్డారు. ఆదివారం నగరంలోని గణదిన్ని కళ్యాణ మంటపంలో పంచాక్షరి గవాయి పుణ్యారాధన దినోత్సవంలో 44వ సంగీతోత్సవ సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు.లను స్మరించారు. సమ్మేళనంలో చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజ్. శాసన సభ్యులు శివరాజ్ పాటిల్, గిరిజా శంకర్, పదాధికారులు నరసింహులు, సుధాకర్, సూగూరేష్, ఇబ్రహీం, వెంకటేష్‌లున్నారు.

బస్సును ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి

రాయచూరురూరల్: బస్సును కారు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన లింగసూగూరులో ఆదివారం జరిగింది. ముద్దేబిహాల్ నుంచి లింగసూగూరు వైపు వెళుతున్న కేఎస్ ఆర్టీసీ బస్సును ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో కరడకల్‌కు చెందిన వీరేష్(25), చెన్నబసవ (24)లు మృతి చెందారు. మద్యం మత్తులో కారు నడపడం వల్ల ఈఘటన జరిగినట్లు డీఎస్పీ దత్తాత్రేయ తెలిపారు.

డ్యాంలో పర్యాటకుల సందడి



తుంగభద్ర డ్యాంను వీక్షిస్తున్న పర్యాటకులు

హొసపేటె: తుంగభద్ర డ్యాం పర్యాటకులతో కిటకిటలాడింది. వరద నీటితో డ్యాం నిండుకుండలా మారడంతో గేట్లు ఎత్తి భారీగా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో డ్యాం అందాలను వీక్షించేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు, స్థానికులు తరలివచ్చారు. డ్యాంలో నీటి అలలను వీక్షించి పులకించిపోయారు. తుంగభద్ర డ్యాం అందాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేయండి

రాయచూరురూరల్: వరదలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని వైద్యశాఖ మంత్రి శరణు ప్రకాష్ పాటిల్, చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ ఆదేశించారు.ఆదివారం వారు కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. వారం రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాలు వరదలకు గురయ్యాయన్నారు. కృష్ణా నది ఉప్పొంగడంతో పంటలు నీట మునిగాయన్నారు. అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి రైతులను ఆదుకోవాలన్నారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. మస్కి, రాయచూరు, మాన్వి, సింధనూరు ఎమ్మెల్యేలు బసనగౌడ, శివరాజ్ పాటిల్, హంపయ్య నాయక్, హంపన గౌడ బాదర్లి,జిల్లాధికారి నీతిష్, ఎస్పీ పుట్టమాదయ్య పాల్గొన్నారు.

భక్తులకు ముద్రాధారణ



ముద్రాధారణ చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

రాయచూరు రూరల్: నగరంలో జవహర్ నగర్‌లోని మంత్రాలయ మఠంలో భక్తులకు ఆదివారం మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ముద్రాధారణకు శ్రీకారం చుట్టారు. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ముద్రాధారణ జరిపారు.

స్టీల్ అంగడిలో అగ్నిప్రమాదం

హుబ్లీ: దాజిబాన పేట గణపతి దేవస్థానం దగ్గర కలబుర్గి స్టీల్ అంగడిలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం వాటిల్లి రూ.25 వేల విలువైన సామగ్రి ఆహుతైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మోహన్ కలబుర్గికి చెందిన అంగడిలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదాన్ని పసిగట్టి అంగడి సిబ్బంది తక్షణమే బయటకు వచ్చారు. స్థానిక పోలీసులు అగ్నిమాపక దళానికి ఫోన్ చేశారు. వెంటనే అగ్నిమాపక దళం సిబ్బంది విచ్చేసి సుమారు రూ.4.25 లక్షల విలువ చేసే స్టీల్ వస్తువులను క్షేమంగా బయటకు చేరవేసినట్లు హుబ్లీ నగర అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని వారు వివరించారు.

హత్య బెదిరింపులపై ఫిర్యాదు

హుబ్లీ: నిన్ను, మీ నాన్నను కలిపి చంపేస్తానని స్థానిక విద్యార్థిని ఓ యువకుడు చాకు చూపించి బెదిరించిన ఘటనపై పాత హుబ్లీ హెగ్గేరి బేకరి వద్ద చోటు చేసుకుంది. అయోధ్య నగర అంబేడ్కర్ కాలనీ నివాసి ఆకాశ్‌పై విద్యార్థి ఫిర్యాదు చేశారు. ఆకాశ్ తన ఇంటి వద్దకు వచ్చి చాకు చూపించి నిన్ను, మీ నాన్నను హత్య చేస్తానని బెదిరించాడని తెలిపాడు. మొదట్లో పోన్లే అని ఊరుకుంటే నిందితుడు తన వెంటపడి బెదిరించినట్లు బాధితుడు పాత హుబ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.